thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 297 | కరీంనగర్ శనివారం, 3 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇస్రో కోసం స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్లు

బెంగళూరు : ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) సంయుక్తంగా స్పేస్ అప్లికేషన్ల కోసం విక్రమ్ 3201, కల్పన 3201 అనే 32-బిట్ మైక్రోప్రాసెసర్లను అభివృద్ధి చేశాయి. ఈ మేరకు తొలి ఉత్పత్తులను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్.. ఇస్రో చైర్మన్ వి నారాయణన్‌కు అందజేశారు. విక్రమ్ 3201ను లాంచ్ వెహికిల్స్ కోసం స్వదేశీయంగా తయారు చేశారు. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనైనా ఉపయోగించడానికి అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ తయారీ 32 బిట్ మైక్రోప్రాసెసర్.

# జల వివాదాల పరిష్కారానికి కేంద్రం సంపూర్ణ సహకారం: కిషన్‌రెడ్డి

ఢిల్లీ, జనవరి2 : జల వివాదాల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సంపూర సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ కమిటీలో KRMB, GRMB చైర్మన్లు, CWC, NWDA చీఫ్ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు ఇవాళ(శుక్రవారం) ఓ ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి.




**సంపూర్ణ సహకారం..** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి సంపూర? సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**కృష్ణాజలాల వినియోగంపై వాదనలు..** ఉదాహరణకు.. కృష్ణానది జల వివాద పరిష్కారానికి 6 అక్టోబర్ 2023నాడు KWDT-2ను ఏర్పాటుచేసి.. అడిషనల్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌ను నిర్దేశించింది. రెండేళ్ల కాల వ్యవధి 1 ఆగస్టు, 2025 నాడు ముగిసింది. కృషా జలాల వినియోగంపై వాదనలు నడుస్తోండటంతో దీన్ని మరో ఏడాది (31 జూలై, 2026) పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇలా తెలుగు రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది.

**అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు..** కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని చాప్టర్ 9, సెక్షన్ 84 ప్రకారం.. కృషా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే.

**ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీ..** ఈ సమావేశంలో.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిరయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో ఇవాళ (శుక్రవారం) కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది.

**కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో..** ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు హైదరాబాద్ చైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్లు, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చీఫ్ ఇంజనీర్, CWC చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.



## బీఆర్ఎస్ సంచలన నిర్ణయం... అసెంబ్లీ బహిష్కరణ

హైదరాబాద్ : అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బాయికాట్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు మీడియాకు తెలియజేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిరయం తీసుకుందన్నారు. స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేస్తున్నామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ తీరు చూస్తుంటే శాసనసభ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. బీఏసీ మీటింగ్‌కు ప్రభుత్వం తరపున గంటన్నర లేటుగా వచ్చారని.. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీని బూతులమయం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మైక్ ఇవ్వరా అని ప్రశ్నించారు. పార్లమెంటులో మోదీని రాహుల్ గాంధీ తిట్టడంలేదా అని నిలదీశారు. అసెంబ్లీలో తాను సీఎం గురించి మాట్లాడితే తప్పు ఏంటి అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లాగా, సీఎల్పీ మీటింగ్‌లాగా మార్చారంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ కంపు కంటే సీఎం నోటి నుంచి వచ్చే మాటల కంపు ఎక్కువంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా లేక స్ట్రీట్ రౌడీనా అని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి, నీళ్ల ద్రోహి అని.. కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. ప్రతి దానికి కమీషన్లు తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.





# అభివృద్ధి చేస్తుంటే... విపక్ష నేతలు...

# విషం కక్కుతున్నారు!

## అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 02: కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జలవనరులను కలుషితం చేసి కబ్జాలు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించారని.. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని మండిపడ్డారు. అందుకే ఆ డ్రైనేజీలను కూలగొట్టి.. కబ్జాలపై చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. గతంలో గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యూపీలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బీజేపీ ఎన్నికల అజెండాగా మర్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచామన్నారు. 3 సంస్థల జాయించ్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. నగరం దాహార్తి తీర్చేందుకు 15 టీఎంసీలు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మరో 5 టీఎంసీలు గండిపేటకు తరలించాలని యోచన తమ ప్రభుత్వానికి ఉందని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం%ా% మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కన్ఫ్యూజన్‌లో కవిత: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, జనవరి 02: తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్మునికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివరించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

## కేసీఆర్, హరీష్ రావులపై కవిత షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్, జనవరి 2: కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈరోజు (శుక్రవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు.


**రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి..** అలాగే పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరి తీయాలంటే, రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారామె. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్నని ప్రశ్నించారు కవిత.

**హరీష్ రావు బచ్చా..** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్ రావు ఒక బచ్చా అని అన్నారు.

ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసంటూ హరీష్‌ను టార్గెట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

**రాజీనామాపై..** సెప్టెంబర్ 3న తాను రాజీనామా చేశానని.. నాలుగు నెలల కాలంలో అనేక సమీకరణాలు జరిగాయని ఈ సందర్భంగా తెలిపారు కవిత. తనకు మాట్లాడే అవకాశాలు ఇవ్వాలని సభకు వచ్చినట్లు చెప్పారు. ఒక ఫైల్.. భట్టి దగ్గరకు వస్తే నెలల తరబడి ఉంటుందని.. ఎందుకు ఇంత అలసత్వమని ప్రశ్నించారు. సభా అవకాశాల దృష్ట్యా తాను తన రాజీనామా అంశాన్ని మండలి చైర్మన్ దగ్గర ప్రస్తావిస్తానని అన్నారు. చాల గ్రామాల్లో అన్ని పార్టీలు కలిసి పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేశాయని.. అందుకే ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదని తెలిపారు. అక్కడక్కడా మోదీ, కేసీఆర్ ఫోటోలు పెట్టినట్లు తెలిపారు.

కొన్నిచోట్ల జాగృతి తరపున కూడా గెలిచారని చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఏదో కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. పరోక్ష పద్ధతిలో ఈ ఎన్నికల్లో సర్పంచ్‌ల ఓట్లు వేసేలా కుట్ర జరుగుతోందని.. త్వరలో దీన్ని బయటపెడతామని స్పష్టం చేశారామె.




**నాకే సంబంధం లేదు..** సభలో హరీష్ వర్సెస్ రేవంత్ రెడ్డిల మధ్య వార్ ఉండనుందని కవిత చెప్పుకొచ్చారు. ఇది మరోసారి బీఆర్ఎస్‌కు బలమైన ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. బబుల్ షూటర్ వచ్చి సభలో మాట్లాడితే పార్టీ బద్నామ్ అవుతుందంటూ ఎద్దేవా చేశారు. ఒక్కసారి కేసీఆర్ సభకు వచ్చి వివరణ ఇస్తే బాగుటుందని ఆమె అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌కు, తనకు సంబంధం లేదని.. ఇక ముందు ఉండబోదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎందుకు సభకు రావడం లేదో తనకు తెలీదని.. గత నాలుగు నెలలుగా కేసీఆర్‌తో మాట్లాడలేదని చెప్పారు. ఇక్కడ ఫిక్స్‌డ్ మ్యాచ్ నడుస్తోందని ఆరోపించారు. అది సభా వేదికగా బయటపడిందన్నారు. నీటి వాటాల అంశంలో కేసీఆర్ ఒక్కరే సమాధానం చెప్పగలరని.. హరీష్ రావుకు అవకాశం ఇవ్వడం అనేది సరైంది కాదని కవిత పేర్కొన్నారు.

చురకలు






హైదరాబాద్: నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. "గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. నిందితులపై ఉక్కుపాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉంది. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నాం. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదు" అని రేవంత్ వివరించారు.

**సభ ముందుకు పురపాలక, జీహెచ్‌ఎంసీ చట్టసవరణ బిల్లు...** పురపాలక, జీహెచ్‌ఎంసీ చట్టసవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు. మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లును కూడా సభ ముందుకు ఆయన తీసుకొచ్చారు.

మరో మంత్రి దామోదర రాజనర్సింహ.. తెలంగాణ ప్రైవేటు వర్సిటీల చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు.




## తెలంగాణలో వరుస ప్రమాదాలు.. నెత్తురోడిన రోడ్లు

హైదరాబాద్, జనవరి 2: రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనం నడపడం ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈరోజు (శుక్రవారం) రాష్ట్రంలో మొత్తం మూడు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగాయి.

ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మాదాపూర్‌లో కారును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు.

**మద్యం మత్తులో..** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుచ్చిరెడ్డి పౌల్ట్రీఫార్మ్ దగ్గర ఓ కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తవుటి శ్రీకాంత్, సంగెం గిరి అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందిన వెంటనే మహేశ్వరం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు యువకుల మృతితో పోరండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

**కారును ఢీకొన్న బైక్...** మాదాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వద్ద ఓ బైక్ వేగంగా దూసుకొచ్చి ముందున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడు జార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**దంపతులు మృతి...** మూసారంబాగ్‌లో బస్సు ఢీకొని దంపతులు మృతి చెందారు. మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. దంపతులు ప్రయాణిస్తున్న స్కూటీని ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టింది. దీంతో బస్సు వెనక చక్రాల కింద పడి దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు తిరుపతయ్య, వెంకటరమణమ్మగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.




హైదరాబాద్: మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అసెంబ్లీలో పురపాలక, జీహెచ్‌ఎంసీ చట్టసవరణ బిల్లుపై చర్చలో శ్రీధర్ బాబు మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. హైదరాబాద్‌ను మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిరయించలేదని చెప్పారు. "ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే గ్రేటర్ విలీనం. మూసీ విషయంలో సీఎం ఎవరి పేర్లు ప్రస్తావించలేదు. పేర్లు ప్రస్తావించనప్పుడు భారత రాష్ట్ర సమితి సభ్యులు ఎందుకు స్పందిస్తున్నారు. మూసీ విషయంలో సభ్యుల సూచనలు స్వీకరిస్తామని సీఎం చెప్పారు. గ్రేటర్‌ను ఎన్ని కార్పొరేషన్లుగా విభజించాలో అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రాథమికంగా అనుకుంటున్నాం. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 174 పాయింట్లు ఉంది. నగరంలో గాలి నాణ్యత మున్ముందు మరింత పడిపోకూడదని భావిస్తున్నాం. కాలుష్యం మరింత పెరిగిపోకూడదనే.. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించే ప్రక్రియ చేపట్టాం. హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా.. మెట్రో విస్తరణ చేపట్టాలని నిర?యించాం. అనుమతులు, నిర్వహణలో సమస్యలు రావొద్దనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేస్తోంది. హైదరాబాద్‌లో మున్ముందు మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం" అని మంత్రి వెల్లడించారు.

**గత ప్రభుత్వం అలా చేసింది..** "జీహెచ్‌ఎంసీలో వార్డుల సమస్య ఉంటే పరిష్కరిస్తాం. ఇప్పటికే 8 మంది జోనల్ కమిషనర్లను నియమించాం. హైదరాబాద్ పరిపాలన కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించాం. గత ప్రభుత్వం సిబ్బందిని నియమించకుండానే జిల్లాలను 33కి పెంచింది. 33 కలెక్టరేట్‌లను నిర్మించింది కానీ.. వాటిలో సిబ్బంది లేరు. ఈ ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీ ద్వారా కలెక్టరేట్లలో సిబ్బందిని నియమించాం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడించింది. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు ఉంటే.. అది కూడా తొలగించారు" అని శ్రీధర్ బాబు అన్నారు.







## ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం.. తల్లిదండ్రుల వాట్సప్‌నకు హాల్‌టికెట్లు

హైదరాబాద్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేందుకు తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లను విద్యార్థుల తల్లిదండ్రుల వాట్సాప్‌కి పంపనున్నట్టు ఇంటర్ బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 45 రోజుల నుంచి రెండు నెలల ముందే తల్లిదండ్రుల వాట్సప్‌నకు వారి పిల్లల హాల్‌టికెట్లను పంపనున్నారు.

తద్వారా హాల్ టికెట్‌లో తప్పొప్పులను ముందే గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లి తండ్రులు హాల్‌టికెట్‌లో ముద్రించిన వివరాలు క్షుణ?ంగా పరిశీలించాలని, ఏమైనా తప్పులు ఉంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కి సమాచారం ఇవ్వాలని ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది.

హాల్‌టికెట్ నంబర్, పరీక్షా కేంద్రం చిరునామాతో పాటు ఏ రోజు ఏ పరీక్ష జరుగుతుందో తల్లిదండ్రులకు తెలియజెప్పడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. అధిక శాతం తల్లిదండ్రుల వద్ద స్మార్ట్ ఫోన్ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.




హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత బర్సే దేవా తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మరో 15 మంది మావోయిస్టులతో కలిసి బర్సే దేవా లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా బర్సే బాధ్యతలు నిర్వర్తించారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీలో దేవా కీలకంగా ఉన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ బలగాల వ్యవహారాలను చూస్తున్నారు. హిడ్మా, బర్సే దేవా ఛత్తీస్‌గఢ్‌లో ఒకే గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మావోయిస్టులకు ఆయుధాల సరఫరాలో దేవా కీలక పాత్ర పోషించారు. నిన్న తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి బర్సే దేవా బృందాన్ని పోలీసులు తీసుకొచ్చారు. బర్సే లొంగుబాటు వివరాలను డీజీపీ శివధర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించనున్నారు.

## విషం సరఫరా చేస్తున్నారు.. ఇండోర్‌లో కలుషిత తాగునీటి మరణాలపై రాహుల్ నిప్పులు




భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీరు తాగి 10 మంది మృతి చెందడం, పెద్ద సంఖ్యలో జనం అనారోగ్యానికి గురికావడంపై కాంగ్రెస్ అగ్రనేత అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారతదేశంలోని అత్యంత పరిశుభ్రమైన నగరాల్లో ఒకటైన ఇండోర్‌లో తాగునీటి కాలుష్యం ఏమిటని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇండోర్‌లో నీరు లేదనీ, విషం మాత్రమే ఉందని నిప్పులు చెరిగారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ప్రభుత్వం మాత్రం కుంభకరు?డిలా నిద్రపోతోందని ఆరోపించారు. 'ఇండోర్‌లో నీళ్లు లేవు, దానికి బదులుగా విషం సరఫరా చేస్తున్నారు. అధికార యంత్రాంగం కుంభకరు?డిలా నిద్రపోతోంది. ప్రతి ఇంట్లోనూ విషాదం నెలకొంది. పేదలు నిస్సహాయిలుగా ఉన్నారు. వారికి స్వాంతన కలించేందుకు బదులుగా బీజేపీ ప్రభుత్వం అహంకారపూరిత ప్రకటనలు చేస్తోంది' అని రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. మురికి, దుర్వాసన వచ్చే నీటి గురించి ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినప్పటికీ వారి ఫిర్యాదులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని రాహుల్ ప్రశ్నించారు. తాగునీటిలో మురుగునీరు ఎలా కలిసింది? సరఫరాను సకాలంలో ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులు, నాయకులపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? అని రాహుల్ వరుస ప్రశ్నలు సంధించారు. కలుషిత నీటి గురించి ప్రశ్నించిన మీడియాపై మధ్యప్రదేశ్ మంత్రి కైలాస్ విజయవర్గీయ అభ్యంతకర వ్యాఖ్యలు చేయడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. మధ్యప్రదేశ్ ఇప్పుడు దుష్టపరిపాలనకు కేంద్రంగా మారిందని అన్నారు. దగ్గు సిరప్ మరణాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకలు చిన్న పిల్లలను చంపడం, ఇప్పుడు మురుగునీటితో కలుషితమైన నీరు తాగడం వల్ల మరణాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయన్నారు. పేదలు చనిపోయినప్పుడల్లా ప్రధాని మోదీ ఎప్పటిలాగే మౌనంగా ఉంటారని విమర్శించారు.

## అన్వేష్ కొత్త డ్రామా.. హిందూ దేవుళ్లు కలలో కనిపించారంటూ..




యూట్యూబర్ అన్వేష్ హిందూ దేవుళ్లే టార్గెట్‌గా వరుసగా వీడియోలు చేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం సీతమ్మ, ద్రౌపదిపై దారుణమైన కామెంట్లు చేసిన అన్వేష్ తీవ్ర స్థాయిలో హిందువుల ఆగ్రహానికి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే క్షమాపణ చెప్పి జనాలను కూల్ చేసే ప్రయత్నం చేశాడు. జనాలు అతడి మాటలు వినకపోవటంతో కొత్త డ్రామాకు తెరతీశాడు. అంజనేయ స్వామి, విషుమూర్తి తన కలలోకి వచ్చారని అంటున్నాడు. బూతులు మాట్లాడకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని దేవుళ్లు చెప్పారంటూ కొత్త నాటకం మొదలెట్టాడు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాల్లో ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియోలో.. 'విషు?మూర్తి కలలోకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని చెప్పాడు. తెలుగు రాష్ట్రాల్లో బత్తాయి రంగులో కాషాయం వస్త్రం, మతం మత్తులో చాలా అన్యాయాలు జరుగుతున్నాయి. ఆడవాళ్లకి అండగా ఉండాలి, ఆడవాళ్ల సమస్యలపై పోరాటం చేయాలని దేవుళ్లు చెప్పారు. విషు? మూర్తి మీద ప్రమాణం చేసి చెప్తున్నా.. బూతులు మాట్లాడను' అని చెప్పుకొచ్చాడు. ఈ వీడియోతో మరోసారి సోషల్ మీడియాలో దుమారం చెలరేగింది. అన్వేష్ హిందూ దేవుళ్లపై కావాలనే వీడియోలు చేస్తున్నాడని నెటిజన్లు మండిపడుతున్నారు.

## రణరంగాన్ని తలపించిన జల్లికట్టు.. యువకులకు గాయాలు

తిరుపతి,జనవరి2 : తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలం శానంభట్లలో న్యూఇయర్, సంక్రాంతి పండుగ సందఠరేగా సంప్రదాయ జల్లికట్టు (పశువుల పండుగ) వేడుకలు ఇవాళ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలో యువకులు కోడె గుత్తలను నిలువరించడానికి ప్రయత్నించడంతో పల్లె వీధులు రణరంగంగా మారాయి. ఈ జల్లికట్టు వేడుకల్లో పశువులను క్రమంగా నిలువరించే సమయంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. జల్లికట్టులో గాయపడినవారిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. గతంలో పల్లెలోని పశువులతో జల్లికట్టు జరిగేది. కానీ కొత్త సంప్రదాయం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కరా?టకల నుంచి సుమారు 200 పరుస కోడె గిత్తలను యువకులు ఊరులోని వీధుల్లో ఉరికించారు. ఈ విధానం ప్రమాదకరంగా మారింది. అయితే, రెండు సంవత్సరాల క్రితం ఊరి పెద్దలు కలెక్టర్, పోలీసులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. జల్లికట్టు సమయంలో ఇరుకువీధుల్లో పదునైన కొమ్ములతో గిత్తలను ఉరికించడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ క్రమంలో గ్రామంలో 80 మంది పోలీసులు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేశారు. ఈ వేడుకను దగ్గరుండి పోలీసులు పర్యవేక్షించారు. ఈ సంప్రదాయంపై ప్రజల నుంచి విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు జల్లికట్టును సంక్రాంతి సంస్కృతి, పల్లె ఆనందంగా చూస్తున్నారు. మరికొందరు మాత్రం ఈ ఆటను అత్యంత ప్రమాదకరమైనదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు, భద్రతా దళాలు ప్రతి ఏడాది ఈ వేడుకలను నిలువరించడానికి ప్రయత్నిస్తున్నారు. జల్లికట్లు నిర్వహించే సమయంలో సరైన భద్రతా ప్రమాణాలూ, గాయాల నివారణా చర్యలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మలచడంలో మహిళా ఉపాధ్యాయుల కీలక పాత్ర

## - జనవరి 3... జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జనవరి నెల 3 తేదీన నిర్వహిస్తారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే గౌరవార్థం ఇది నిర్వహిస్తారు. మహిళా ఉపాధ్యాయుల జీవితాన్ని, వారి పాత్రను, సమాజంపై వారు చూపుతున్న ప్రభావాన్ని గుర్తించేందుకు, ప్రశంసించేందుకు ఈ రోజు వేదికగా నిలుస్తుంది.




**మహిళా ఉపాధ్యాయుల ప్రాధాన్యత...** మహిళలు విద్యారంగంలో విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మలచడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యాసంస్థల వరకు, వారు పిల్లల ఆలోచనా శైలిని, నైపుణ్యాలను, సామాజిక విలువలను నిర్మించడంలో సహాయ పడుతున్నారు.

**సామాజిక మార్పులో భాగస్వామ్యం...** మహిళా ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడంలోనే కాదు, సమాజంలో స్త్రీ సాధికారత, సమానత్వం వంటి విషయాల్లో అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు.

**విద్యార్థుల వ్యక్తిత్వంపై ప్రభావం...** ఓర్పు, దయ, సూర్తితో విద్య బోధించే మహిళలు, చిన్నారుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు.

**మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొనే సవాళ్లు...** సమాజం నుండి ఒత్తిడులు: ఇప్పటికీ కొన్ని సమాజాల్లో మహిళలు ఉపాధ్యాయులుగా ఉండటాన్ని తక్కువగా అంచనా వేస్తారు. ఈ విధమైన భావజాలం మహిళా ఉపాధ్యాయుల ఆత్మ విశ్వాసాన్ని తగ్గిస్తుంది.

**వేతన అసమానత:** పురుష ఉపాధ్యాయులతో పోలిస్తే, మహిళా ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలు అందజేసే సందరాలు ఉండేవి. ఇది లింగ అసమానతకు నిదర్శనం. కాగా ప్రస్తుతం అలాంటి వ్యత్యాసాలు లేకుండా ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

**కార్యభారం సమన్వయం...** ఉపాధ్యాయులుగా పనిచేయడం కంటే ఎక్కువగా, గృహ బాధ్యతలు, కుటుంబ సంబంధిత బాధ్యతలను కూడా నిర్వర్తించాల్సి రావడం మహిళా ఉపాధ్యాయులకు అదనపు ఒత్తిడిని సృష్టిస్తుంది.

**మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించడంలో మన బాధ్యత...**
గౌరవప్రదమైన వాతావరణం: మహిళా ఉపాధ్యాయులకు పనిచేయటానికి సౌకర్యవంతమైన, సమానత్వంతో కూడిన వాతావరణాన్ని కల్పించడం అత్యవసరం.
సమానత్వం: ఉపాధ్యాయుల మధ్య లింగ సమానత్వానికి న్యాయం చేయడమే నిజమైన అభివృద్ధి.
**సామాజిక అవగాహన పెంపొందించడం:** మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా, సమాజంలో వారి ప్రాముఖ్యతను చాటవచ్చు.
**ఎలా జరుపుకోవాలి?** విశిష్ట మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం, ప్రతీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించే కార్యక్రమాలు నిర్వహించాలి.
**ప్రత్యేక కథనాలు, కార్యక్రమాలు:** మహిళా ఉపాధ్యాయుల జీవితాలపై ప్రత్యేక కథనాలు, ప్రసంగాలు నిర్వహించడం ద్వారా, యువతకు వారిని ఆదర్శంగా నిలపవచ్చు.
**సాంస్కృతిక కార్యకమాలు:** విద్యార్థులు ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చి, మహిళా ఉపాధ్యాయుల కృషికి కృతజ్ఞత తెలియ జేయవచ్చు.

**చరిత్రలో విశిష్ట మహిళా ఉపాధ్యాయులు...**
సవిత్రీబాయి పూలే:భారతదేశం లోని మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, ఆమె బాలికల విద్యకు కొత్త దారులు తెరిచారు.
సరోజినీ నాయుడు:విద్యలో సూర్తి నింపుతూ, సమాజంలో మహిళల హక్కుల కోసం కృషి చేసిన ప్రముఖ నాయకురాలు. మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం మహిళల పట్ల కృతజ్ఞతను తెలియజేసే అవకాశం కల్పిస్తుంది. వారి కృషి, త్యాగం, నిబద్ధత వల్లనే సమాజానికి సరైన పునాది ఏర్పడింది. ఈ దినోత్సవం ద్వారా వారికి మరింత గౌరవం అందిస్తూ, వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి. మహిళా ఉపాధ్యాయులు సమాజానికి వెలకట్టలేని ఆస్తి, వారి కృషిని గుర్తించడంలో ఎల్లప్పుడూ ముందుండాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ఉక్కుకు ఊపిరి పోసిన శాస్త్రవేత్త బ్రహ్మ ప్రకాష్

## - భారత మెటలర్జీ పితామహుడు: డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ - జనవరి 3 - బ్రహ్మ ప్రకాష్ వర్ధంతి



భారత శాస్త్ర–సాంకేతిక చరిత్రలో మెటలర్జీ అనే విభాగానికి స్పష్టమైన దిశ, స్వరూపం ఇచ్చిన అరుదైన మహనీయుడు డాక్టర్ బ్రహ్మ ప్రకాష్. ఆధునిక భారత లోహ విజ్ఞానానికి పునాది వేసిన శాస్త్రవేత్తగా, పరిశోధనను పరిశ్రమలతో అనుసంధానించిన దార్శనికుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచింది. 1984 జనవరి 3న ఆయన పరమపదించినప్పటికీ, భారత ఉక్కు పరిశ్రమ, లోహ పరిశోధన సంస్థలు, శాస్త్రీయ సంప్రదాయాల రూపంలో ఆయన వారసత్వం నేటికీ జీవిస్తోంది. డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ 1907 ఆగస్టు 26న అప్పటి పంజాబ్ రాష్ట్రంలోని ముల్తాన్‌లో జన్మించారు. చిన్నతనం నుంచే గణితం, భౌతికశాస్త్రాల పట్ల అపూర్వమైన ఆసక్తి కనబరిచిన ఆయన, ప్రతిభావంతుడైన విద్యార్థిగా గుర్తింపు పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్ వెళ్లిన బ్రహ్మ ప్రకాష్, ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మెటలర్జీలో డాక్టరేట్ సాధించారు. ఆ కాలంలోనే లోహాల సూక్ష్మ నిర్మాణం, భౌతిక–రసాయన లక్షణాలు, పారిశ్రామిక వినియోగాలపై లోతైన పరిశోధనలు చేసి అంతర్జాతీయ శాస్త్రీయ వర్గాల్లో పేరు సంపాదించారు. విదేశాల్లో ఉన్నత హోదాలు, ఆకర్షణీయ అవకాశాలు ఉన్నప్పటికీ, స్వదేశ సేవే జీవిత లక్ష్యంగా బ్రహ్మ ప్రకాష్ భారత్‌కు తిరిగొచ్చారు. అప్పటి భారతదేశం పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో, దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతికతే ఆధారమని ఆయన గట్టిగా విశ్వసించారు. ముఖ్యంగా ఉక్కు, లోహ పరిశ్రమలు లేకుండా మౌలిక వసతుల నిర్మాణం, రక్షణ రంగం, యంత్ర పరిశ్రమలు అభివృద్ధి సాధ్యం కాదని ఆయన స్పష్టంగా గ్రహించారు. ఈ దృక్పథమే ఆయన జీవిత కార్యాచరణకు మార్గదర్శకంగా నిలిచింది. 1950లలో భారత ప్రభుత్వం స్థాపించిన నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ (ఎన్ఎంఎల్)కు తొలి డైరెక్టర్‌గా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ నియమితులయ్యారు. జంషెడ్‌పూర్ కేంద్రంగా పనిచేసిన ఈ సంస్థ ఆయన నాయకత్వంలో దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా కేంద్రంగా ఎదిగింది. ఉక్కు, అల్యూమినియం, తామ్రం, మిశ్రమ లోహాలపై విస్తృత పరిశోధనలు చేపట్టి, దేశీయ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్ఎంఎల్ అందించింది. అప్పటివరకు విదేశాలపై ఆధారపడిన ఉక్కు తయారీ సాంకేతికతలో స్వావలంబన దిశగా భారత్ ముందడుగు వేయడంలో బ్రహ్మ ప్రకాష్ కీలక పాత్ర పోషించారు. ఉక్కు పరిశ్రమ అభివృద్ధిలో ఆయన కృషి గణనీయమైనది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా వంటి ప్రభుత్వ రంగ ఉక్కు కర్మాగారాలకు అవసరమైన లోహ సాంకేతిక సూచనలు, పరిశోధన ఫలితాలు ఎన్ఎంఎల్ ద్వారా అందాయి. లోహాల నాణ్యత పెంపు, వ్యయ తగ్గింపు, దేశీయ ముడి పదార్థాల వినియోగంపై ఆయన చేసిన అధ్యయనాలు పారిశ్రామిక ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ఈ కారణంగా బ్రహ్మ ప్రకాష్‌ను "ఉక్కుకు ఊపిరి పోసిన శాస్త్రవేత్త"గా అభివరి?స్తారు. డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా, విజనరీ నిర్వాహకుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రభుత్వ విధానాలతో అనుసంధానమవ్వాలన్నది ఆయన నమ్మకం. "శాస్త్రం ప్రజల జీవితాలను మార్చగలగాలి" అనే సిద్ధాంతాన్ని ఆయన తన జీవితమంతా అమలు చేశారు. రక్షణ రంగం, అణుశక్తి కార్యక్రమాలు, భారీ యంత్ర పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక లోహాల అభివృద్ధిలో ఆయన మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో కూడా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్‌కు విశేష గుర్తింపు లభించింది. యునెస్కో, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థల శాస్త్రీయ కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో మెటలర్జీ అభివృద్ధిపై సలహాదారుడిగా వ్యవహరించారు. అనేక అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన ప్రచురించిన పరిశోధనా పత్రాలు భారత శాస్త్రీయ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాయి. భారత ప్రభుత్వం ఆయన సేవలను గౌరవిస్తూ 1958లో "పద్మభూషణ్" పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇది ఒక వ్యక్తికి ఇచ్చిన గౌరవమే కాకుండా, భారత మెటలర్జీ రంగానికి లభించిన గుర్తింపుగా భావించాలి. అంతేకాకుండా, దేశవిదేశాల అనేక విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. వినయం, క్రమశిక్షణ, దేశభక్తి డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ జీవితంలోని ప్రధాన లక్షణాలు. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం, పరిశోధనలో నాణ్యతకు రాజీ పడకపోవడం ఆయన నిత్యకర్తవ్యంగా భావించారు. ఆయన శిక్షణ పొందిన అనేక మంది శాస్త్రవేత్తలు తరువాత కాలంలో సీఎస్ఐఆర్, రక్షణ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో కీలక బాధ్యతలు చేపట్టి దేశానికి సేవలందించారు. 1984 జనవరి 3న డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ కన్నుమూయడంతో ఒక మహనీయుడి శారీరక జీవితం ముగిసినా, ఆయన ఆలోచనలు, నిర్మించిన సంస్థలు, శాస్త్రీయ సంప్రదాయం ఇంకా జీవించి ఉన్నాయి. నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ, భారత ఉక్కు పరిశ్రమలో సాధించిన సాంకేతిక స్వావలంబన, పరిశోధన%--%పరిశ్రమల అనుసంధానయ ఇవి అన్నీ ఆయన అందించిన చిరస్థాయి కానుకలు. ఈ వర్ధంతి సందరరేగా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్‌ను స్మరించుకోవడం అంటే కేవలం ఒక శాస్త్రవేత్తను తలుచుకోవడం కాదుబీ శాస్త్రాన్ని దేశాభివృద్ధికి అంకితం చేయాలన్న ఉన్నత ఆదర్శాన్ని గుర్తు చేసుకోవడమే. ఆయన జీవితం నేటి తరానికి స్పష్టమైన సందేశం ఇస్తుందిశాస్త్రం జ్ఞానానికే కాదు, జాతి భవిష్యత్తుకు బలమైన పునాది కావాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విశ్వమంతా వినిపిస్తున్న తెలుగు స్వరం - తెలుగు భాషకు ప్రపంచ పీఠం




ప్రపంచ తెలుగు మహా సభలు 2026 తెలుగు భాషా చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలవబోతున్నాయి. భాష అనేది కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి ఆత్మగౌరవానికి, సాంస్కృతిక గుర్తింపుకు ప్రతీక. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాష ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడబడే భాషలలో ఒకటిగా నిలవడమే కాకుండా, శాస్త్రం, సాహిత్యం, తత్వశాస్త్రం, కళలు, సంగీతం, నాట్యం, సినిమా వంటి అనేక రంగాలలో తనదైన ముద్ర వేసింది. అలాంటి భాషను ప్రపంచ స్థాయిలో మరింత బలంగా నిలబెట్టాలనే సంకల్పంతో నిర్వహించబడుతున్న మహత్తర ప్రయత్నమే ప్రపంచ తెలుగు మహా సభలు 2026. తెలుగు భాషా పరిరక్షణకు సంబంధించిన ఉద్యమాలు, సభలు, సమ్మేళనాలు నిన్న మొన్నటి విషయాలు కావు. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచాయి. ఆ సభలు జరిగిన నాటి నుంచి తెలుగు భాషపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెరిగింది. తరువాత 1981, 1990, 2000 సంవత్సరాలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు భాషాభిమానాన్ని మరింత బలపరిచాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా తెలుగు సంఘాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ప్రపంచంలో సుమారు ఎనిమిది కోట్లకు పైగా ప్రజలు తెలుగు మాట్లాడుతారని భాషా గణాంకాలు సూచిస్తున్నాయి. భారతదేశంలో మూడవ అతిపెద్ద భాషగా, ప్రపంచంలో పదిహేనవ స్థానంలో ఉన్న భాషగా తెలుగు నిలవడం గర్వకారణం. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 2026లో నిర్వహించబడుతున్న ప్రపంచ తెలుగు మహా సభలు కేవలం సాహిత్య సమ్మేళనం మాత్రమే కాదుబీ ఇది ఒక సామాజిక, సాంస్కృతిక, భాషా ఉద్యమంగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వేదికగా మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. సభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చూస్తే ఇది ప్రభుత్వ సహకారంతో పాటు తెలుగు సాంస్కృతిక సంస్థలు, సాహితీవేత్తలు, కళాకారులు, స్వఛరేద సంస్థల సమిష్టి కృషిగా రూపుదిద్దుకుంటున్నది. ప్రపంచ తెలుగు మహా సభలు 2026లో సాహిత్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతోంది. తెలుగు భాషా వికాసంలో కవులు, రచయితలు, విమర్శకులు పోషించిన పాత్ర అపారమైనది. నన్నయ భట్టారకుడు ప్రారంభించిన ఆంధ్రమహాభారతం నుంచి ఆధునిక సాహిత్య ఉద్యమాల వరకు తెలుగు సాహిత్యం నిరంతర ప్రవాహంలా సాగుతోంది. ఈ మహాసభల్లో ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక, ఉత్తరాధునిక సాహిత్య ధోరణుల వరకు విస్తృత చర్చలు జరుగనున్నాయి. భాషా శుద్ధి, వ్యాకరణ పరిరక్షణ, తెలుగు పదసంపద విస్తరణ వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. అంతేకాదు, డిజిటల్ యుగంలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలపై కూడా లోతైన విశ్లేషణ జరుగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఈ మహాసభలకు ప్రాణంగా నిలవనున్నాయి. తెలుగు వారి జానపద కళలు, నృత్యరూపాలు, సంగీత సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఉద్దేశంతో వందలాది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. బుర్రకథ, ఒగ్గుకథ, హరికథ, వీణ, మృదంగం, కూచిపూడి నాట్యం వంటి సంప్రదాయ కళలతో పాటు ఆధునిక నృత్యరూపాలు కూడా వేదికెక్కనున్నాయి. ఈ కార్యక్రమాలు యువతలో భాషా%--%సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు భావిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహా సభలు 2026లో విద్యకు కూడా విశేష ప్రాధాన్యం లభిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 50కి పైగా విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషా బోధన జరుగుతోంది. అయినప్పటికీ మాతృభాషగా తెలుగు నేర్చుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ఈ పరిస్థితిని మార్చేందుకు భాషా విద్యలో కొత్త విధానాలు, సాంకేతికత వినియోగం, ఆన్‌లైన్ బోధన వంటి అంశాలపై చర్చ జరుగనుంది. ముఖ్యంగా ప్రవాస తెలుగు పిల్లలకు తెలుగు నేర్పే విధానాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించబడతాయి. గణాంకాల పరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది ప్రవాస తెలుగు వారు ఉన్నారని అంచనా. అమెరికాలోనే దాదాపు 15 లక్షల మంది తెలుగు వారు నివసిస్తున్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది యువత చదువు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు భాష వారసత్వం కోల్పోకుండా ఉండాలంటే ప్రపంచ స్థాయిలో సమన్వయ ప్రయత్నాలు అవసరం. ప్రపంచ తెలుగు మహా సభలు 2026 ఈ దిశగా ఒక సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు వేదికగా నిలవనున్నాయి. ఈ మహాసభల మరో ముఖ్యాంశం తెలుగు భాషకు సంబంధించిన సాంకేతిక అభివృద్ధి. కృత్రిమ మేధ, అనువాద సాఫ్ట్‌వేర్‌లు, వాయిస్ టు టెక్స్ట్, డిజిటల్ నిఘంటువులు వంటి రంగాల్లో తెలుగు ఇంకా వెనుకబడి ఉన్నది. ఈ లోటును పూడ్చేందుకు ఐటీ నిపుణులు, భాషా శాస్త్రవేత్తలు కలిసి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించనున్నారు. తెలుగు భాషను డిజిటల్ ప్రపంచంలో మరింత బలంగా నిలబెట్టడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ తెలుగు మహా సభలు 2026 సామాజిక కోణంలోనూ విశేష ప్రాధాన్యం కలిగినవి. భాష ద్వారా సమాజంలో ఐక్యతను పెంపొందించడం, తరతరాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం ఈ సభల ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. పెద్దలు–యువత–పిల్లలు అన్న భేదం లేకుండా ప్రతి ఒక్కరిని భాషా ఉద్యమంలో భాగస్వాముల్ని చేయాలన్న ఆలోచన ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. భాషా గౌరవం, సాంస్కృతిక స్వాభిమానం వంటి విలువలను నాటే ప్రయత్నం ఈ సభల ద్వారా జరుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో చూసినప్పుడు, ప్రపంచంలోని అనేక భాషలు ఆధునికీకరణ ఒత్తిడిలో తమ అసలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలో సుమారు 40 శాతం భాషలు అంతరించిపోవడానికి అంచున ఉన్నాయని చెబుతాయి. ఈ పరిస్థితుల్లో తెలుగు భాష తన ఉనికిని కాపాడుకోవడమే కాకుండా, మరింత విస్తరించాలంటే ఇటువంటి మహాసభలు అవసరం. ప్రపంచ తెలుగు మహా సభలు 2026 భాషా పరిరక్షణకు ఒక బలమైన ప్రతిజ్ఞగా నిలవనున్నాయి. ముగింపుగా చెప్పాలంటే, ప్రపంచ తెలుగు మహా సభలు 2026 కేవలం ఒక వేడుక కాదుబీ ఇది ఒక ఉద్యమం, ఒక దిశానిర్దేశం, ఒక భవిష్యత్ సంకల్పం. భాషను ప్రేమించడమే కాకుండా, దాన్ని తరతరాలకు అందించాలన్న బాధ్యతను గుర్తుచేసే మహత్తర ప్రయత్నం. తెలుగు భాషకు గ్లోబల్ గుర్తింపును మరింత బలపరచే ఈ సభలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఘట్టంగా మారతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు జాతి ఉన్నంతకాలం, తెలుగు భాష ఉన్నంతకాలం, ఇలాంటి మహాసభల ప్రాధాన్యం తరగదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విలనిజానికి ప్రతిరూపం రాజనాల - జనవరి 3... రాజనాల జయంతి



తెలుగు తెరపై విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన నటులలో రాజనాల అగ్ర స్థానం లో ఉంటారు. అతి భయానకంగా కళ్ళెర్ర చేయడం... భీభత్సంగా వికట్టాట్టహాసం చేయడం... హీరోయిన్‌ని వెంటాడి వేధించడం... హీరోని క్లయిమాక్స్ వరకూ మొండిగా ఎదుర్కోవడం... విలనిజా నికి రాజనాల ప్రతిరూపంగా నిలుస్తారు. రాజనాల తెరపై కనిపిస్తే చాలు మహిళా ప్రేక్షకులు శాపనార్థాలు పెట్టేవారంటే... ఆయా పాత్రల్లో ఆయన ఎలా జీవించాడో అర్థం చేసుకోవచ్చు. పాతతరం నటుల్లో ఎంతమంది విలన్లు ఉన్నా.. విలనంటే గుర్తుకొచ్చే పేరు రాజనాల అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా 400 పై చిలుకు చిత్రాల్లో వివిధ రకాలైన పాత్రలు పోషించాడు. 100కు పైగా పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో విలన్ పాత్రలు పోషించాడు. తెలుగు సినిమా, నాటకాల్లో ఎక్కువగా నటించారు. కొన్ని తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా నటించారు. 1966లో 'మాయా ది మెగ్నిఫిమెంట్' అనే హాలివుడ్ సినిమాలో నటించి, హాలివుడ్‌లో నటించిన తొలి తెలుగు నటునిగా రికార్డు సృష్టించారు రాజనాల. ఎన్.టి.రామారావు, ఎం.జి.రామచంద్రన్, జయలలిత ముగ్గురు ముఖ్య మంత్రులతో నటించిన ఏకైక నటుడు. 1952లో రాజమార్గం చిత్రం ద్వారా తెరపరిచితమైన రాజనాల ... 1953లో ప్రతిజ్ఞ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో మెప్పించారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 1953 నుంచి 1978 వరకు రాజనాల నట జీవితంలో స్వర?యుగంగా చెప్పొచ్చు. నెల్లూరులో 1925 జనవరి 3 వైకుంఠ ఏకాదశి పర్వదినాన పుట్టిన రాజనాల అసలు పేరు... రాజనాల కాళేశ్వరరావు. చిన్నా పెద్దా అంతా ఆయన్ని అభిమానంగా కాళయ్య అని పిలిచేవారు. ఇంటర్ చదువుతూనే 1948లో నెల్లూరులో స్నేహితుడు లక్ష్మీకుమార్ రెడ్డితో కలిసి నేషనల్ ఆర్ట్స్ థియేటర్ అనే నాటక సంస్థను ప్రారంభించాడు. మొదటగా నెల్లూరు టౌన్‌హాలులో ఆచార్య ఆత్రేయ 'ఎవరు దొంగ' నాటకాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వ శాఖలోని అవినీతిని బట్టబయలు చేశావంటూ రాజనాలపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఆ తరువాత 'ప్రగతి' అనే నాటకాన్ని ప్రదర్శించగా కోపగించిన కలెక్టర్ రాజనాలను సస్పెండ్ చేశారు. తరవాత మద్రాసు చేరిన రాజనాల హెచ్. ఎం. రెడ్డి తీసిన 'ప్రతిజ్ఞ' సినిమాకు విలన్‌గా ఎంపిక కాబడి, నెలకు రూ.200/%--% జీతానికి హెచ్ఎం రెడ్డితో కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. అలా, తెనాలి రామకృష?, సువర? సుందరి, కుటుంబ గౌరవం, వినాయక చవితి, రాజమకుటం, శ్రీ వెంకటేశ్వర మహత్యం, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి, ఉషా పరిణయం జగదేకవీరుని కథ, సిరిసంపదలు, గులేబకావలి కథ, చిట్టి తమ్ముడు, దక్ష యజ్ఞం...ఇలా అనేకానేక చిత్రాల్లో నటించారు. గుండమ్మ కథ, పరువు ప్రతిష్ట, నర్తన శాల, రాముడు భీముడు, దేవత, బొబ్బిలి యుద్ధం, సిఐడి, శ్రీ సింహాచల క్షేత్ర మహిమ, సత్య హరిచంద్ర, శ్రీ కృష? పాండవీయం, పల్నాటి యుద్ధం, శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న, శ్రీ కృషా?వతారం...ఇలా ఎన్నో చిత్రాలలో నటించారు. అప్పట్లో రాజనాల లేని సినిమాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఎన్టీఆర్, కాంతారావు సినిమాల్లో ఆయనే విలన్. రాజనాల... 'కింగ్ ఆఫ్ విలన్స్'గా పేరు తెచ్చుకున్నారు. నాలుగున్నర దశాబ్దాలు నటుడిగా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచారు. అవకాశాలు అందిపుచ్చుకుని ఆకాశాలు ఈదారు. వెండితెర వైభవాన్ని సంపూర?ంగా అనుభవించారు. అంతలోనే... విధి వక్రించి... చెన్నైలో విలక్షణ నటుడిగా ఖ్యాతి గాంచిన రాజనాల... హైదరాబాద్ లోని అమీర్ పేట సారధి స్టూడియో వెనుక వీధిలో సింగల్ బెడ్ రూమ్ ఫ్లాట్ లోకి సతీ సమేతుడై మారడం విధి విచిత్రం. కాదనకుండా, లేదనకుండా, దానధర్మాలు చేసిన రాజనాల చరమాంకంలో ఆర్థిక ఇబ్బందుల్లో మునిగి పోయారు. కృష? హీరోగా 'తెలుగు వీర లేవరా' చిత్రం కోసం అరకు లోయలో షూటింగ్ సమయంలో రాజనాలకు కాలికి గాయం అయింది. షుగర్ కూడా తోడవడంతో ఓ కాలు తీసి వేయాల్సి వచ్చింది. జీవితంలో 'భీమాంజనేయం' పేరుతో సొంతంగా ఓ సినిమా తీయాలనే కోరిక కూడా ఆయన తీర్చుకోలేక పోయారు. రాజనాల తన చివరి రోజుల్లో ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. జ్యోతిష్యం చెప్పుకుంటూ కూడా కొన్నాళ్లు ఆయన జీవించారు. 1998 మే 21న విధితో పోరాడి, విధి వంచితుడై, చరమాంకంలో కష్టాల కడలిలో పూర్తిగా మునిగి, తనువు చాలించినా... రాజనాల తాను జీవించిన పలు పాత్రల్లో ఇప్పటికీ కళాకారుడిగా జీవించే ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# బంగ్లాదేశ్ కోసం భారత్ ఇంత త్యాగం చేసిందా ?

పళ్ళు తిని గింజలను ఇచ్చిన వారి మీదనే ఉమ్మడం అని విశ్వాసఘాతకులు విషయంలో అంటారు. ఇపుడు బంగ్లాదేశ్ విషయంలో అదే అనుకోవాలి అంటున్నారు. ఏ పాకిస్తాన్ పాలకుల చేతిలో నానా రకాలుగా నరకం అనుభవించి నలిగిపోయిందో ఆ దేశం ఇపుడు భారత్ పట్ల తీవ్ర వ్యతిరేకత చూపిస్తోంది. ముఖ్యంగా అక్కడ హిందువుల విషయంలో అణిచివేత విధానాలు కొనసాగుతున్నాయి అదే విధంగా దాడులు పెరిగాయి. భారత్ ని ఏదో చేయాలని అటు చైనాతో ఇటు పాక్ తో చేతులు కలిపేందుకు కూడా బంగ్లా నేతలు తహతహలాడుతున్న నేపథ్యం ఉంది.

**రక్తం చిందించిన జవాన్లు :** బంగ్లాదేశ్ ఏర్పాటు కావడానికి భారత్ సైనికులు వందలలో బలి అయ్యారు అని రక్తం చిందించారు అన్నది ఎందరికి తెలుసు అన్నదే ఇక్కడ ప్రశ్న. బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం 435 మంది భారతీయ సైనికులు అధికారులు అమరులయ్యారు అన్నది చరిత్ర చెబుతున్న వాస్తవం. ఇక భారత్ తరఫున యుద్ధంలో పాల్గొన్న 36 కంటే ఎక్కువ హంటర్ అలాగే జాగ్వార్ మిగ్ విమానాలు గల్లంతయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. అలాగే డయ్యు తీరంలో అతిపెద్ద విషాదం ఆనాడు చోటు చేసుకుంది అని చెబుతారు. పాకిస్తాన్ నావికాదళం ఐ ఎన్ ఎస్ ఖుక్రీపై టార్పెడోలతో దాడి చేసి దానిని నాశనం చేసింది ఈ దాడిలో 136 మంది భారతీయ నావికా దళ సిబ్బంది మరణించారని అలాగే, అడ్మిరల్ సైతం తనువు చాలించారు అని చరిత్ర చెబుతోంది. దీనిని ప్రపంచ చరిత్రలో ఇది అత్యంత ఘోరమైన నావికాదళ దాడులలో ఒకటిగా చెప్పుకుంటారు.

**వారంతా జైళ్లలో :** ఇక మరో 56 మంది భారతీయ అధికారులు సైనికులు పాకిస్తాన్ జైళ్లలో ఆ సమయంలో ఖైదు చేయబడ్డారని చెబుతారు. అలా బంగ్లాదేశ్ అన్న కొత్త దేశాన్ని ప్రపంచ పటంలో సృష్టించడానికి భారతదేశం అపారమైన త్యాగాలు చేసింది. ఎంతో నష్టపోయింది. మరెంతో రక్తం చిందించింది. అంతే కాకుండా బంగ్లాదేశ్ శరణార్థులను పరిరక్షించడానికి అప్పట్లో ప్రతి భారతీయుడి కుటుంబం అదనం ఆర్థిక భారాన్ని భరించింది అంటారు. అలా సినిమా టిక్కెట్లపై అప్పట్లో రూపాయి ఇరవై పైసలు అదనపు ఛార్జీ విధించారని అంటారు. అలాగే రైలు ఛార్జీలను డెబ్బై అయిదు పైసలు పెంచితే అన్ని రాష్ట్రాలలో బస్సు ఛార్జీలను రూపాయి నుంచి నాలుగు రూపాయలకు పెంచారు. ఇలా ఒక్కో భారతీయ కుటుంబం దాదాపు 30 శాతం పైగా ఆర్థిక భారం మోస్తే బంగ్లాదేశ్ శరణార్థులు అనబడే వారు బతికి బట్టకట్టారు.

**కొత్త దేశాన్ని ఆదుకున్నారు :** బంగ్లాదేశ్ 1971లో కొత్తగా ఏర్పాటు అయింది. అన్నీ కొత్తే, ఆర్థికంగా ఏమీ లేదు. ఆ సమయంలో అతి పెద్ద పొరుగు దేశంగా భారత్ నిలిచి ఎన్నో ఏళ్ళ పాటు ఆర్థికంగా ఆదుకుంది అని చెబుతారు. దాదాపు ఐదు సంవత్సరాల పాటు ఆకలితో నిరాశ్రయులైన బంగ్లాదేశీయులకు ఢాకాలోని ఇస్కాన్ దేవాలయాలలో ఆహారం అందించబడిందని కూడా చెబుతారు. భారత్ కళాకారులు ఇతర దేశాలలో కార్యక్రమాలు నిర్వహించి మరీ సుమారు 14 మిలియన్ డాలర్లు సేకరించి బంగ్లాదేశ్‌కు ఆర్థికంగా అండంగా నిలిచేందుకు పంపించారు. నాడు బంగ్లాల ఆకలిని తీర్చిన ఢాకాలోని అదే ఇస్కాన్ ఆలయం కొన్ని సంవత్సరాల క్రితం దహనం చేయబడి ధ్వంసం చేయబడిందని కూడా తెలిస్తే బాధ కలుగుతుంది.

**పాక్ కంటే దారుణం :** పాకిస్తాన్ భారత్ ని ద్వేషించి వేరుగా ఏర్పాటు అయిన దేశం. బంగ్లాదేశ్ అలా కాదు భారత్ ని శరణుజొచ్చి ఆదుకోమని కోరి భారత్ అండతో ఏర్పాటు అయిన దేశం. భారత్ వల్ల పుట్టి భారత్ అండతో ఎదిగి ఈ రోజు భారత్ కడుపు మీదనే తన్నే విధంగా బంగ్లాదేశ్ వ్యవహరిస్తోంది అని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాక్ కి హిందూ వ్యతిరేకత ఊపిరి. ఈ రోజున బంగ్లా కూడా పాక్ కి నకలు గా మారి హిందువుల మీద దాడితోనే తన మనుగడ సాగించే స్థితికి వచ్చింది అని అంటున్నారు. పాక్ తో కలిసి బంగ్లా భారత్ మీద తన ద్వేషాన్ని చూపించడం అన్నది చూస్తే బహుశా ప్రపంచంలో ఈ తరహా వెన్నుపోటు ఎక్కడైనా ఉంటుందా అన్నదే జాతీయ వాదులు అంతా చర్చించుకునే విషయంగా ఉంది.


# తెలుగు కథా సాహిత్యంలో కొత్త ఒరవడులు అల్లం రచనలు - జనవరి 3...అల్లం శేషగిరిరావు వర్ధంతి



సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించా డు అల్లం శేషగిరిరావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మ ృగాల ప్రాక ృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫూటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 – జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాక ృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మ ృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధిక్యతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవ ృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి. రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణు ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అదుతే కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ త ృష?, వడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేథం, నరమేథం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకో దగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది. వడు లాంటి మనుషులు మన సమా జంలో ఉన్నారని హెచ్చరించిన ఈ కథ, నాటకం గానూ విశేష ఆదరణ పొందింది. వడంటే 'ముసలి నక్క' అని నిఘంటు అర్థం. ముసలి నక్కలు వాటంతటవి వేటాడి తినలేవు కదా. దాంతో పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రిపూట పులిని వాటిమీదకి ఉసిగొల్పి చంపిస్తాయి. పులి తినగా మిగిలిన మాంసంతో కడుపు నింపుకుంటాయి. ఈ కథలో మనిషిలో దాగుండే జంతు స్వాభావిక క్రౌర్యాన్ని చూపించాడు. అందుకే ఈ కథకు 'ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్'గా పేరు పెట్టాడు. 'మ ృగ త ృష?' కథలో కనిపించేది దుప్పి వేట కాదు. అది అక్షరాలా బలహీనుడి మీద బలవంతుడి వేట మాత్రమే. ఒకరిది విలాసం కొరకు వేట. మరొకరిది జీవిక కోసం పోరుబాట. పులులను దర్జాగా వేటాడి, వాటి చర్మాలను కోటగోడలకి వేలాడదీసుకునే జమిందారీలను ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. చర్యలు తీసుకోనూ లేవు. పిట్టలను కొట్టి బతికే బడుగు జీవులకే అన్ని శిక్షలూ అమలవు తుంటాయి. కన్నీటిగాథ 'చీకటి', ఆరిపోయిన చైతన్యాగ్ని కణాన్ని రాజేస్తుంది. మనిషికి ప్రతిబింబాలు తుపాకీ చప్పుళ్ల తోనూ, కొండగొర్రె అరు పుల తోనూ, పులి గాండ్రిం పుల తోనూ, దగాపడ్డ దీనుడి మూలు గులతో ప్రతిధ్వనించే శేషగిరిరావు ఏ కథ ను తరిచి చూసినా, వేదనా భరిత 'అరణ్య ఘోష' వినపడుతూ ఉంటుంది. ఉదాత్తంగా, గంభీరంగా సాగిపోయే ఈ కథలు ప్రాక ృతిక సౌందర్యాన్ని కొత్తకోణంలో చూపిస్తాయి. వైవిధ్య పక్షి జాతుల ప్రస్తావన అక్కడక్కడ మనసును ఉల్లాస పరుస్తుంది. ఉల్లంకి పిట్టలూ, తీతువ పిట్టలూ, పరదలూ, గూడ కొంగలూ, పాముల వార (పెద్ద కొంగలు).. ఇలా పక్షులూ, వాటి గమనాలనూ గమ్మత్తుగా వివరిస్తారు రచయిత. వేటను వరి?ంచేటప్పుడు మాత్రం భయానక వాతావరణాన్ని స ృష్టిస్తాడు. వేటాడేది మనిషి అయినా, మృగమైనా అడవి రక్తంలో స్నానించినట్టు ఓ భీతావహ చిత్రం కళ్లముందు కదలాడేటట్టు కథని నడిపిస్తాడు. జానెడుపొట్ట కోసం దేవులాడుకొనే దీనుల పోరాటాలు కనిపిస్తాయి. జంతువుల వేట నేపథ్యంలో మనిషిలో దాగుండే క్రూరత్వాన్ని, నాగరిక సమాజంలో మానవ స్వభావాన్ని మ ృగాలవైపునుంచి చెప్పుకొస్తాయి అల్లం శేషగిరిరావు కథలు. సాహిత్యంలో వీటిని 'వేట కథలు' అన్నారు. కానీ, చారిత్రకంగా వేట అసలు అర్థాన్ని నిర్వచించ గలిగితే ఇవి సమాజంలోని ఆధిపత్య శక్తుల చేతుల్లో నానా హింసలకు గురైన బడుగుల జీవితాలను కళ్లకుకట్టే యాథార్థ గాథలని అర్థమవుతుంది. ఇదే మారణ హోమం ఇప్పటికీ కొనసాగుతుందని ఈ కథలు చదివితే పాఠకులు కచ్చితంగా అంగీకరిస్తారు. బతుకే బలిపీఠంగా మారుతున్న నేటి సమాజంలో ఆధిపత్యం మీద పోరాటం చేసే వారు ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటారు. చీకటి కోణాలెన్నింటినో వెలుతురు బాట పట్టించిన అల్లం శేషగిరిరావు తర్వాత, మళ్లీ ఇలాంటి కథలు మళ్లీ రానే రాలేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్ - జనవరి 3... సతీష్ ధావన్ వర్ధంతి

భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు. అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడు గా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి. స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్. విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు. సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 %--% 2002 జనవరి 3) శ్రీనగర్ లో జన్మించిన ధావన్, భారతదేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివ ృద్ధికి దోహదపడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతావాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు. డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972–1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర?యం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు. 1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివ ృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంతమైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు. 1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962–1981 వరకు ఐఐఎస్‌సి చైర్మన్ గా పని చేశాడు. ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సి లో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య,




రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు INSAT- ఒక టెలికమ్యూనికేషన్ ఉపగ్రహం, IRS – ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి. 2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు. పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరు, 1951బీ ప్రొఫెసర్ అండ్ హెడ్ అఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏరొనాటికల్ ఇంజనీరింగ్, 1955బీ డైరెక్టరు, 1962–1981బీ కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికావిజిటింగ్ ప్రొఫెసరు, 1971–72బీ నేషనల్ ఏరోస్పేస్ లాబరేటరీస్, బెంగళూరు రీసెర్చి కౌన్సిల్ ఛైర్మను, 1984–93బీ ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ప్రెసిడెంట్, 1977–1979బీ ఇస్రో ఛైర్మన్, 1972–1984బీ ఇండియన్ స్పేస్ కమిషను ఛైర్మన్, 1972–2002 గా విధులు నిర్వర్తించాడు. 2002 జనవరి 3న 81ఏళ్ళ వయసులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# సామాజిక ఉద్యమ కారిణి సావిత్రి పూలే - తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే - జనవరి 3...సావిత్రిబాయి పూలే జయంతి

మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. కుల వ్యవస్థకు, పిత ృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్ప ృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయ వాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టు బాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయ రాలుగా పాఠశాలలను ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కర్త. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. సావిత్రి పూలే (3 జనవరి 1831 – 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పిత ృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్ప ృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివ ృద్ధికి క ృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవరా?లకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటా యించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగాఅట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మ్నెట్టమ్నెదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి క ృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పిత ృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ క ృషిచేసింది. కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్య వివాహలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గరవేతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు



24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేత ృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రిబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు సాగరంలో కుటుంబాలు లోని అనాథ బాలలకు దాదాపు 2,000 మందిని అనాథ బాలులకు ఉచిత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నా రు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను, మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి. జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాధ్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు. 1896–97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుఠరేమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపు కుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పైపులైన్ పనులకు అనుమతుల గండం

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేకంగా వేస్తున్న పైపులైన్ పనులకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. అవసరాల మేరకు తాగునీటిని సరఫరా చేసేందుకు మల్లన్న సాగర్ నుంచి నేరుగా ప్రత్యేకంగా పైపు లైన్ వేసే పనులు 2024లో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకంలో మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్ జంటనగరాలకు సరఫరా చేస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట సమీపంలోని గణపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, యాదగిరిగుట్ట క్షేత్రానికి నీటి సరఫరా చేస్తున్నారు. జిల్లా అవసరాల కోసం రోజుకు 100 ఎంఎల్‌డీల నీటి సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 35 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే విడుదల చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**గడువు ముగిసినా...** నీటి సరఫరా కోసం 33 కి.మీ మేర 1.6 డయామీటర్ల వ్యాసార్థం గల పైపులైన్ వేస్తున్నారు. ఈ పనులు 2025 సెప్టెంబరులోగా పూర్తికావాల్సి ఉంది. మల్లన్న సాగర్ నుంచి గణపురం



గుట్ట వరకు 33 కి.మీ మేర పైపులైన్ వేయాలని ప్రతిపాదించారు. రూ.200 కోట్లను కేటాయించి సుమారు రూ.160 కోట్లు ఖర్చుచేశారు. అక్కారం పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి అచ్చాయిపల్లి వరకు కూడా పైపులైన్ పనులు పూర్తయ్యాయి. మూడు కి.మీ పొడవునా అటవీ శాఖ భూములు ఉండటంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. అటవీ శాఖ అనుమతుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికే గణపురం నుంచి జిల్లాలోని తుర్కపల్లి వరకు పైపులైన్ ఉంది. గణపురం వద్ద ఉన్న పైపులైన్‌తో విడిగా వేసిన పైపులైన్‌కు కలుపుతారు. దీంతో హెచ్ఎండబ్ల్యూఎస్‌తో అసరం లేకుండా మల్లన్న సాగర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా జిజిల్లాకు 100 ఎంఎల్‌డీల నీరు సరఫరా అవుతుంది.

**మార్చినాటికి పూర్తి స్థాయిలో సరఫరా...** శ్రీనివాస్, ఈఈ, మిషన్ భగీరథ... వచ్చే మార్చి నాటికి పైపులైన్ పనులు పూర్తిచేస్తాం. యాదాద్రి భువనగిరి జిల్లాకు మల్లన్న సాగర్ నుంచి నేరుగా పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అటవీ శాఖ అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాం. జనవరిలో అనుమతులు రావచ్చు.

# అన్ని జెండాలకు అండ..

ఆదిలాబాద్ : అక్షర క్రమంలో ముందున్న జిల్లా రాజకీయంగా ఎప్పట్లాగే తన భిన్నత్వాన్ని నిరూపించుకుంటోంది. 2025 సంవత్సరం కాలచక్ర గమనంలోకి వెళ్లిపోతోంది. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంగా ఇచ్చిన హామీల భరోసా జిల్లా ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. ఎమ్మెల్సీ ఎన్నికల సమరం మొదలుకొని, నిన్నటి పంచాయతీ ఎన్నికల వరకు జిల్లా ప్రజానీకం అన్ని రాజకీయ పార్టీలను ఆదరించింది. 1509 సర్పంచి స్థానాల్లో మూడు ప్రధాన పార్టీల మద్దతుదార్లతోపాటు స్వతంత్రులను ఆదరించి భిన్నత్వాన్ని చాటుకుంది. ఉమ్మడి జిల్లా నుంచి వామపక్షాలు సమర శంఖం పూరించాయి. సీపీఐ శత జయంతి ఉత్సవాల జీపు జాతాను కుమురం భీం జిల్లా జోడేఘాట్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్పిల్‌కోటి రిజర్వాయర్ నిర్వాసిత రైతుల తరఫున సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాదయాత్ర చేపట్టారు. నాలుగు దశాబ్దాలుగా అడవే ఆలంబనగా సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు రాష్ట్ర నేత భాస్కర్ అలియాస్ అడెల్లు పోలీసు ఎన్‌కౌంటర్ రక్తపు మరకగా మిగిలింది.

రేవంత్‌రెడ్డి కేబినేట్‌లో మంత్రి పదవి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, వెడ్మ బొజ్జు మధ్య దోబూచులాడింది. ఢిల్లీస్థాయిలో మంత్రాంగం నడిచింది. పదవి వివేక్‌ను వరించింది. అసంతృప్తికిలోనైన ప్రేమ్‌సాగర్‌రావు వర్గాన్ని కేబినెట్ హోదా గల రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పదవితో సంతృప్తిపర్చాల్సి వచ్చింది. ఇటీవల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) కొత్త అధ్యక్షులను నియమిం



చింది. ఆదిలాబాద్-నరేష్ జాదవ్, ఆసిఫాబాద్-ఆత్రం సుగుణ, నిర్మల్-వెడ్మ బొజ్జు, మంచిర్యాల-రఘునాథ్‌రెడ్డిని నియమించింది.

ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస పోటీ చేయలేదు. కాంగ్రెస్, భాజపాల మధ్య పోటీ ఏర్పడింది. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, భాజపా నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రచారం చేశారు. చివరికి భాజపా అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపొందటంతో కమల దళానిది పైచేయిగా నిలవగా.. కాంగ్రెస్ శిబిరంలో నైరాశ్యం ఆవరించింది. రైతుల తరఫున కేటీఆర్, జనజాతర పేరిట కవిత పర్యటించడం గమనార్హం. ఆసిఫాబాద్‌కు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ పర్యటనలో జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారుల అభివృద్ధి అంశం తెరపైకి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం ఉన్నా భాజపా రాష్ట్ర కార్యవర్గంలో మంచిర్యాలకు చెందిన రఘునాథ్‌రావు ఒక్కరికే ఉపాధ్యక్షుడిగా అవకాశం లభించించింది. ఆ పార్టీ జిల్లా సారథులను నియమించింది. ఆదిలాబాద్-బ్రహ్మానందం, నిర్మల్-రితేష్‌రాథోడ్, ఆసిఫాబాద్-మురళీధర్, మంచిర్యాల- వెంకటేశ్వర్ గౌడ్‌కు అవకాశం కల్పించింది. జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదనే అంశం అధిషా'నం దృష్టికి వెళ్లింది.

# వీధుల్లో చెత్త.. నల్లా నీర్ బంద్



కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులతోపాటు తాగునీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహించే కార్మికులు సైతం సమ్మె బాటపట్టారు. బకాయి వేతనాలు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించకపోవడంతో ధర్నా చేస్తున్నారు.

**రెండు రోజులుగా..**

బల్దియాలో అయిదు ట్యాంకుల ద్వారా రోజూ 11 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు పెద్దవాగు పంపు హౌజ్ ఆపరేటర్లు, నీటి సరఫరా, ఎలక్ట్రీషియన్ విభాగాల్లో మొత్తం 32 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ట్యాంకులకు పెద్దవాగు నుంచి నీటి సరఫరా, అక్కడినుంచి వార్డులకు నల్లాల ద్వారా నీటి సరఫరాతోపాటు పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపడుతున్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదు. దీంతో కార్యాలయం ఎదుట బైఠాయించి సమ్మెకు దిగడంతో.. రెండు రోజులుగా సరఫరా నిలిచిపోయింది.

**పేరుకుపోతున్న చెత్తాచెదారం..**

పారిశుద్ధ్య విభాగంలో 141 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయిదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో.. ఈ నెల 22 నుంచి తొమ్మిది రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, అనారోగ్యం పాలైన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వాపోతున్నారు. సమ్మె కారణంగా పట్టణంలోని వీధులన్నీ చెత్తతో నిండిపోయాయి.

**ప్రభుత్వం స్పందిస్తేనే..**

జీతాలు సక్రమంగా అందకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును కార్మికుల నుంచి వసూలు చేసి ఖాతాల్లో జమ చేయడం లేదనే సమస్యలపై పారిశుద్ధ్య కార్మికులు.. పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం లభించడంలేదు. పారిశుద్ధ్య, మంచినీటి, ఎలక్ట్రీషియన్ విభాగాల కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు రూ.1,43,03,285 అవసరం. మున్సిపల్ కమిషనర్ రాజేందర్ నేతృత్వంలో కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. స్పందించిన పాలనాధికారి కార్మికుల వేతనాల చెల్లింపునకు నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

# కాలం కలిసిరాక.. అన్నదాత గోస



మంచిర్యాల : ఈ ఏడాది ఆగస్టులో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగడంతో తీర ప్రాంతాల్లోని వరి, పత్తి చేలు నీట మునిగాయి. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఈ ఏడాది అన్నదాతకు కలిసి రాలేదు. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు, తుపాను ప్రభావం రైతన్నకు శాపంగా మారింది. తెగుళ్లు దిగుబడిపై ప్రభావం చూపాయి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించిన రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

**మద్దతు అంతంతమాత్రమే..**

పత్తి కొనుగోలు కోసం ప్రభుత్వం ఈ సారి కిసాన్ కపాస్ స్లాట్ బుకింగ్ యాప్ ప్రవేశపెట్టింది. క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.8,150 నిర?యించగా.. సీసీఐ నాణ్యత పేరుతో రూ.8,010 ధరతో కొనుగోలు చేసింది. 8 శాతం కన్నా ఎక్కువ తేమ వస్తే తేమ పేరుతో మరింత ధర తగ్గిస్తుండటంతో చాలా చోట్ల రైతులు దళారులు చెప్పిన ధరకే వారికే అమ్ముకున్నారు. వరిలో వానాకాలం సన్నాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రైవేటు ధర.. ప్రభుత్వ ధరతో సమానంగా ఉండటంతో ప్రైవేటుకే విక్రయించారు. యాసంగిలో వరి ధాన్యం అమ్మేందుకు రైతులు అవస్థలు పడ్డారు. రైస్ మిల్లర్లు తేమ, నాణ్యత పేరుతో కోతలు విధించడంతో రైతులు నష్టపోయారు.

తుపాను.. తెగుళ్లతో తగ్గిన దిగుబడి

అకాల వర్షం, తెగుళ్ల ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నివారణకు పెట్టుబడి పెరిగింది. ఇంత చేసినా పంట చేతికి వచ్చే సమయంలో ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు చాలా చోట్ల పైరు నేల రాలింది.

పెట్టుబడి సైతం రాలేదు

చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బత్తుల బుచ్చన్న. రెబ్బనపల్లి గ్రామం. అయిదున్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగు, పురుగు మందులు, ఎరువులు, కూలీలకు కలిపి రూ.1.80 లక్షల పెట్టుబడి అయింది. వర్షాలకు పొలం పడిపోయింది. 50 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే చేతికి వచ్చింది. కనీసం పెట్టుబడి చేతికి రాలేదని వాపోతున్నారు.

# పరిశ్రమ స్వార్థం.. ఒంట్లోకి విషం



సిరిసిల్ల : జిల్లాలో బియ్యం మిల్లులు, డంపింగ్‌యార్డులు, గ్రానైట్ క్వారీలు, క్రషర్ల నుంచి వెలువడే కాలుష్యానికి తోడు సిరిసిల్ల పట్టణంలో అద్దకం పరిశ్రమ కూడా ఉంది. ఇందులో రంగుల తయారీకి ఉపయోగించే రసాయనాలు.. వాటి కలయిక పూర్తిగా పాత పద్ధతిలోనే సాగుతుండటంతో అందులోని కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. చుట్టూ గాలి, నీరు కలుషితమవుతోంది. సిరిసిల్ల పట్టణంలో నెలకొన్న పరిస్థితులపై కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 49 పరిశ్రమలపై పీసీబీకి ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ బృందం ఆరు పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేశారు. అందులో జిల్లాలోని అద్దకం పరిశ్రమ ఉండటం గమనార్హం.

**60కి బదులు 77 మైక్రోగ్రాములు**

జిల్లా వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా అద్దకం పరిశ్రమ విస్తరించింది. వీటిలో వేలాదిమంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇందులో పనిచేస్తున్నవారు ఎలాంటి రక్షణ చర్యలు పాటించకపోవడంతో శ్వాసకోస, జీర్ణాశయం, అలర్జీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అద్దకం పరిశ్రమలో ఒక ఘనపు మీటర్‌కు 60 మైక్రోగ్రాముల వాయు నాణ్యత ఉండాల్సినచోట.. సగటున 77 మైక్రోగ్రాములు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేశాయి.

**ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు**

బియ్యం మిల్లుల యంత్రాలు వెదజల్లే పొగతో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువై సమీప పొలాలు, చెట్లకు పొగ, ధూళి చేరుతుంది. సిరిసిల్ల పట్టణంలో బియ్యం మిల్లుల కన్నా అద్దకం పరిశ్రమలే ఎక్కువున్నాయి. వీటినుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలను చాలావరకు శుద్ధి చేయకుండానే వదులుతున్నారు. వీటిపక్కనే తాగునీటి పైపులు ఉండటం.. కొన్నిసార్లు పైపుల్లో కలిసి నీరు రంగు మారుతున్న ఉదంతాలు లేకపోలేదు.

**కనిపించని టాస్క్‌ఫోర్స్ బృందాలు**

ఆరునెలలకొకసారి జిల్లాస్థాయి వాయు నాణ్యత కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికి ఎక్కడా జరగడంలేదు. పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసేది. సిబ్బంది కొరతతో ఆయా బృందాల జాడ కరవైంది.

**కాగితాలకే పరిమితం**

పట్టణ బృహత్ ప్రణాళికలో భాగంగా పరిశ్రమల జోన్‌ను పెద్దూరులో నిర్ణయించారు. ప్రణాళిక అమలు కాకపోవడంతో జనావాసాల్లోనే కొనసాగుతున్నాయి. టెక్స్‌టైల్, అపరెల్ పార్కుల మాదిరిగా అద్దకం పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని గతంలో యూనిట్ల యజమానులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికోసం పట్టణంలో సర్వే కూడా చేశారు. ఆ నివేదికలు కాస్త కాగితాలకే పరిమితమయ్యాయి.

# ఇసుక దిబ్బలు.. కన్నీటి సుడులు

ఇందల్‌వాయి: ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇసుక కుప్పలు ధర్పల్లి మండలం వాడి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రైతు పొలంలోనివి. ఆగస్టులో భారీ వర్షానికి ముత్యాల చెరువు తెగి ఆయనకున్న రెండెకరాల పొలమంతా ఇసుక మేటలు వేయడంతో వానాకాలంలో చేతికందిన పంట మొత్తం పోయింది. రెండు ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో దాదాపు 30 గంటలకు పైగా ఇసుక, ఇతర వ్యర్థాలను కుప్పలు చేశారు. మరో 30 గంటలైనా పొలం పూర్వ పరిస్థితికి వచ్చే అవకాశం లేదని యాసంగి సాగు మానుకున్నారు. పంట నష్టంతో రూ.3 లక్షలు, పొలాన్ని యథాస్థితికి తెచ్చేందుకు రూ.లక్ష వరకు నష్టం జరిగింది. ఈ ఏడాది ఆగస్టు 28న హొన్నాజిపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోయి ధర్పల్లి, సిరికొండ, భీమ్‌గల్ మండలాల్లో బీభత్సం సృష్టించింది. వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటమునిగాయి. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతోపాటు ఇందల్‌వాయిలోని డొంకల్ చెరువు తెగి గౌరారం, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వరదలు ఉప్పొంగాయి. వ్యవసాయాధికారులు వారం రోజులు క్షేత్రస్థాయిలో తిరిగి పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు.



అత్యవసరంగా స్పందించాల్సిన ప్రభుత్వం నాలుగు నెలలు గడిచినా.. నష్టపరిహారంపై ఊసెత్తడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇసుక మేటలు వేశాయి. 2 ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు సుమారు రూ.3 లక్షలు ఖర్చయింది. ప్రస్తుతం 2 ఎకరాల్లో వరి వేశా. మరో మూడు ఎకరాలను చదును చేయాల్సి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

రతన్, బీరప్ప తండా

**ప్రభుత్వానికి పంపాం** నష్టపోయిన పంటలపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపాం. సర్కారు నిధులు విడుదల చేసి ఉత్తర్వులిస్తుంది. తదనుగుణం గా వాటిని అమలు చేస్తాం.శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి, ఇందల్‌వాయి

# అడ్డగోలుగా అక్రమం

రాజోలి : అధికారులను మచ్చిక చేసుకొని.. ఒకరికొకరు గుంపులుగా మారి.. సహజ సంపదను అడ్డగోలుగా దోచేస్తున్నా పట్టించుకునే నాథుడులేక, ఇసుకాసురులు ఆడింది ఆటగా సాగుతోంది. రాజోలి శివారులోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను రాత్రికి రాత్రి ఊరు దాటించేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు స్థానిక ప్రజలు ఇసుక దొరకక, నానా ఇక్కట్లు పడుతుంటే.. అక్రమార్కులు మాత్రం స్వేఛగా తరలించేస్తున్నారు. ప్రస్తుతం నదిలో ప్రహహం ఉన్నప్పటికీ లెక్కచేయకుండా పగటి వేళ ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక డంపులు వేస్తున్నారు. రాత్రివేళ, తెల్లవారుజామున జేసీబీ, ట్రాక్టర్లతో నదిలోకి దిగి శాంతినగర్, అయిజ, గద్వాల తదితర ప్రాంతాలకు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పోలీసులు పహారా ఉందని, భారత్‌మాల హైవే ద్వారా ఈ తంతు కొనసాగుతోందని సమాచారం. **బెదిరింపులు:** రాజోలిలో గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల సమీపంలో, మార్లబీడు వీధి, పునరావాస గృహాలు, కల్లాలుండే ఖాళీ



ప్రదేశాలు, పాడుబడిన ఇళ్ల మధ్య పెద్ద ఎత్తున ఇసుక డంప్ చేస్తున్నారు. రాత్రయి ందంటే.. ఈ డంపులను టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి టిప్పరుకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు, ట్రాక్టర్ ఇసుకను రూ.6 – రూ.10 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇది రోజూ జరిగే తంతు అయినా.. కూతవేటు దూరంలోని ఠాణా, ఇసుక డంపులున్న ప్రాంతాల్లోనే మండల అధికా రుల కార్యాలయాలున్నా వారు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న కొందరిపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఇసుకాసు రులు యథేఛగా ఈ తంతుకు పాల్పడుతున్నారనే ప్రజలు అంటున్నారు. అక్రమ రవాణా చేస్తే చర్యలుంటాయని తహసీల్దార్ రామ్మోహన్ పేర్కొన్నారు.

# రక్షించే కార్మికులకు ఇదేం శిక్ష!

తాంసి : సూర్యోదయానికి ముందే చీపుళ్లు.. చెత్త బుట్టలు, పూడికతీసే పారలతో వీధుల్లోకి అడుగుపెడతారు.. స్వఛతేకు రాత్రింబవళు శ్రమిస్తారు.. ప్రజలకు వ్యాధులు దరి చేరకుండా రక్షిస్తారు... అయినా, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు కరవయ్యాయి. చర్మ వ్యాధుల బారిన పడుతున్నా.. అధికారులను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 473 పంచాయతీల్లో 1576 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లతోపాటు వీధుల పరిసరాలను శుభ్రంగా ఉంచడం, మురుగు కాల్వల్లో పూడికతీత పనులు, చెత్తను తొలగిస్తుంటారు. ప్రభుత్వం పంచాయతీ నిధులతో ఏటా రెండు సార్లు కార్మికులందరికీ గ్లౌజులు, మాస్క్‌లు, రెండు జతల వస్త్రాలు, బూట్లు, తువాళ్లు, కొబ్బరినూనె, శానిటేషన్‌కు సంబంధించిన సబ్బులు ఇవ్వాలి. కానీ, క్షేత్రస్థాయిలో మాస్క్, బూట్లు, గ్లౌజులు ఇలా ఏదీ ఇవ్వడం లేదు. కొంతమంది కార్మికులు మాత్రం సొంతంగా కొనుగోలు చేసి ఆరోగ్యం కాపాడుకుం టుంటే.. మరికొందరు పూడిక, చెత్త ఇతర పనులు చేసే క్రమంలో చేతులు, కాళ్లు చెడిపోయి.. ఒళ్లంతా రోగాలతో బాధపడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

**బీమా చేయించాలి**

-బొజ్జు ఆశన్న, పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ నిధులతో బీమా తప్పనిసరిగా చేయించాలి. కొన్నిచోట్ల చేయించడం లేదు. రక్షణ పరికరాలు ఆరు నెలలకోసారి అందించాలి. పలుమార్లు జిల్లా అధికారులు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

## కొత్త ఏడాదిలోనైనా.. మారేనా..!

హుజూర్‌నగర్ : సీఎంఆర్ సేకరణ ఈ ఏడాది ఒడుదొడుకుల మధ్య కొనసాగింది. తాజాగా వానాకాలం ధాన్యాన్ని కూడా ఇటీవలే మిల్లులకు కేటాయించారు. తీసుకున్న ధాన్యం సకాలంలో ఇవ్వక ఈ సంవత్సరం కొందరు మిల్లర్లు కేసులపాలై అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. నూతన సంవత్సరంలోనైనా అన్ని సమస్యలను అధిగమించి లక్ష్యాలను పూర్తి చేస్తారన్న విశ్వాసంతో అధికారులు ఉన్నారు. సీఎంఆర్ ధాన్యం తీసుకుని ఇవ్వని మిల్లర్లను అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. వారికి కొంతకాలంగా ధాన్యం కేటాయించడం లేదు. మరికొందరు పేర్లు, ఊర్లు మార్చి పాత మిల్లులను లీజుకు తీసుకుని కేటాయింపులు చేసుకున్నారు. పూర్తిగా బ్లాక్ లిస్ట్‌లో ఉండి ధాన్యం కేటాయింపులు లేని మిల్లర్లను ఆదుకోవాలని రైస్‌మిల్లర్స్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉన్న బకాయిలలో 25 శాతం అన్ని రకాల పెనాల్టీలతో చెల్లిస్తే కేటాయింపులు చేయాలని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. 2022-23 యాసంగి ధాన్యం మిల్లులకు ఇచ్చిన తరువాత వివిధ కారణాలతో ప్రభుత్వం సీఎంఆర్ చేయించకుండా ఆ ధాన్యాన్ని వేలం వేసింది. అలా 66 మంది మిల్లర్ల వద్ద ధాన్యం ఉండిపోయింది. ఆ ధాన్యాన్ని వేలంలో పాడిన గుత్తేదారుకు



ఇవ్వాలని ఎన్ని నోటీసులు ఇచ్చినా మిల్లర్లు స్పందించలేదు. అందులో 8 మందిపై కేసులు నమోదయ్యాయి. 8 మంది నుంచి రావాల్సిన ధాన్యం ఖరీదు రూ.273 కోట్లు.

జిల్లాలోని మిల్లర్లు 2019–20 నుంచి 2024–25 వరకు గన్నీ సంచులు తిరిగి ఇవ్వడం లేదు. మిల్లుల నుంచి దాదాపు 7 నుంచి 8 కోట్ల గన్నీ సంచులు రావాల్సి ఉంది. వీటిని రాబట్టేందుకు ప్రభుత్వం ఇటీవలే మిల్లర్లకు నోటీసులు జారీ చేసింది. ఎవరెవరు ఎంత బాకీ ఉన్నారనే లెక్కలు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్నారు. సన్నబియ్యం వచ్చే సమయానికి ఉమ్మడి జిల్లాలో రేషన్ దుకాణాలలో, గోదాములలో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. వాటిని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 9 నెలల తరువాత వాటికి మోక్షం లభించి కొత్త సంవత్సరంలో వాటిని వేలం వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

## రాత్రిపూట.. ఇసుకాసురుల వేట..!

కొత్తగూడెం : కొందరు వ్యక్తులు రింగులా ఏర్పడి జిల్లాలోని సహజ సంపదను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మీదుగా హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సొంతింటి నిర్మాణానికి ఇసుక దొరకక్క సామాన్యులు కన్నీరు పెడుతుంటే.. అక్రమార్కులు మాత్రం నదీగర్భాలను గుల్లచేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. పగలు ప్రశాంతంగా కనిపించే నదీతీరాలు చీకటి పడగానే సందడిగా మారుతున్నాయి. అక్రమార్కులు.. భారీ యంత్రాలతో ఇసుకను తోడేసి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు.

**సరిహద్దులు దాటిస్తున్నారు..**
జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తవ్వుతున్న ఇసుక.. స్థానిక ప్రజలకు అందటం లేదు. భారీ లారీల్లో లోడ్ చేసి రాత్రికి రాత్రే ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్నచోట విక్రయిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.

**మామూళ్ల మత్తులో యంత్రాంగం**
కొన్నిచోట్ల అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోందనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. పహారా కాయాల్సిన వారే పక్కకు తప్పుకోవటంతో ఇసుక మాఫియాకు అడ్డు లేకుండా పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పట్టుకునేది ఎవరిని..?**
ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ, మైనింగ్, పోలీసు యంత్రాంగం పట్టుకుంటున్నా.. మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడకపోవటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండ లేనివారిని.. అధికార యంత్రాంగానికి అంతా 'మామూలే' అని చెప్పని వారినే పట్టుకుంటున్నారనే వాదనలు



వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు స్థానిక తహసీల్దార్లు, పోలీసులు ఎప్పటికప్పుడు కేసులు నమోదుచేస్తున్నారని ఉన్నతాధికారులు చెప్పటం పరిపాటిగా మారుతోంది.

**సామాన్యులకు చుక్కలు**
సామాన్యుడు ఒక ట్రాక్టర్ ఇసుక కోసం రూ.వేలు వెచ్చించి అనుమతుల కోసం ఎదురుచూస్తుంటే.. మాఫియా మాత్రం వేల టన్నుల ఇసుకను ఎలా తరలించగలుగుతోంది. అక్రమ రవాణా వెనుక ఉన్న 'పెద్ద' రహస్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మిగులుతోంది.

**ఏడాదిలో 301 కేసులు** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025లో డిసెంబర్ 29 వరకు పోలీసు శాఖ.. ఇసుక అక్రమ రవాణా కేసులు- 301 నమోదుచేయటం గమనార్హం. 327 వాహనాలను పోలీసులు స్వాధీనపరచుకున్నారు. 550 మందిని అరెస్ట్ చేశారు. జిల్లావ్యాప్తంగా సగటున నెలకు 25కు పైగా కేసులు నమోదవటం ఇసుక దందా సాగుతున్న తీరుకు నిదర్శనం గా నిలుస్తున్నాయి. పోలీసుశాఖ కాకుండా రెవెన్యూ, మైనింగ్ అధికారుల నమోదు చేసే కేసులను లెక్కిస్తే ఈ సంఖ్య మరింత పెరగనుంది.

## నకిలీ సృష్టించి.. నచ్చినట్లు విక్రయించి



రాయదుర్గం : ఖాజాగూడలో ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జాకు గురవుతోంది. స్థానిక సర్వే నంబరు 40లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం జాగా కేటాయించింది. సంబంధిత లబ్ధిదారులు తమ స్థలాలను ఇప్పటికే ఇతరులకు విక్రయించారు. ఆ లబ్ధిదారుల పేరిట ఫోర్జరీ పత్రాలు సృష్టించి, వేరే ప్రభుత్వ స్థలాన్ని ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇలా సర్వే నం.40లో తాజాగా రూ.15 కోట్ల విలువైన మిగతా స్థలాలను కాజేస్తున్నారు.

**24 మంది నుంచి సేకరణ..** 2000లో రాయదుర్గంలో రోడ్డు విస్తరణకు స్థల సేకరణ చేశారు. విస్తరణలో ఆస్తులు కోల్పోయిన 24 మందికి ఖాజాగూడలోని సర్వే నంబరు 40లో ఇళ్ల స్థలాలు అందజేశారు. అలా ఒకరికి ప్లాట్ నం.3లో 315.74 గజాలు, మరో మహిళకు ప్లాట్ నం.5లో 86.79 గజాలు ఇచ్చారు. వారు 2003, 2004లోనే ఆ స్థలాలను ఇతరులకు విక్రయించారు. కాగా వారిద్దరూ కలిసి 401 గజాల స్థలాన్ని తనకు జీపీఏ చేసినట్లు ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించాడు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి ఆ స్థలాన్ని మరో ఇద్దరికి విక్రయించినట్లు సేల్ డీడ్ రూపొందించారు. నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ నంబరు స్థానంలో మరో నంబరు వేసి, నకిలీ పత్రాలు సృష్టించారు. 401 గజాలకు సేల్ డీడ్ ఉండగా 600 గజాల స్థలాలు ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్నారు. అదే ప్లాట్ పక్కన 400 గజాల మరో స్థలాన్ని ఇదే విధానంలో ఆక్రమించారు. స్థానికంగా 24 మందికి స్థలాల కేటాయిస్తే, ప్రస్తుతం 40 వరకు ప్లాట్లు పుట్టుకొచ్చాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై శేరిలింగంపల్లి ఆర్ఐ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. సంబంధిత రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఆట ఏదైనా 'గెలుపు మాదే..!'



హైదరాబాద్ : హైదరాబాద్‌వారి వయసు పిల్లలంతా ఫోన్లో గేమ్స్ ఆడుతూ బిజీగా ఉంటారు. కానీ వీరు మాత్రం క్రీడల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

**పల్టీలు కొట్టేస్తా.. రోహణ్**
సనత్‌నగర్‌కు చెందిన రోహణ్‌కి ఎనిమిదేళ్లు. మూడో తరగతి చదువుతున్నాడు. రోజూ చదువుతో పాటు శారీరక శ్రమను అలవాటు చేసుకుని జిమ్నాస్టిక్‌పై మక్కువ పెంచుకున్నాడు. నేర్చుకున్న వ్యాయామంతో పల్టీలు కొట్టడం నేర్చుకున్నాడు. చేతుల మీద ఒక నిమిషంలో 75 అడుగులు వేసి బ్యాక్ హ్యాండ్ స్ప్రింగ్స్‌లో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సృష్టించాడు. ఒక నిమిషంలో ముందుకు 90 పల్టీలు కొట్టి జిమ్నాస్టిక్స్‌లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ సృష్టించాడు. నాన్ స్టాప్‌గా చేతులపై మూడు నిమిషాలలో 425 అడుగులు నడిచి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాడు.

**నాతో క్రికెట్ ఆడేస్తారా..శ్రీచైత్ర**
వనస్థలిపురానికి చెందిన శ్రీచైత్ర 8వ తరగతి చదువుతోంది. ఆరేళ్ల వయసు నుంచి క్రికెట్ ఆడడం ప్రారంభించింది. ఇటీవల భోపాల్‌లో జరిగిన సీబీఎస్ఈ పాఠశాలల జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇప్పటివరకు రెండు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆడారు. ఇటీవల ప్రపంచ పాఠశాలల క్రికెట్ పోటీల్లో దేశం తరఫున పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన ఒకే విద్యార్థినిగా గుర్తింపు సాధించడంతో ఎంతో ఆనందంగా ఉందంటోంది శ్రీచైత్ర.

**స్కేటింగ్‌లో ఛాంపియన్... ప్రణవ్ మాధవ్**
యూసుఫ్‌గూడ మధురానగర్‌కు చెందిన సూరపనేని ప్రణవ్ మాధవ్(8). 2018లో వేసవి సెలవుల్లో స్కేటింగ్ ప్రారంభించాడు. ఓ వైపు చదువు సాగిస్తూనే ఐస్ స్కేటింగ్‌పై మక్కువ పెంచుకున్నాడు. ఇప్పటివరకు 4 జాతీయస్థాయి పతకాలు, 7 రాష్ట్రస్థాయి పతకాలు, 3 వింటర్ ఖేలో ఇండియా పతకాలు సాధించాడు. నవంబరులో కజకిస్థాన్‌లో నిర్వహించిన షార్ట్ ట్రాక్ ఐస్‌స్కేటింగ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 22వ స్థానం సాధించాడు. దీంతో ఐస్ స్కేటింగ్‌లో జూనియర్ ప్రపంచ కప్‌కు అర్హత సాధించిన రాష్ట్రం నుంచి మొదటి వ్యక్తిగా నిలిచాడు.

**పరుగు పందెంలో నేనే నం.1..మయూరిక**
సైనిక్‌పురికి చెందిన మయూరిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఆరేళ్ల నుంచి పరుగు సాధన ప్రారంభించింది. 2024లో భారతీ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొని పూర్తి చేసింది. దీంతో ఆ సంస్థ వాళ్లు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేశారు. ఈ ఏడాది తమిళనాడులో జరిగిన 10 కిలోమీటర్ల పందెంలో విజేతగా నిలిచి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైంది. తనకు వచ్చిన నగదు పారితోషికాన్ని పేదలకు పంచుతోంది.

**నాతో ఆడితే చెప్పేస్తా చెక్‌మేట్**
అనయా పుట్టింది బంజారాహిల్స్. నాలుగోతరగతి చదువుతోంది. నాలుగేళ్ల నుంచే చురుగ్గా ఉండడంతో అమ్మానాన్న చదరంగం పరిచయం చేశారు. ఆటలో చురుకుదనం చూసి.. ప్రత్యేక శిక్షణ ఇప్పించాలనుకున్నారు. శిక్షకుడు అర్మీత్‌పాల్ సింగ్ వద్ద శిక్షణ ఇప్పించారు. ఎనిమిదేళ్లకే రాష్ట్ర, జాతీయ స్థాయిలో తన సత్తా చాటుతోంది. జులైలో జార్జియాలోని బటుమిలో జరిగిన అంతర్జాతీయ అండర్-8 విభాగంలో దేశం తరఫున మొదటి సారి ప్రాతినిధ్యం వహించింది. 200 మంది తన విభాగంలో పాల్గొనగా 7వ స్థానంలో నిలిచింది.

## ఇంకెన్ని ప్రాణాలు పోవాలె!



గంగాధర : ఇటీవల గంగాధర మండలం కొండన్నపల్లి సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ కారును వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వాహనదారుడితోపాటు కారులో ఉన్న వ్యక్తి కూడా మృతి చెందారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు వద్ద ఎమ్మెల్యే సత్యం వాహన కాన్వాయ్‌లో కార్లు ఢీకొన్న ఘటనలో గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఈ ఘటనలే కాదు కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక రూపంలో మృత్యువు ముంచుకొస్తుంది. ఇలా ఎన్ని ప్రమాదాలు జరిగినా.. ఎందరు మృత్యువాత పడుతున్నా.. ఎన్ని కుటుంబాలు వీధిన పడుతున్నా.. పట్టించుకునేవారు లేరు. 40 ఏళ్ల కిందట వేసిన రహదారి విస్తరణ జరగక ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కొండగట్టు, ధర్మపురి పుణ్యక్షేత్రాలు, జగిత్యాలలోని పొలాస, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రకు ఇదే మార్గం కావడంతో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి.

**భూసేకరణ దశ దాటి.. నిధుల మంజూరు**
కరీంనగర్-జగిత్యాల జిల్లాలను కలిపే 59 కి.మీ జాతీయ రహదారి విస్తరణకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.2,484 కోట్లు విడుదల చేసింది. ఇందుకుగాను 306.7 హెక్టార్ల భూమి కూడా సేకరించారు. గతంలో 'తేలని భూసేకరణ.. ముందుకెళ్లని విస్తరణ' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించి భూసేకరణ సర్వే పూర్తి చేశారు. కొందరు బాధితులకు పరిహారం జమ కాలేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరముంది. అయితే కొందరు బాధితులకు పరిహారం జమ కాలేదు.

**పోలీసులు గుర్తించిన బ్లాక్‌స్పాట్లు..**
రేకుర్తి వంతెన, రామాలయం మలుపు, కొత్తపల్లి-వెలిచాల క్రాస్‌రోడ్డు, కొత్తపల్లి ఎస్సారెస్పీ కాలువ వద్ద, దేశరాజ్‌పల్లి, వెదిరలోని రెండు వంతెనల వద్ద, హిమ్మత్‌నగర్ క్రాస్‌రోడ్డు, కురిక్యాల వంతెన, మధురానగర్ దాటాక, పూడూర్-ఆరెపల్లి మలుపు, నమిలకొండ శివారులోని రైల్వే ట్రాక్, రాజారం వంతెన, కొండగట్టు-బల్వంతాపూర్ క్రాస్‌రోడ్డు, అభయాంజనేయస్వామి గుడి మలుపు వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు.

## లష్కర్ల నియామకం

ఖమ్మం : లష్కర్ల నియామకంతో జిల్లాలో నీటి పారుదల శాఖ జవసత్వాలను నింపుకుంది. దశాబ్దాల నుంచి జరగని లష్కర్ల నియామకాన్ని పొరుగు సేవల విధానంతో ప్రభుత్వం ఇటీవల చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే సిబ్బంది విధుల్లో చేరారు. పర్యవేక్షణాధికారుల ఆధ్వర్యంలో పనుల్లో సైతం దిగడంతో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో అస్తవ్యస్తంగా ఉన్న నీటి సరఫరా కాల్వల కట్టలు కొత్తరూపాన్ని సంతరించుకుంటున్నాయి. యాసంగిలో పంటల సాగుకు సక్రమ రీతిలో నీరందించే క్రమంలో లష్కర్ల పాత్ర కీలకం కానుంది.

**ఖమ్మం జిల్లాకు 172 మంది..**
జిల్లాకు 172 మందిని ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా నియమించింది. పదో తరగతి విద్యార్హతతో రూ.15,600 వేతనంతో లష్కర్లు విధుల్లో చేరారు. జిల్లాకు నియమితులైన సిబ్బందిని ఖమ్మం, కల్లూరు సర్కిళ్ల పరిధిలో కేటాయించారు. ఖమ్మం సర్కిల్‌కు 73 మంది, కల్లూరు సర్కిల్‌కు 99 మందిని నియమించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలోని



పాలేరు డివిజన్‌కు 40 మంది, ఖమ్మం డివిజన్‌కు 11 మంది, వైరా డివిజన్‌కు 22 మంది, కల్లూరు సర్కిల్ పరిధిలోని కల్లూరు డివిజన్‌కు 34 మంది, సత్తుపల్లికి 19 మంది, మధిరకు 46 మంది నియామకం జరిగింది.

**విధులు ఇవే..**
ప్రతి ఒక్క లష్కర్ కనీసం 9 కిలోమీటర్ల పరిధిలోని కాల్వల పరిరక్షణ చేపట్టాల్సి ఉంటుంది. కాల్వలు, కట్టలపై పిచ్చి మొక్కలను తొలగించడం, కట్ట పటిష్ఠత పరిశీలన, నీటి సరఫరాలో ఏమైనా అవాంతరాలు ఉంటే పర్యవేక్షణాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లాంటివి చేస్తారు. కాల్వలో నిర్ణీత పరిమాణంలో నీటిని సరఫరా చేస్తూ.. ఆయకట్టుకు సమాంతరంగా నీరు చేరేలా పర్యవేక్షించడం, గేట్లు, షట్టర్ల నిర్వహణ, ఏమైనా మరమ్మతులు అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తదితరాలను అధికారులకు నివేదిస్తారు. పొరుగుసేవల విధానంతో జిల్లాలో 172 మంది నియామకం జరిగింది. డివిజన్ల వారీగా కేటాయించాం. డీఈఈలు, ఏఈల పర్యవేక్షణలో లష్కర్లు విధుల్లో చేరి కేటాయించిన పనులు చేపడుతున్నారు.
మంగళంపూడి వెంకటేశ్వర్లు. ఎస్ఈ ఖమ్మం సర్కిల్

## ప్రయోగం.. ఆలోచనలకు రూపం

హుజూర్‌నగర్ : సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ రూపం కల్పించి వాటి ప్రయోగాత్మక నమూనాలు చేసి ఔరా అనిపించారు విద్యార్థులు. హుజూర్‌నగర్ విజయ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ నమూనాలను ప్రదర్శించారు. శాస్త్ర, సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారాలు చూపించిన తీరు సందర్శకులను ఆలోచింపజేసింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన నమూనాలను తయారు చేసిన వారిని పలకరించగా వాటి ఉపయోగాలను వివరించారు.

**అప్రమత్తం చేసేలా..**
ప్రమాదాలను తగ్గించడానికి, ఆరోగ్య హెచ్చరికలతో కూడిన స్మార్ట్ స్టీరింగ్ ఇది. శరీర, మానసిక దృఢత్వాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంది. నిద్రమత్తు, ధూమపానం, మద్యపానం, వాహనం ముందు అడ్డంకులను స్మార్ట్ స్టీరింగ్ కనిపెడుతుంది. ఇందులోని మైక్రో కంట్రోలర్‌తో అనుసంధానమైన స్మార్ట్ సెన్సార్‌లతో ఇది పనిచేస్తుంది. వాహనం నడిపే సమయంలో అసాధారణ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ముందుగానే హెచ్చరించి అప్రమత్తంగా వ్యవహరించడానికి, ఇతర హెచ్చరికలను ఇది ముందే చెబుతుంది. దీని ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.
కె.మహిధర్, సూర్యాపేట

**ఇంట్లో లేకున్నా మొక్కలకు నీరు..**
నీటిని పొదుపుగా వాడుతూ ఇళ్లలో మొక్కల పెంపకం, వ్యవసాయం ఎలా చేయాలో ఈ నమూనా తెలియజేస్తోంది. ఇందులో మొక్కకు నీరు ఎంత పెట్టాలనుకుంటున్నారో దానికి సెన్సార్ ఏర్పాటు చేసి మోటారు ఆన్ చేయాలి. మొక్కకు నీరు సరిపడా రాగానే ఆటోమేటిక్‌గా మోటారు ఆగిపోతుంది. పెరటి మొక్కలకు, పెద్ద తోటలకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మనం ఇంట్లో లేని సమయంలోనూ నీరు పెట్టవచ్చు. నీటి పొదుపుతో పాటు విద్యుత్తు కూడా ఆదా అవుతుంది. ఎస్‌కే రషీద్, కోదాడ

**ట్రాఫిక్‌ను బట్టి కదిలే డివైడర్**
ట్రాఫిక్ ఇబ్బందులతో అతి తక్కువ దూరం కూడా గంటల తరబడి వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయాలలో కదిలే డివైడర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి గమ్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. కదిలే డివైడర్లు ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సాయంతో రోడ్డు డివైడర్లకు అనుసంధానం చేసి ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయో అక్కడ డివైడర్లు అనుకూలంగా కదిలే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాలలో ఒకవైపు భారీ ట్రాఫిక్ ఉంటుంది. మరో వైపు ఉండదు. అలాంటి సమయాలలో డివైడర్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించుకోవచ్చు. ఎస్‌కె సమీర, సూర్యాపేట

## కూరగాయల కుతకుత..

ఎనుమాముల : వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కొద్దిరోజులుగా ధరలు అమాంతం పెరుగుతుండటంతో.. పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు చలి తీవ్రత కారణంగా.. కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో.. చికెన్, గుడ్ల ధరలు సామాన్యుడికి అందనంటున్నాయి. గత అక్టోబరులో వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో కూరగాయల తోటలు తీవ్రంగా దెబ్బతినడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

**రిటైల్ ధరలు మరింత ఘాటు** లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో.. రిటైల్ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. సాధారణంగా ప్రతిరోజు మార్కెట్‌కు వచ్చిన సరకు డిమాండ్‌ను బట్టి ధరలను నిర్ణయించి.. మార్కెట్ అధికారులు ధరల బోర్డులో సరకు ధరలను ప్రదర్శిస్తారు. మార్కెట్ పరిధిలో ఆ ధరలను మించి వ్యాపారులు విక్రయించేందుకు అవకాశం ఉండదు. అయితే మార్కెట్ చుట్టూ చిరు వ్యాపారులు విస్తరించడంతో.. మార్కెట్‌లో తక్కువ ధరకు సరకు కొని.. మార్కెట్ వెలుపల రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అసలే కూరగాయల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిరు వ్యాపారుల తీరు వినియోగదారులకు భారంగా మారుతోంది. **వామ్మో.. టమాట..** జిల్లా పరిధిలోని వర్ధన్నపేట, ఖిలావరంగల్, ఐనవోలు మండలాల్లోని కొన్ని గ్రామాలు, సంగెం మండలం వంజరపల్లి తదితర గ్రామాల్లో వాతావరణ అనుకూలతల మేరకు డిసెంబరు నుంచి మార్చి వరకు మాత్రమే టమాట పండిస్తారు. అయితే ఈసారి డిసెంబరులో చలితీవ్రత కారణంగా.. టమాట దిగుబడి భారీగా తగ్గిందని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి, భాగ్యపల్లి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

చురకలు



# సమన్వయం కొరవడి.. అన్నదాతల అలజడి!

సంగారెడ్డి: సింగూరు జలాశయానికి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో సింగూరు, వనదుర్గా (ఘనపురం) ఆనకట్ట కింద పంట విరామం ప్రకటించాలని అధికారులు నిర?యించారు. అయితే దీనిపై నీటిపారుదలశాఖ అధికారికంగా జీవో జారీచేయలేదు. వ్యవసాయశాఖ కూడా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించలేదు. ప్రస్తుత యాసంగితో పాటు మరో రెండేళ్ల పాటు సాగు నీరు అందదని నీటిపారుదల శాఖ అధికారులు మౌఖికంగా చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకు సమాచారం లేదని చెబుతున్నారు. ఇరుశాఖల మధ్య సమన్వయం కొరవడి అన్నదాతలకు శాపంగా మారే పరిస్థితి నెలకొంది.

**ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) ఆదేశాలతో**

ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలతో సింగూరు జలాశయం రివిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవలే సాంకేతిక కమిటీ ప్రాజెక్టును సందర్శించి మరమ్మతులు చేపట్టాలని సూచించింది. దీంతో ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఆమోదం తెలుపగానే ఈ నెలాఖరులోపు నీటిని దిగువకు విడుదల చేయాలని నిరయించింది. వచ్చే నెలాఖరులో పనులు ప్రారంభించాలని నిరయించారు. ఈ సీజన్‌తో పాటు మరో నాలుగు



సీజన్‌లకు సాగునీటిని అందించడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. సింగూరు నుంచి విడుదలయ్యే నీటితోనే మెదక్ జిల్లా ఘనపూర్ ఆనకట్ట కింద పంటలు పండిస్తున్నారు.

**సాగుకు సన్నద్ధమైన రైతులు**

పంట విరామం గురించి రైతులకు తెలియకపోవడంతో యాసంగికి సమాయత్తమవుతున్నారు. ఘనపూర్ ఆనకట్ట కింద కొందరు రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇరుశాఖల అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. వ్యవసాయశాఖ కూడా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలి. సంగారెడ్డి నీటిపారుదల శాఖ ఇన్‌ఛార్జి సీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సింగూర్‌కు మరమ్మతులు చేపడుతున్నామ న్నారు. అందువల్లే ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించనున్నామ న్నారు. సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఉత్తర్వులు రాలేదని పేర్కొన్నారు.

# కంకర.. ఆకాశానికి ధర

ఆదిలాబాద్ : కంకర ధరలు అమాంతం పెరిగాయి. దీంతో నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఇతర నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యయంపై భారం పడకూడదని అధికారులు ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసినా అవి నిస్తేజంలో ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే చాలావరకు కంకర జీరోలో దందా నడుస్తోందనే ఆరోపణలున్నాయి. వస్తుసేవల పన్ను(జీఎస్టీ) ఎగవేసి విక్రయిస్తున్నారనే ప్రచారం ఉంది. పైగా ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారు. పేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లకు పిల్లర్లు, స్లాబ్ నిర్మాణానికి కంకర వినియోగం తప్పనిసరి. ధరలు పెరగడంతో ఒక్కో ఇంటికి దాదాపు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు అదనపు భారం పడుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

**అధికారులు ఏం చేస్తున్నారో..**

ఇందిరమ్మ ఇళ్లపై భారం పడకుండా గనులు, భూగరశాఖ అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ ఏఈ తదితరులతో ఉండే కమిటీ చర్యలు చేపట్టాలి. ఇక్కడ మాత్రం ఎలాంటి నియంత్రణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై గనులు, భూగర శాఖ ఏడీని వివరణ కోరగా.. అది గృహనిర్మాణ శాఖ అధికారులు చూస్తారన్నారు. ఇసుక, కంకరకు జరిమానా వేయడం, చర్యలు తీసుకోవడం మీ శాఖనే చూడాల్సి ఉంటుంది కదా..? అని ప్రశ్నిస్తే.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు.

**రోజుకు 200ల టిప్పర్లు**

జిల్లాలోని ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఉట్నూరు ఇతరత్రా ప్రాంతాల్లో అన్ని నిర్మాణాలకు కలిపి రోజుకు 200లకు పైగా టిప్పర్ల కంకర విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో టిప్పర్ రూ.3 వేలకుపైగా ధర పెరగడంతో రోజుకు రూ.6 లక్షలు ప్రజలపై భారం పడుతోంది. ఇలా నెలకు రూ.1.80 కోట్లు అదనంగా సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇసుకకూ రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారు.

# గ్యాస్ లీకేజీనా..

నిర్మల్ : పేద, ధనిక తారతమ్యం లేకుండా వంటగ్యాస్ వినియోగం అందరికీ చేరువైంది. అయితే, అనుకోని సందరాల్లో ఎప్పుడైనా వంటగ్యాస్ లీకవుతున్నట్లు గుర్తిస్తే ఆందోళనకు గురవడం సహజం. సెలవు రోజులు ఉన్నాయనో, మెకానిక్‌లు అందుబాటులో లేని ప్రాంతమనో కలవరపడొద్దు. టోల్‌ఫ్రీ నంబరు 1906కి కాల్‌చేసి కావాల్సిన సహాయం పొందవచ్చు.

ఎవరు చేయొచ్చు..కంపెనీలు ఏవైనా.. ఈ టోల్‌ఫ్రీ నంబరు అన్నింటికీ వర్తిస్తుంది. దేశమంతా ఇది అందుబాటులో ఉంది. బహుళ భాషల్లో సేవలు అందిస్తుండటంతో మనకు అనువైన భాషను ఎంచుకొని, ప్రాంతం, సమస్యను వివరించడానికి అవకాశముంటుంది. అత్యవసర ఫిర్యాదుగా స్వీకరించి వీలైనంత త్వరగా సిబ్బందిని పంపించి, ఉచితంగా మనకు సేవలందించే ఏర్పాట్లు చేస్తారు. వారాలు, సెలవులు, పండగలతో పనిలేకుండా నిత్యం, 24 గంటల పాటు ఇది పనిచేస్తుంది. ఏం చేయాలి..టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేశాం. ఇక మన పని అయిపోయిందనుకోవద్దు. గ్యాస్ వాసన గుర్తించిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. ఇంట్లో కరెంటు స్విచ్‌లు ఆఫ్ చేయాలి. అగ్గిడబ్బాలు, లైటర్ వంటివి వినియోగించకుండా చూడాలి. తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలి. సురక్షిత ప్రదేశానికి వెళ్లి టోల్‌ఫ్రీ నంబరులో గ్యాస్ లీకేజీ సమాచారం అందించాలి.

# పేరు చెబితే ఊరు తీరు తెలిసే!



మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు స్థానికంగా ప్రాధాన్యం కలిగిన అంశాలతోనే పేర్లు వచ్చాయి. అక్కడి విశిష‘తలతోనే ఏ ప్రాంతం వారైనా ఆ ఊళ్లను టక్కున గుర్తు పడతారు.

**వెల్లుల్ల ఎల్లమ్మ**

మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ఎల్లమ్మ ఆలయం పూర్వకాలం నుంచే ప్రసిద్ధి గాంచింది. ఆలయానికి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి ప్రతి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో ఎవరికైనా వెల్లుల్ల గ్రామమంటే ఎల్లమ్మ ఆలయం గుర్తుకొస్తుంది.

**జేసంద్రం.. జగ్గాసాగర్**

జగ్గాసాగర్ గ్రామం కొండస్వామి ఆలయంతో పాటు అక్కడి చెరువుతో గుర్తింపు పొందింది. ఊరి నడిబొడ్డున చెరువు విస్తరించి ఉండటంతో గతంలో ఈ గ్రామాన్ని జేసంద్రం అని పిలిచేవారు. కాలక్రమేణా జగ్గాసాగర్‌గా మారింది. ఇక్కడ పూర్వకాలం నుంచి కొండస్వామి గుట్టపై శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఏటా బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

**పెద్దాపూర్.. బోనాల వైభవం** పెద్దాపూర్ అంటేనే మల్లన్న క్షేత్రంగా విరాజిల్లుతుంది. చాలా గ్రామాల్లో మల్లన్నస్వామికి బోనాలు వందో, రెండొందలు సమర్పిస్తారు. కాని ఇక్కడి 50 వేల వరకు చెల్లిస్తారు. ఉత్తర తెలంగాణలో అతి పెద్ద బోనాల పండుగగా పేరు పొందింది. కాముడి పౌర?మి మరుసటి ఇక్కడి ఆలయం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల భక్తులతో కిటకిటలాడుతుంది. పెద్దాపూర్ గ్రామం పేరు వినగానే బోనాల పండుగ గుర్తొస్తుంది.

**వాగు మొదలయ్యే ఆత్మకూర్**

చుట్టూ గుట్టలు, పచ్చదనంతో పాటు పెద్దవాగు నీటి ప్రవాహం ఆత్మకూర్‌కు వన్నె తెస్తోంది. గతంలో గుట్టల నుంచి వర్షాకాలంలో వచ్చే నీటితో పెద్దవాగు భారీగా ప్రవహించేది. 1983లో భారీగా వరదలు వచ్చి గ్రామం మునిగిపోయింది. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు ఆత్మకూర్ అంటే పెద్దవాగు ఘటన గుర్తుకొస్తుంది. మండలంలో ఆత్మకూర్ నుంచే పెద్దవాగు ప్రవాహం మొదలవుతుంది.

**బండలింగాపూర్ సంస్థాన ఠీవీ** బండలింగాపూర్ గ్రామం గతంలో సంస్థానంగా వెలుగొందింది. చుట్టుపక్కల పదుల సంఖ్యలో గ్రామాలు దీని పరిధిలో ఉండేవి. ఈ సంస్థానం నుంచే ఆ గ్రామాల పరిపాలన సాగుతుండేది. దీంతో బండలింగాపూర్‌ను సంస్థాన్ బండలింగాపూర్‌గా పిలుస్తారు. సంస్థాన్ బండలింగాపూర్ అంటే పొరుగు మండలాల్లోనూ తెలియని వారుండరు. ఇప్పటికీ సంస్థాన్ కమాన్ అక్కడ మనకు కనిపిస్తుంది.

# పట్టాలు రద్దు.. ఆక్రమణల పద్దు



జగిత్యాల : ప్రభుత్వ భూములే కదా.. ఎవరు చూస్తారులే.. అనుకున్నారేమో! రికార్డుల్లో లొసుగులే ఆసరాగా తమ పేరిట మార్చుకున్నారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులతో అధికారులు పట్టాలు రద్దు చేశారు.. అయినా అక్రమార్కులు ఖాళీ చేయకుండా దర్జాగా అనుభవిస్తున్నారు.. మరోవైపు ప్రభుత్వ అవసరాలకు సర్కారు స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి..

జగిత్యాల గ్రామీణ మండలం నర్సింగాపూర్ శివారులోని 437 సర్వే నంబరులో మొత్తం 378 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ధరణి అందుబాటులోకి వచ్చాక కొందరు అధికారులతో కుమ్మక్కై దాదాపు 90 ఎకరాలకు పైగా తమ పేరుపై మార్చుకున్నారు. ఈ విషయమై గత జనవరిలో మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సర్వే నిర్వహించి అక్రమ పట్టాలు పొందిన వారి వివరాలు సేకరించి దాదాపు ఆరు నెలల కిందట రద్దు చేశారు.

**అక్రమార్కులకు ఆదాయ వనరు**

ఇప్పటికీ కొందరు ప్రభుత్వ భూముల్లోనే ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. మరికొందరు పంటలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు మట్టి తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల తర్వాత అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ భూములకు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నర్సింగాపూర్ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటామని రూరల్ తహసీల్దారు వర్దన్ తెలిపారు.

ఇవీ అవసరాలు

జిల్లా కేంద్రంగా జగిత్యాల ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు అధిక విస్తీర?ంలో భూమి అవసరమైంది. పట్టణంలో బహిరంగ సభ నిర్వహణకు పెద్ద స్థలమే లేదు. ఈ సర్వే నంబరులో 300.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నందున 20 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటు చేస్తే క్రీడలతో పాటు సభలు, సమావేశాల నిర్వహణకు ఉపయోగపడుతుంది.

టీఆర్‌నగర్ నుంచి ప్రభుత్వ భూములను ఆనుకొని నూకపల్లి అర్బన్‌కాలనీ మీదుగా మల్యాల వరకు రెండు వరుసల రహదారి నిర్మిస్తే న్యాక్‌తో పాటు రెండు పడక గదుల ఇళ్లకు ఉపయోగపడనుంది. కొత్తగా స్టేడియం నిర్మించే ప్రాంతానికీ ఈ రహదారి ఉపయోగపడనుంది.

ఇదే ప్రాంతంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గురుకుల పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు నర్సింగాపూర్ భూములను వినియోగించుకోవచ్చు. జిల్లా కేంద్రంలో ఉన్న జైలుకు స్థలం సరిపోవడం లేదు. నర్సింగాపూర్ ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తే సౌకర్యంగా ఉండనుంది. మరిన్ని కార్యాలయాలకు స్థలం అవసరమున్నందున ఈ భూములను ఉపయోగించుకోవచ్చన్న ఆలోచన ఉంది.

కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రెండేళ్లు.. రూ.895.82 కోట్లు



కరీంనగర్ : తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మి పథకం మహిళా ప్రయాణికులకు వరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు 9 నుంచి ఈ పథకం ద్వారా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు, వివిధ ప్రాంతాలకు విధులకు వెళ్లే వారు, ఆసుపత్రులకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడానికి ఆసక్తి చూపుతున్నారు. కోట్లాది మంది ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. రెండేళ్లలో కరీంనగర్ రీజియన్‌లో మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకున్న మహిళలపై కథనం.

**రెండేళ్లు.. 21 కోట్లు..**

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలోని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రీజియన్‌లో రెండేళ్లలో 32.76 కోట్ల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించగా అందులో 21.96 కోట్ల మంది (దాదాపు 65 శాతం) మహిళలు ఉండటం విశేషం. ప్రతి పది మందిలో ఆరుగురు మహిళలే ఉంటున్నారు. రెండేళ్లలో మొత్తం ఆదాయం రూ.1749.53 కోట్లు రాగా, ఇందులో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు రూ.895.82 కోట్లు ఆదా చేసుకున్నారు. 2023-2024తో పోల్చితే 2024-2025లో అదనంగా 1.80 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.86.78 లక్షలు ఆదా చేసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) కూడా గణనీయంగా పెరిగింది.

**పెరిగిన ప్రయాణికుల సంఖ్య**

మహాలక్ష్మి పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందులో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో సర్వీసులు తిరిగేలా చూస్తున్నాం. కొత్త బస్సులు కూడా వచ్చాయి. ఆర్టీసీ, అద్దె, ఎలక్ట్రిక్ బస్సులు రీజియన్ పరిధిలో సేవలందిస్తున్నాయి.

– బి.రాజు, రీజినల్ మేనేజర్

# ఆగని ఇసుక దందా!

జైపూర్: మైనింగ్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని జైపూర్ మండలంలో ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని అధికార వర్గాలు చెబుతున్నా వాటి ఫలితాలు మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అక్రమార్కుల ఆదాయ వేటలో మితిమీరిన వేగానికి అమాయకులు బలైపోతున్నారు. తాజాగా సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. భీమారంనకు చెందిన పోడేటి మల్లయ్య (70) అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు బొలెరో వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్ నర్వ సమీపంలోని జాతీయ రహదారిలోని యూటర్న్ వద్ద ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో



ట్రాక్టర్ రెండు ముక్కలైంది. బొలెరోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలు కాగా వారిని 108 ద్వారా మంచిర్యాలకు తరలించగా మల్లయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**కాసుల వేటలో..**

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పేరు చెప్పి చీటీల పేరుతో అక్రమ రవాణాకు పాల్పడిన పలువురు ట్రాక్టర్ల యజమానులు అధికారులు హడావుడి చేయడంతో కాస్త తగ్గారు. ఇందారం వద్ద ఆన్‌లైన్‌లో ఇసుక లభ్యత ఉన్నా కాసులకు కక్కుర్తి పడి రాత్రి వేళ రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా రవాణా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కార్యాలయాలకు కూతవేటు దూరంతో పాటు జాతీయ రహదారి పక్కనే అక్రమ దందా సాగుతున్నా వాటి కట్టడికి మంత్రి ఇచ్చిన ఆదేశాలు, అధికారులు తీసుకున్న చర్యలకు ఫలితాలు కనిపించడం లేదు.

# అటు కోస్టాల.. ఇటు తల్లాడ

తల్లాడ : పల్లెల్లో ఎటుచూసినా పంచాయతీ ఎన్నికల కోలాహలమే కనిపిస్తోంది. మొదటి విడత పోలింగ్‌కూ రోజు వ్యవధే ఉంది. ఎక్కడ చూసినా అభ్యర్థులు కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. కొంతమంది ఇప్పటికే పంచాయతీ అంతటినీ మూడు నాలుగుసార్లు సులువుగా చుట్టేయగా, కొన్ని పంచాయతీల్లో మాత్రం ఆపసోపాలు పడుతున్నారు. ఓటర్లు, విస్తీర్ణం, వార్డుల సంఖ్యలో వ్యత్యాసం ఉండటమే ఇందుకు కారణం. చిన్న ఊళ్లలో సర్పంచి అభ్యర్థులకు ప్రచారం నల్లేరుమీద నడకలా మారింది. జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గరిష‘-కనిష‘ వివరాలతో కూడిన కథనమిది.

ఓటర్లుల్లాలో అతి తక్కువ మంది ఓటర్లు ఉన్న గ్రామం వైరా మండలంలోని కోస్టాల. ఇక్కడ 254 మంది ఓటర్లున్నారు. పంచాయతీలో మొత్తం ఎనిమిది వార్డులుండగా రెండో వార్డులో అతి తక్కువగా 27 మందికి ఓటుహక్కు కలదు.

అత్యధిక ఓటర్లున్న గ్రామ పంచాయతీ తల్లాడ. ఇక్కడ ఓట్ల సంఖ్య 7,898. మొత్తం 14 వార్డుల్లో ఏడో వార్డులో తక్కువగా 543 ఓట్లు, 11వ వార్డులో గరిష‘ంగా 575 ఓట్లు ఉన్నాయి.

ఇక్కడా ఇరుగు పొరుగే..మహిళా ఓటర్లు తక్కువగా ఉన్న పంచాయతీ వైరా మండలంలోని కోస్టాల (130 మంది) కాగా ఎక్కువగా తల్లాడలో (4,198) ఉన్నారు. పురుష ఓటర్ల విషయంలోనూ కోస్టాల (124), తల్లాడ (3,700)లే కనిష‘, గరిష‘ సంఖ్యను సొంతం చేసుకున్నాయి. వార్డులు జిల్లాలోని పంచాయతీల్లో కనిష‘ వార్డుల సంఖ్య ఆరు. ఇలాంటి పరిస్థితి 17 పంచాయతీల్లో ఉంది. ఇందులో ఒక్క రఘునాథపాలెం మండలంలోనే ఎనిమిది ఉండటం విశేషం. 500 జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా మార్చిన క్రమంలో దీనికి ఈ ప్రత్యేకత సొంతమైంది. పంచాయతీల్లో గరిష‘ వార్డుల సంఖ్య 14. కొణిజర్ల, తనికెళ్ల, ముదిగొండ, వల్లభి, నేలకొండపల్లి, తల్లాడ, అన్నారుగూడెం, వేంసూరు మండలం కందుకూరు గ్రామాల్లో మాత్రమే ఈ సంఖ్యలో వార్డులు ఉన్నాయి.

పంచాయతీలు

తక్కువ ఖమ్మం గ్రామీణం, సత్తుపల్లి

జిల్లాలో తక్కువ పంచాయతీలున్న మండలాలు ఖమ్మం గ్రామీణం, సత్తుపల్లి. ఇక్కడ కేవలం 21 ఉన్నాయి. కూసుమంచి, కారేపల్లి మండలాల్లో అత్యధికంగా 41 చొప్పున పంచాయతీలున్నాయి.

రెండూ పక్కపక్కనే అతి తక్కువ గ్రామ పంచాయతీలు కలిగిన నియోజకవర్గం ఖమ్మం. ఇందులో గ్రామీణ ప్రాంతం రఘునాథపాలెం మండలం ఒక్కటే ఉండగా.. 37 పంచాయతీలున్నాయి. పక్కనే ఉన్న పాలేరు నియోజకవర్గంలో జిల్లాలోనే గరిష‘ంగా 134 పంచాయతీలు ఉండటం విశేషం.

# ఈసారైనా.. లక్ష్యం నెరవేరేనా?

కొత్తగూడెం : ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రి జిల్లా బ్యాంకర్లు.. రుణాల మంజూరులో వెనుకబడుతున్నారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక చట్టాలు, భూముల మార్టిగేజ్ సమస్యలు రైతులకు అడుగడుగునా అడ్డంకిగా మారుతున్నాయి. పంటల పెట్టుబడి కోసం బ్యాంకులకు వెళ్తున్న కర్షకులకు రుణ నిరాకరణ తీరని ఆర్థికభారాన్ని మిగుల్చుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే అత్యధికంగా పోడుపట్టాలు పంపిణీ చేసిన భద్రాద్రి జిల్లాలో బ్యాంకర్లు వాటికి రుణాలు అందించకపోవటం గమనార్హం. ఎస్‌బీఐ మినహా మిగతా బ్యాంకులు పోడుపట్టాలకు రుణాలు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది.

భద్రాద్రి జిల్లాలో..

వ్యవసాయ అనుబంధ రంగాలకు ఆశించిన స్థాయిలో రుణాలు అందటం లేదు. 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో పంట రుణాల కింద రూ.3,954.61కోట్లు కేటాయించగా రూ.3,245.82కోట్లు(82శాతం) మాత్రమే రైతులకు అందించగలిగారు. 2025-26 వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.3,899.28కోట్లు కేటాయించగా తొలి త్రైమాసికం ముగిసే నాటికి రూ.2,138.26కోట్లు(54.84శాతం) మాత్రమే రైతులకు మంజూరు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరమైనా లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తేనే కర్షకులకు మేలు జరుగుతుంది.

స్వయం ఉపాధికి ఊతమిస్తేనే..

భద్రాద్రి జిల్లాలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి మార్గాలు చూపేలా రుణాలు మంజూరుచేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో బ్యాంకర్లకు సూచించారు. సమీకృత వ్యవసాయం, కొర్రమీను చేపల పెంపకం యూనిట్ల స్థాపనకు రుణాలు అందించాలన్నారు. చిన్నచిన్న కారణాలతో రైతుల దరఖాస్తులను తిరస్కరించకుండా జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా అప్పులు ఇవ్వాలన్నారు. తద్వారా బ్యాంకర్లు సైతం రుణ లక్ష్యాలను అధిగమిస్తారని తెలిపారు.

## అడగాలా.. మళ్లీ మళ్లీ రావాలా

భీమవరం : అర్జీల పరిష్కారంపై కలెక్టర్, జేసీ తరచు సమావేశాలు నిర్వహించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. అయినా..క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు.. ఉద్యోగులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎంత చెబుతున్నా పూర్తిస్థాయిలో ఫలితాలు రావడం లేదు.

ఆరో స్థానం.. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో జిల్లా ఆరో స్థానంలో ఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సదస్సులో జిల్లాల వారీగా గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్,



జేసీ పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు.

ఈ ఏడాది మార్చి 1 నుంచి నవంబరు 30 వరకు జిల్లాలో 17,753 అర్జీలు పరిష్కరించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 4061 పెండింగ్‌లో ఉండిపోయాయి. రెవెన్యూ శాఖలో ఎక్కువ ఉన్నట్లు కలెక్టర్ గుర్తించి పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.

మా ప్రాంతంలో రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికే అనేక సార్లు ఫిర్యాదు చేశా. 15న జరిగిన పీజీఆర్ఎస్‌లోనూ మరోమారు అర్జీ ఇచ్చా.

వెంకటబాలాజీ, పెదఅమిరం

మా గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. దీని గురించి చాలా కాలంగా స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. తాజాగా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశా. అదే సమయంలో కలుషిత నీరు తాగి గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారు.

వి.నాగరాజు, తోకతిప్ప

## చూపిస్తారు బొమ్మ

భీమవరం : ప్రతి పండగను, సందర్భాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం 'నూతన సంవత్సర శుభాకాంక్షల' పేరుతో ఉచ్చుదంతా దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు, ఫోన్లలో ఉన్న వ్యక్తిగత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచే ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం సహజం. ఈ క్రమంలో సాధారణంగా కాకుండా రకరకాల చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకుని పంపొచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని సెల్‌ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. పొరపాటున వాటిని క్లిక్ చేశారంటే తిప్పలు తప్పవు. హ్యాపీ న్యూఇయర్ అంటూ వచ్చే



ఫేక్ మెసేజ్‌లలో దాట ఏపీకే పదం కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొత్త నంబర్లతో వచ్చిన ఫొటోలు, వీడియోలను తెరవొద్దని చెబుతున్నారు. అందులోని బైనరీ కోడ్ ఆధారంగా మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. దాంతో బ్యాంకు ఖాతా మొదలుకొని వ్యక్తిగత సమాచారం వరకు హ్యాక్ చేసే కొత్త ట్రిక్కులతో సైబర్ నేరగాళ్లు ముందుకు రాబోతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని చేదు జ్ఞాపకాలతో ప్రారంభించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నూతన ఏడాదిలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

## పాఠశాలకు ఒక అధికారి..!

సోంపేట : పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని రోజూ పర్యవేక్షించేలా ప్రత్యేకాధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది. బోధన, సాధన, పరీక్షలు, ఇతర అంశాలను పరిశీలించి మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నారు.

**రోజూ తనిఖీలు**

జిల్లాలో 414 ఉన్నత పాఠశాలల్లో 21,343 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, ఇతర శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులను, మండల ప్రత్యేకాధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాలలను కేటాయించారు. హెచ్ఎం, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో, సమగ్ర శిక్షా అధికారులను సమన్వయం చేసుకుంటూ 100 రోజుల ప్రణాళిక మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు.

ప్రధానంగా రోజూ నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు సాధిస్తున్న మార్కులు ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయించడం, సబ్జెక్టు వారీగా సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలి.

రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉపాధ్యాయులతో చర్చిస్తారు. ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలు పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడతారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా పర్యవేక్షించడానికి, సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులను నియమించినట్లు డీఈవో ఎ.రవిబాబు తెలిపారు.

# అల్లుకున్న అవినీతి తీగలు



నంద్యాల : ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నట్లు గత వైకాపా సర్కారులో ఆర్భాటం చేశారు. గుట్టలు.. కొండలు.. బంజరు పొలాల్లో కాలనీలు నిర్మించారు.. అక్కడ ఒక్క లబ్ధిదారుడు కూడా ఇల్లు నిర్మించకున్నా విద్యుత్తు సౌకర్యం పేరుతో రూ.కోట్లు వెచ్చించారు. ఓ గుత్తేదారు సంస్థకు లబ్ధి చేకూర్చే క్రమంలో 'వెలుగుల'మాటున అక్రమాలకు పాల్పడ్డారు. చేసిన పనులు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. విలువైన సామగ్రిపై కన్నేసిన దొంగలు ఎక్కడికక్కడ ఎత్తుకెళ్తున్నారు.

గడివేముల: గడివేములలో 450 మందికి ఇళ్లపట్టాలిచ్చారు. ఇప్పటి వరకు కేవలం 10 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కొందరు పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. ఈ కాలనీలో విద్యుత్తు సౌకర్యం కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు.

**కన్నేసిన దొంగలు**

బండిఆత్మకూరులోని కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కనీసం బేస్‌మెంట్లు పడకున్నా.. విద్యుత్తు, నియంత్రికలు, స్తంభాలు, తీగలు, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇక్కడ కంపచెట్లు తప్ప ఏమీ లేవు. ప్రస్తుతం కేవలం నాలుగు గృహాలు మాత్రమే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని పలు జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు, పరికరాలు, వస్తువులు చోరీకి గురయ్యాయి. కాలనీల్లో నిర్మాణాలు జరగకపోవడంతో చాలాచోట్ల విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదు. ఇదే అదనుగా దొంగలు వీటిని అపహరించారు.

**ఇలా వినియోగిస్తే బాగు**


ఉమ్మడి జిల్లాలో గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు రూ.1,200 కోట్లతో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు చేపట్టారు. గుత్తేదారు సంస్థ నిర్వాకంతో ఇవి ఆగిపోయాయి. పనుల్లో భాగంగా త్రీఫేజ్ విద్యుత్తు నియంత్రికలు అవసరమవుతాయి. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో వృథాగా ఉన్న నియంత్రికలను ఆర్‌డీఎస్ఎస్‌కు వినియోగిస్తే ఎలా ఉంటుందన్న చర్చ.. ఆరు నెలల కిందట జరిగింది.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ సెక్షన్ల పరిధిలో నూతన సర్వీసులు, ఇప్పటికే ఉన్నవాటిపై అదనపు లోడు కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటి గడువు డిసెంబరు 31వ తేదీ నాటికి ముగియనుంది. ఇప్పటికీ ఏ నిర్ణయం తీసుకోలేదు.

**రూ.450 కోట్ల వరకు ఖర్చు**

ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో విద్యుదీకరణ పేరుతో రూ.450 కోట్లకు పైగా ఖర్చు చేశారు. లబ్ధిదారులు పునాదులు కూడా నిర్మించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 716 కాలనీలకు సంబంధించి 10,125 విద్యుత్తు సర్వీసులు ఇచ్చేశారు. నంద్యాలలో 9432 ఇక్కడ 3,615, కర్నూలులో 19,121 గృహాలకు 9,104 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో కాలనీలో 100 కేవీ నియంత్రికలు ఐదు వరకు అమర్చారు. ఒక్కోదానికి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. తీగలకు ప్రతి కి.మీ. సుమారు రూ.80 వేల వరకు ఖర్చు పెట్టారు. ఒక్కో స్తంభానికి రూ.4 వేలు వెచ్చించారు. నియంత్రికలు, ఇతర సామగ్రి తదితరాలన్నీ కలిపి ప్రతి కి.మీ.కు సరాసరిన రూ.2.50 లక్షలు ఖర్చవుతుంది. ఇంత చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికే కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. నియంత్రికలు అలంకారప్రాయంగా మారాయి.

# పగలూ చలేస్తోంది



అనకాపల్లి : ఈ ఏడాది జిల్లాలో చలితీవ్రత పెరిగింది. మైదాన ప్రాంతాల్లోనూ మన్యాన్ని తలపించే విధంగా చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 10 దాటినా చలి తీవ్రత తగ్గడంలేదు. సాయంకాలం 5 గంటల నుంచి మంచు కమ్మేస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు రెండు, మూడు సెల్సియస్ డిగ్రీలు తక్కువగా ఉన్నట్లు వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా చలికాలంలో పగటి అత్యధిక ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల వరకు ఉంటాయి. ఈసారి 30లోపే ఉన్నాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నా ముఖ్యంగా వర్షాలు అధికంగా కురవడం, ఉత్తర భారతదేశం నుంచి చల్లటి పవనాలు వీయడం వలనే ఉష్ణోగ్రతలు తగ్గాయని వాతావరణ శాస్త్రవేత్త గౌరి తెలిపారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చలి పెరగడం వల్ల ముఖ్యంగా కూరగాయలు, జీడి, మామిడి పంటలకు ఎక్కువగా నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి రహీం తెలిపారు. ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల పూత రావడం ఆలస్యం అవుతుందని తెలిపారు. పూత, లేత చిగురు ఆకు మాడిపోతాయని, ముదురు ఆకులు గిడసబారతాయని తెలిపారు. దీనివల్ల దిగుబడులు 15 నుంచి 20 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. జిల్లాలో జూన్ నుంచి డిసెంబరు వరకు సాధారణ వర్షపాతం 1,004 మిల్లీమీటర్లు కాగా ఈ ఏడాది 1,126 కురిసింది. మొత్తం 89 రోజులు వర్షం పడింది. గత ఏడాది 1,070 మిల్లీమీటర్లు కురిసింది. ఈఏడాది తుపానులు ఎక్కువగానే వచ్చాయి. వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భ జలాలు బాగున్నాయి. దీంతో తేమ వాతావరణం ఏర్పడటంతో చలి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలిలో తేమ శాతం ఎక్కువగానే ఉంటుంది. శాతం కాగా అత్యల్పం 47 శాతంగా ఉంది.

# అక్షరమే ఆయుధమై.. అభివృద్ధికి ఆయువై..



భీమవరం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సామాన్యుడి పక్షాన నిలుస్తూ కలం కదిలించింది. నిత్య జీవితంలో ఎదుర్కొనే ఇబ్బందులను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటికి మోక్షం కల్పించింది. బాధితులే నేరుగా అధికారులకు ఫోన్ చేసి సమస్యలు చెప్పుకొనేలా ఫోన్‌ఇన్ కార్యక్రమాలు, కాలనీల్లోని బాధలను స్వయంగా పరిశీలించి పర్యవేక్షించేలా వాకిలిత్ కమిషనర్.. మేమున్నాం.. మీకు తోడు ద్వారా వారధిగా నిలిచింది.

**తలుపులేచ్చాయి**

యలమంచిలి మండలం వడ్డిలంకలో నక్కల డ్రెయిన్‌పై అవుట్‌ఫాల్ స్లూయిజ్ తలుపులు 20 ఏళ్లుగా పనిచేయక ఏటా వరదల సమయంలో 25 వేల ఎకరాలు నీట మునిగి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయేవారు. దీనిపై వరుస కథనాలు రాగా మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించి రూ.45 లక్షలతో కొత్త తలుపులు ఏర్పాటు చేయించారు.

వీధులకు వెలుగులు.. తణుకు పురపాలక సంఘం పరిధిలో ప్రధాన దారులు, పట్టణ వీధులు, కాలనీల్లో దీపాలు వెలగక పడుతున్న ఇబ్బందులను అన్నీ ఇన్నీ కావు. దీనిపై వరుస కథనాలు ఇవ్వగా 225 వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేశారు.

జలాశయం పనులు మొదలు: తాడేపల్లిగూడెంలోని కుంచనపల్లిలో రెండో వేసవి జలాశయం రెండు దశాబ్దాలుగా కొలిక్కి రాలేదు. ఇది పూర్తయితే 26 ప్రాంతాలకు నీరు అందుతుంది. సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వరుస కథనాలు ఇవ్వగా ఆయన చొరవతో అమృత్ 2.0లో 54.93 ఎకరాలలో రూ.73.43 కోట్లతో చెరువు పని మొదలైంది.

రహదారులకు మోక్షం.. పర్యాటకులకు ఉపయోగపడే ముత్యాలపల్లి-పేరుపాలెం రహదారి నిర్మాణం రెండేళ్లుగా ఆగింది. దీనిపై కథనాలివ్వగా రూ.28 కోట్లతో పనులు పూర్తి చేశారు. చించినాడ-లోసరి రహదారికి రూ.20 లక్షలతో మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. భీమవరంలో గుంతల రహదారుల సమస్యను ఎమ్మెల్యే పులపర్తి దృష్టికి తీసుకెళ్లగా మున్సిపాలిటీ నిధులు మంజూరు చేశారు. శ్రీరామపురం (ఆక్వాలపాలెం రోడ్డు నుంచి బలుసుమూడి వరకు), లోసరి-గుట్టపాడు మార్గాలను రూ.2.70 కోట్లతో సీసీ రోడ్లుగా మార్చారు. రూ.9.89 లక్షల ఆదాయం.. మొగల్తూరులో దేవస్థానం భూములు 16.75 ఎకరాలు ముంపు కారణంగా పదేళ్లుగా సాగుకు దూరమయ్యాయి. చేపల చెరువులుగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినా ఆమోదం రాలేదు. ఉపసభాపతి రఘురామ దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి వేలం నిర్వహించడంతో రూ.9.89 లక్షల ఆదాయం సమకూరింది.

## భల్లోకగిరి.. అక్రమార్కులకు సిరి

మందస : మందస మండలం పిడిమందస రెవెన్యూ పరిధిలోని 100 ఎకరాల భల్లోకగిరి కొండపై అక్రమార్కుల కన్ను పడింది. కొన్ని నెలల నుంచి కొండకు తూర్పు, దక్షిణ భాగాల్లో నల్లరాయి క్వారీల్లో అనుమతికి మించి రాళ్లు పేల్చి క్రషర్లకు తరలిస్తున్నారు. పశ్చిమ, ఉత్తర భాగాల్లో ఉన్న కంకర నిల్వలను ఎలాంటి అనుమతులు లేకుండా కొల్లగొడుతున్నారు. రాత్రి వేళ టిప్పర్లలో తరలిస్తున్నారు.

**రాత్రి వేళ తరలింపు..:** బహాడపల్లి సమీపంలో ప్రైవేటు వెంచరుకు ఇటీవల వందల టిప్పర్ల కంకర తరలించారు. పలాస, సోంపేట మండలాల్లో ప్రైవేటు అభివృద్ధి పనులకు రవాణా చేస్తున్నారు. వారం రోజుల నుంచి రాత్రివేళ తరలిస్తున్నారని తెలిసి గ్రామస్థులు ఇటీవల



అడ్డుకుని అక్రమార్కులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మధ్యలో ఒక రోజు రాత్రి ఆపి మళ్లీ కొనసాగిస్తున్నారు.

**వారే అని తెలిసినా..:** వైకాపా మండలస్థాయి నాయకుల కనుసన్నల్లోనే అక్రమ దందా జరుగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'పిడిమందస దరి కొండలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులపై కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామని' గనులశాఖ టెక్కలి ఏడీ విజయలక్ష్మి తెలిపారు.

## ప్రయోగం.. ఓ బ్రహ్మ పదార్థం

ఓబులవారిపల్లె : విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది ఇంటర్ విద్యే. భవిష్యత్తు లక్ష్య సాధనకు బాటలు పడేది ఇక్కడే. అందుకే ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడుతుంటారు. చాలా కళాశాలల్లో ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొన్ని ప్రభుత్వ, కస్తూర్బా విద్యాలయాల్లో ప్రయోగశాలలే లేవు. ఈ కారణంతో థియరీలో మంచి మార్కులు తెచ్చుకున్నా ప్రయోగాల్లో వెనుకబడుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఒకేషనల్, ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు జనరల్(ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులు కలవర పరుస్తున్నాయి.



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో ప్రయోగశాలలు లేవు. వీరు ప్రయోగాలు చేసేందుకు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రభావం ఇంటర్ ఫలితాలతో పాటు ప్రవేశాల పైనా పడుతోందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ఆదర్శ, కేజీబీవీ, రెసిడెన్షియల్, ప్రైవేట్ కళాశాలలోని 67 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.

బైపీసీ, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,173 మంది హాజరు కానున్నారు. ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిసి 1,354 మంది చదువుతున్నారు.

## అక్రమాల తాకిడికి... ఆదాయం గాలికి

అమరావతి: అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి... ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయి.. అయినా గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో అక్రమార్కులు కొత్తదారులు ఎంచుకుంటున్నారు. దీనికో ఉదాహరణ ప్రకటనల బోర్డుల ఏర్పాటులో మాయాజాలం. అధికారిక లెక్కల ప్రకారం 42 ప్రకటనల ఏజెన్సీలున్నాయి. అనధికా రికంగా రెట్టింపు ఉన్నాయి. సుమారు 1,400 డిస్‌ప్లే బోర్డులు ఉన్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అంతకుమించి ఉన్న విషయం బహిరంగ రహస్యమే. నగరంలో డిస్‌ప్లే, గ్యాంట్రీ.. ఇలా ఏ తరహా బోర్డులు ఏర్పాటు చేయాలన్నా జీఎంసీ అనుమతి తప్పనిసరి. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లించాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇదే సమస్య.. ఒకదానికి అనుమతి పొంది ఆ పేరుతో రెండుమూడు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కొందరైతే అసలేమాత్రం అనుమతులులేకుండానే రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి పని కానిచ్చేస్తున్నారు. వారు రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నా.. కార్పొరేషన్‌కు మొండిచేయి చూపుతున్నారు. మరోవైపు అనుమతులు తీసుకున్న ఏజెన్సీలు ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించడం లేదు. అవి రూ.కోట్లలో పేరుకుపోయాయి. దీనిపై కౌన్సిల్ సమావేశాల్లో



చర్చ జరుగుతున్నా.. అధికారులు మిన్నకుండిపోతున్నారు. 2024-25లో కొత్తగా బోర్డులు నెలకొల్పడానికి అనుమతులివ్వలేదని మూడు నెలల క్రితం అధికారికంగానే ప్రకటించారు. కానీ.. డిస్‌ప్లే డివైజ్ ఫీజు కింద అరియర్స్‌తో కలిపి రూ.15.18 కోట్ల డిమాండ్‌కుగాను రూ.10.20 కోట్లు వసూలు చేసినట్లు చూపించారు. ఇంకా రూ.5 కోట్ల మేర బకాయిలున్నట్లు గత కౌన్సిల్‌లో ప్రస్తావించారు. ఒక సంస్థ రూ.3.77 లక్షలు, మరో సంస్థ రూ.27 లక్షల బకాయి ఉన్నట్లు తాజా కౌన్సిల్ సమావేశంలో లెక్కలు చూపించారు. పేర్లు మార్చి.. ఏమార్చి.. బకాయిలు ఎగ్గొట్టడానికి కొంతమంది గుత్తేదారులు తమ సంస్థల పేర్లు మార్చేసి కొత్తగా దరఖాస్తు చేస్తున్నారు. అధికారులు దీన్ని పట్టించుకోకుండా ఆమోదిస్తున్నారు. మరికొంతమందైతే కాసులకు కక్కుర్తి పడి అక్రమార్కులకు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన నిబంధనలను ఇక్కడ ఏమేరకు అమలు చేస్తారన్నది ప్రశ్న. కూలే స్థితిలో... నగరంలో చాలా బోర్డులకు స్ట్రక్చర్ స్టెబిలిటీ లేదు. ఏ బోర్డు కూలుతుందో.. ఎవరి నెత్తిన పడుతుందో తెలియని పరిస్థితి.

## క్షీరపురి.. ఉద్యాన సిరి!

పాలకొల్లు : ఆధ్యాత్మిక, వాణిజ్య కేంద్రంగా వెలుగొందుతున్న క్షీరపురి ఉద్యాన శోభ సంతరించుకొంది. పట్టణంలో ఉద్యానాలు లేని లోటు ఎన్నో దశాబ్దాల తర్వాత నెరవేరుతోంది. రెండు పార్కులను ఒకే సమయంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా వచ్చే సంక్రాంతి నాటికి వీటిని ప్రారంభించేలా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రూ.10 కోట్ల వ్యయం.. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో రెండు పార్కులను అభివృద్ధి చేశారు. ఆహ్లాదంతో పాటు పిల్లల ఆటపాటలకు, పెద్దలు వ్యాయామం చేసుకోవడానికి అనువుగా వీటిలో పరికరాలు ఏర్పాటు చేశారు. రెండు చోట్లా టేనీరు, ఇతర ఆరోగ్యకర ఆహారాలు



విక్రయించేందుకు దుకాణ సముదాయాలు నిర్మించారు.
పాలకొల్లు బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉన్న రామగుండం పార్కు ఇది. అందమైన మొక్కలు, ఆకట్టుకొనే ఆకృతులతో ఆహ్లాదకర వాతావరణం అందించేలా దీనిని తీర్చిదిద్దారు. నేటి తరానికి మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా పలు కళాకృతులను ఏర్పాటు చేశారు. రూ.లక్షల విలువ చేసే మొక్కలను కడియం నర్సరీలు, పూణె వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పార్కుల్లో నాటించారు.

## ఇదీ అసలు లోగుట్టు

ఆకివీడు : అనుకున్నది ఒక్కటి.. అయిందొక్కటి. ఆకివీడు నడిబొడ్డున అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దొరగారి చెరువులో మట్టి తవ్వకం పనుల తీరు చూస్తే తెలుస్తోంది. పట్టణ జనాభాకు తగ్గట్టు తాగునీరు సరఫరా చేయడానికి దీన్ని అభివృద్ధి చేయాలని భావించారు. ఈ పనులు అధికారులు చేపట్టకుండా.. ఒక ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. అతను చెరువులో సుమారు 15 అడుగుల లోతున మట్టిని తవ్వేసి ట్రాక్టర్లతో బయటకు తరలించేశారని స్థానిక నాయకులు ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. పనులు చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.
చెరువును లోతుగా తవ్వేయడంతో బలమైన గట్టు జారిపోతోంది. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు గట్టును ఆనుకుని కొత్తగా మరొకటి వేస్తున్నారు. ఇష్టానుసారంగా చేస్తున్న పనుల వల్ల గతేడాది



రూ.35 లక్షలతో పచ్చదనం.. సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో చెరువు చుట్టూ అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, సిమెంటు కట్టడాలు, జనప మెస్ ధ్వంసం అయ్యాయి. ఇప్పటికే ఆక్రమణకు గురై కొంత చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. ఇప్పుడు గట్టు వెడల్పు, నీటి సామర్థ్యం కూడా తగ్గిపోనుంది.


**మరో మార్గం లేదు..**

– విజయ్, డీఈ, ప్రజారోగ్య, భీమవరం

చెరువును లోతు పెట్టేశారు. అందులో నీరు నింపితే పాత గట్టు జారిపోతుంది. లోతు 8 అడుగుల లోపే ఉండాలని సూచించాం. ఆ మేరకు పనులు పూర్తయితే విస్తీర్ణం రెండు ఎకరాలలోపే ఉంటుంది. ఆక్రమణల విషయం నగర పంచాయతీ అధికారులు చూడాలి.

## మోగనున్న చరవాణులు

అర్ధవీడు: చరవాణి సిగ్నల్ సమస్యకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో సంపూర్ణంగా సెల్‌ఫోన్ నెట్‌వర్కును అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం 38 మండలాల పరిధిలో కొత్తగా 54 సెల్ టవర్ల నిర్మాణం చేపట్టనుంది. డిజిటల్ భారత్ నిధి పథకంలో భాగంగా కేంద్రం ఈ ఖర్చును భరించనుండగా..స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం కింద ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలు జియో, ఎయిర్‌టెల్ టవర్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు.



మారుమూల ప్రాంతాల్లో సిగ్నళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పల్లెల్లో 4జీ నెట్‌వర్క్ కల్పించనున్నారు. సెల్‌ఫోన్ల సంఖ్య పెరగడంతో ఇప్పటికే ఉన్న టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. అలాంటి ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటవీ ఏజెన్సీ ప్రాంతాలతో పాటు తరచూ సిగ్నల్ సమస్య ఎదురయ్యే మారుమూల పల్లెల్లోనూ టవర్లను నెలకొల్పుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు, బేస్తవారపేట లోయ, గిద్దలూరు మండలాలతో పాటు, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు, పెద్దదోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోనూ టవర్ల సామర్థ్యం సరిపోక చరవాణులు పనిచేయవు. ఇక్కడి అటవీ ప్రాంతాల్లో ఉండే పల్లెల్లోనూ సిగ్నల్ సమస్య ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలాలు గుర్తించారు. వీటి నిర్మాణ పనుల సైతం ఆయా సంస్థలకు అప్పగించడంతో..కొత్త ఏడాదిలో పనులు వేగవంతం కానున్నాయి.

# సాకారానికి శ్రీకారం



ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావాసులకు ప్రయోజనం కలిగే పలు అభివృద్ధి ప్రాజెక్టులు 2025లో పట్టాలెక్కగా మరికొన్ని తుదిదశలో ఉన్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజానీకానికి మేలు చేసే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం, రెండు జిల్లాల యంత్రాంగం ఈ ఏడాది శ్రీకారం చుట్టింది. లక్ష్యం మేర జరిగేలా తీసుకున్న చర్యలతో ఇప్పటికే పలు పనులు పూర్తి కాగా మరికొన్ని త్వరలో కొలిక్కి రానున్నాయి. వీటిల్లో ప్రధానమైనవి. **నిర్వాసితులకు అండగా...**
పోలవరం నిర్వాసితులకు ఒక్క ఈ ఏడాదే రూ.1900 కోట్లు నష్టపరిహారం, ప్యాకేజీ సొమ్ములు విడుదల చేసి ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. పునరావాస కాలనీల్లో పనులను వేగవంతం చేసింది. 79కి 49 కాలనీల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన కాలనీల్లో పనుల నిర్వహణకు ఈ ఏడాది నవంబరులో రూ.739 కోట్లతో టెండర్లు పిలిచారు. ప్రాజెక్టు పనులు ఈ ఏడాది వేగవంతమయ్యాయి. ఇప్పటికే 88 శాతానికి పైగా పూర్తి చేసి 2027 డిసెంబరు నాటికి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో రేయింబవళ్లు పనులు జరుగుతున్నాయి.

**తుది దశలో సర్వే**

దశాబ్దాల నాటి కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటానికి ఈ ఏడాది జూన్‌లో సాధికార కమిటీ పర్యటించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంది. ఇప్పటికే సరిహద్దుల నిర్ధారణకు వీలుగా రెండు జిల్లాల పరిధిలో సర్వే చురుగ్గా సాగుతోంది. రెండు జిల్లాల పరిధిలో ఉప్పుటేరు చుట్టూ ఆక్రమణలు తిష్ట వేయగా వాటిని కొంతమేర తొలగించి కొల్లేరు నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్లేలా కాలువల ఆధునికీకరణ పనులు చేశారు.

**అడ్డుతొలగిన ఆటంకాలు**ఖమ్మం–దేవరపల్లి, జీలుగుమిల్లి–పోలవరం, కైకలూరు–ఆకివీడు–భీమవరం మధ్య జాతీయ రహదారుల నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసులను యంత్రాంగం పరిష్కరించి పనులను వేగవంతం చేశాయి. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వరకు రహదారి విస్తరణకు రూ.99 కోట్లు మంజూరయ్యాయి.

**ఇన్నాళ్లకు దారిన పడింది** గుంతల రోడ్ల పునరుద్ధరణ, నూతన రహదారుల కోసం ఒక్క ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఈ ఏడాది రూ.250 కోట్లు వెచ్చించారు. సంక్రాంతి కల్లా మరికొన్ని రహదారులకు మరమ్మతులు చేయాలని ఏలూరు జిల్లాకు రూ.23.10 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.32.33 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో వెయ్యి కి.మీ పరిధిలో గుంతలు పూడ్చారు.

# అలా మారాయి!



కందుకూరు : 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో ప్రకాశం జిల్లా 14,322 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా నిలిచింది. తాజాగా కూటమి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనలో ఆరు నియోజకవర్గాలతో ప్రకాశం జిల్లా, మరో నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఆవిర్భవించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 39 మండలాలుండగా తాజాగా 28 మండలాలకు పరిమితం కానుంది. రెవెన్యూ డివిజన్ల వారీగా ఒంగోలు- 11, కందుకూరు–7తోపాటు కొత్తగా ఏర్పాటైన అద్దంకి–10 మండలాలు ఉండనున్నాయి. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు తిరిగి ప్రకాశంలోకి రానున్నాయి.

**1970లో ఒంగోలు... 1972లో ప్రకాశం**

గుంటూరు జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, చీరాల, నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కనిగిరి, దర్శి, పొదిలి, కర్నూలు జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు తాలుకాలతో 1970 ఫిబ్రవరి 2వ తేదీన ఒంగోలు జిల్లాగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1972లో జిల్లాకు టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లాగా నామ కరణం చేశారు. జిల్లా ఏర్పడిన తొలి రోజుల్లో 4 లక్షల కుటుంబాలుండగా, 19,19,995 మంది జనాభా ఉన్నారు. 2011 జనాభా గణన ప్రకారం జిల్లాలో 8,60,463 కుటుంబాలుండగా, 33,97,448 మంది జనాభా ఉన్నారు. 2021లో మరో విడత జన గణన జరగాల్సి ఉండగా కొవిడ్ దృష్ట్యా వాయిదా పడింది.

**రామాయపట్నం ఓడరేవుతో...**

కందుకూరు నియోజకవర్గం కలయికతో జిల్లాలోకి పరిశ్రమలు రానున్నాయి. గుడ్లూరు మండలం రామాయపట్నం ఓడరేవు సుమారు రూ.3,500 కోట్లతో నిర్మాణమవుతోంది. ఇప్పటికే ఓడరేవు మొదటి బెర్తు పూర్తికాగా, మరో మూడు బెర్తులు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. దీంతోపాటు సుమారు రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీపీసీఎల్ పరిశ్రమ కూడా రానుంది. చేవూరు వద్ద సౌరఫలకల పరిశ్రమ (ఇండోసోల్) ఉత్పత్తిని ప్రారంభించింది. ఇవి పూర్తయితే 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 5 మండలాల పరిధిలో 50 కిలోమీటర్ల మేర విశాలమైన సముద్ర తీరం ఉంది. కొత్తపట్నం, సింగరాయ కొండ మండలం పాకల బీచ్‌లు ఉన్నాయి. కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు మండలాల పరిధిలోని తీర ప్రాంతాల కలయికతో మరో 12 కిలోమీటర్ల విస్తీర్ణం పెరగనుంది. రాళ్లపాడు రిజర్వాయర్, మోపాడు, పీబీ ఆయకట్టు, వీఆర్ కోట తదితర మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కింద 44,257 ఎకరాల సాగు చేస్తున్నారు. రాళ్లపాడు రిజర్వాయర్, వీఆర్ కోట సప్లయ్ ఛానల్ ఆయకట్టు తిరిగి ప్రకాశం జిల్లాలోకి రానుంది.

# మార్కాపురం సాకారం

ఒంగోలు : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మార్కాపురం జిల్లా ఎట్టకేలకు ఆవిష్కృతమైంది. బుధవారం నుంచే కొత్త పాలనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో కొత్త ఏడాది సంబరాలు పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ముందే ప్రారంభమైనట్లయింది. తమ కల నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉందని ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. కొత్త జిల్లా పాలన జనవరి 1వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకురావాలని భావించగా, ఒక రోజు ముందే పాలన ప్రారంభించేవిధంగా మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుబంధంగా మార్కాపురం శివారు తర్లుపాడు రోడ్డులోని పునరావాస కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వెలిగొండ ముంపు బాధితుల కోసం ఇక్కడ పునరావాస కాలనీని నిర్మించారు. ఇక్కడ ప్రాంగణంలో మూడు భవనాలుండగా, 24 వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, సర్వే, పౌరసరఫరాలు, సీపీవో, పౌరసంబంధాల తదితరాలు తప్పనిసరి ఏర్పాటు చేయాల్సి ఉన్నందున, ఇక్కడ సరిపోతుందని భావిస్తున్నారు. మిగిలిన జిల్లా కార్యాలయాలకు సంబంధించి ఆయా డివిజన్ అధికారులకు వెతుకులాడే బాధ్యతను కలెక్టర్ ఇప్పటికే నిర్వహించిన సమీక్షలో అప్పగించారు. ఇప్పుడున్న డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలా.. లేక ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకోవాలనేది నిర్ణయించనున్నారు. ప్రస్తుతం మార్కాపురం జిల్లా కేంద్రంగా పరిపాలన ప్రారంభమవుతుందని తెలియడంతో రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంఘాలకు చెందినవారు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

**ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎవరు?**

ప్రస్తుతం ప్రకాశం కలెక్టర్ రాజాబాబు మార్కాపురానికి వచ్చి కొత్త



జిల్లా పాలనకు శ్రీకారం చుట్టే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఒంగోలు నుంచి వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు కూడా హాజరుకానున్నారు. కొత్త జిల్లా కలెక్టర్ ఎవరనేది స్పష్టత రాలేదు. ఇప్పుడున్న కలెక్టర్ రాజాబాబు ఇన్‌ఛార్జిగా ఆయనే కొనసాగుతారా.. లేక కొత్తవారు ఎవరైనా నియమితులవుతారనేది తేలలేదు. మరోవైపు ప్రకాశం సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కాలనీలో కలెక్టరేట్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పేర్కొన్నారు.

**మళ్లీ పాత ప్రకాశం**అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు నాడు ప్రకాశం జిల్లాలో ఉండగా, జిల్లాల పునర్విభజనలో దూరమయ్యాయి. ప్రస్తుతం తిరిగి కలపడంతో పాత ప్రకాశం జిల్లాకు ఊపిరిపోసినట్లయిందని ఇక్కడివారు చెబుతున్నారు. తాము ప్రతి పనికి ఒంగోలు వైపు చూసేవారిమని, కొన్నాళ్లు దూరం కాగా, ఇప్పుడు మళ్లీ తమకు అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాలనా సౌలభ్యంలో భాగంగా అద్దంకి, కందుకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు బుధవారమే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

## అన్నీ శుభ శకునాలే!

ఒంగోలు: కాలచక్రంలో ఒక ఏడాది ముగియనుంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. కొత్త ఏడాది తమకు కలిసి రావాలని, అంతా మంచే జరగాలని ప్రార్థిస్తున్నారు. మరోవైపు కీలకమైన ప్రాజెక్టులు చివరి దశకు చేరుకుని ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. లక్షలాది మందికి మేలు జరగనుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**రైలు కూత షురూ**

వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని బయట ప్రాంతాలతో అనుసంధానం చేసే నడికూడి–శ్రీకాళహస్తి రైల్వేలైను జిల్లా పరిధిలో చాలా వరకు పూర్తయింది. త్వరలో పామూరు వరకు రైలు మార్గం పూర్తికానుండడంతో ఇక్కడి వరకు రైలు పరుగులు పెట్టిస్తామని అధికారులు ఇటీవల పరిశీలనకు వచ్చినప్పుడు పేర్కొన్నారు. మరోవైపు బెంగళూరు–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు జిల్లాలో చాలా వరకు పూర్తయ్యాయి. కొత్త ఏడాదిలో వాహనాలు పరుగులు తీయనున్నాయి.

**కృష్ణమ్మ పరుగులు**

ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న మార్కాపురం ప్రాంత వాసులకు వెలిగొండ ప్రాజెక్టు గొప్ప వరమే. దశాబ్దాలుగా ఎదురుచూపులు చూస్తున్న ఇక్కడ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు నూతన సంవత్సరంలో పూర్తికానుండటంతో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

**పంటలకు జలం**



నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నీటితో నిండి ఉండడం, మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు జిల్లాలో నూరు శాతం చెరువులు నిండటంతో జలకళ సంతరించుకుంది. సాగర్ నుంచి జిల్లాకు 57 టీఎంసీలు నీరు కేటాయించగా, ఇప్పటి వరకు 34 టీఎంసీలు విడుదల చేశారు. మరో 23 టీఎంసీల జలాలు రానున్న కాలంలో పంటలకు విడుదల చేయనున్నారు.

**కొత్త కొలువులు**

పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవి కాలం త్వరలో ముగియనుండడంతో కొత్త ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక పాలనలో కీలకమైన పల్లె, పట్టణ పీఠాలకు పోటీ రసవత్తరంగా సాగుతుంది. స్థానిక సంస్థలు కొత్తగా కొలువుదీరనుండడంతో మొత్తం మీద పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది.

**ప్రగతి పరుగులు**

15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే మార్చి నెలలోగా ఖర్చు చేయాల్సి రావడంతో అన్నిచోట్లా పనులు ఊపందుకున్నాయి. మండల పరిషత్తు పాలకవర్గాల్లో రాజకీయ ఆధిపత్య పోరు ఉన్న చోట తప్ప తమ ఊరి బాగుకు మేలు చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులు చేపట్టారు. మరోవైపు ఒంగోలు నగరంలో రహదారులు, కాలువల నిర్మాణం, ముఖ్యమైన కూడళ్ల సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

## వ్యసనం.. వదిలిస్తున్నారు!

కాకినాడ : పిఠాపురం మండలానికి చెందిన 19 ఏళ్ల యువకుడు కాకినాడలో డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఆకతాయిలతో తిరిగి ఏడాదిన్నర నుంచి మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు అతడిని జీజీహెచ్‌లోని డీఅడిక్షన్ ఓపీకి తీసుకొచ్చారు. యువకునికి ఇక్కడి వైద్యులు చికిత్స అందించి, కౌన్సెలింగ్ చేసి పంపారు. తాళ్లరేవు మండలానికి చెందిన 18 ఏళ్ల యువకుడు ఇంటర్ చదివి మానేశాడు. తర్వాత గంజాయికి బానిసయ్యాడు. తల్లిదండ్రులనూ లెక్క చేయడం లేదు. దాంతో వారు గత అక్టోబర్‌లో జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యేక చికిత్స అందించి, మందులు ఇచ్చారు. ప్రస్తుత చాలామంది సరదాగా అంటూ సిగరెట్ తాగడం మొదలుపెడుతున్నారు. ఆ తర్వాత గుట్కా, మందు అలవాటు అవుతున్నాయి. ఆ వ్యసనం అక్కడితో ఆగకుండా గంజాయి వరకూ వెళుతోంది. ప్రధానంగా యువత వీటి బారినపడి తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి విక్రయాలు చేస్తున్నారు. ఒక్కసారి వీటి బారిన పడితే భవిష్యత్తు ఉండదని అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**జీజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స..**

వ్యసనపరుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 2020 మేలో వ్యసన విముక్తి కేంద్రం(డి–అడిక్షన్) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గత ఆరేళ్లుగా ఓపీ, ఐపీ సేవలు అందిస్తున్నారు. కొందరు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది భయంతో, అందరికీ



తెలిసిపోతుందనే కారణంతో రావడం లేదు. ప్రస్తుతం ఇక్కడ ఒక వైద్యుడు, ఇద్దరు నర్సులు, ఇద్దరు కౌన్సిలర్లు అందుబాటులో ఉన్నారు. వ్యసనవిముక్తి కేంద్రాన్ని వినియోగించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి..**

పిల్లల ప్రవర్తనలో మార్పు ఉంటే తల్లిదండ్రులు గమనించాలి. విపరీతమైన కోపం, కళ్లు ఎర్రబడటం, సరైన సమయానికి తిండి, నిద్ర లేకపోవడం, తనలో తాను మాట్లాడుకోవడం, భ్రమలు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి. కొంతమందికి కౌన్సెలింగ్, మరికొంతమందికి మందులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు.

డాక్టర్ వి.వరప్రసాద్, మానసిక వైద్యనిపుణుడు, జీజీహెచ్

# కలపకు జీవం.. కళకు గౌరవం

అనకాపల్లి : సొంత ఇల్లు లేదు. అద్దెకు తీసుకున్న చిన్న షెడ్‌లో ఉంటూ లక్కబొమ్మలు తయారు చేసే ఓ యువ కళాకారుడు. హస్తకళ ప్రాచుర్యం పెంచాలని.. గత వైభవాన్ని తీసుకురావాలనే సంకల్పంతో అహరహం శ్రమించాడు. అంకుడు కర్రపై బొమ్మలు చెక్కుతూనే తన ఆలోచనలకూ పదునుపెట్టాడు. బొమ్మలను మరింత అందంగా తీర్చిదిద్దాడు. ఏటికొప్పాక కీర్తి ప్రతిష్ఠలను దిల్లీ స్థాయికి తీసుకెళ్లాడు. ఏటికొప్పాక యువ హస్తకళాకారుడు గొర్స సంతోష్ కుమార్ అత్యున్నతమైన శిల్పగురు పురస్కారాన్ని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకున్నాడు.

సంతోష్ కుమార్ ఏడో తరగతి వరకూ చదువుకున్నారు. భార్య భారతి, పిల్లలు రిషి, రక్షితతో కలిసి చిన్న రేకుల షెడ్డులో ఉంటూ లక్కబొమ్మలు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. ఇలా సాగిపోతున్న ఈయనకు వినూత్నంగా ఏదైనా చేయాలన్న ఆలోచన వచ్చి గణతంత్ర వేడుకలకు దిల్లీలో ఏర్పాటు చేసే శకటానికి లక్కబొమ్మ డిజైన్ చేసి పంపించగా..



గతేడాది గణతంత్ర వేడుకల్లో ఈ శకటం మనరాష్ట్రానికి మూడో బహుమతి తెచ్చిపెట్టింది. అంతటితో ఆయన ఆగలేదు. ఏదైనా బొమ్మ తయారుచేసి జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలనే ఆలోచన వచ్చింది. దసరా పండగకు ఇళ్లల్లో పెట్టే బొమ్మల కొలువును తలపించేలా బొమ్మను తయారు చేశారు. అత్యున్నతమైన శిల్పగురు పురస్కారానికి పంపగా అవార్డుకు ఎంపికైంది.

**గ్రామానికే గుర్తింపు ...** కొవిడ్ సమయంలో లక్కబొమ్మలకు డిమాండ్ పూర్తిగా పడిపోయింది. ఈ కళ అంతరించిపోతుందన్న భయం నెలకొంది. అలా జరగకుండా ఉండాలంటే జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు రావాలని భావించా! అందుకే వినూత్నంగా ఆలోచించి ఈ బొమ్మలను తయారు చేశా. ప్రజల్లో మార్పు వచ్చింది. జనం మళ్లీ ఈ బొమ్మలవైపు చూస్తున్నారు. సీమంతాలు, పెళ్లిళ్లు, పుట్టినరోజులకు ఈ బొమ్మలను బహుమతిగా ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. ఈ అవార్డు మా గ్రామానికి వచ్చిందిగా భావిస్తున్నా.- సంతోష్‌కుమార్

# ఎవరు చెబితే మాకేంటి..?

మిట్టూరు : ఎంతో ఉన్నతాశయంతో నాణ్యమైన ఉద్యాన పంట ఉత్పత్తులు, రైతులకు అధిక ఆదాయమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)ను 2019లో ప్రారంభించారు. తరువాత ఐదేళ్ల వైకాపా పాలనలో దీన్ని పట్టించుకోలేదు. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించింది. సేవలు విస్తరించి రైతులకు లబ్ధి చేకూర్చే దిశగా పరుగులు తీయిస్తోంది.. ఇంతవరకు బాగానేఉన్నా.. ఉద్యోగులు, సిబ్బంది కొరత సీఈవోను తీవ్రంగా వేధిస్తోంది.

**ఊసేలేని నియామకాలు..**



సీఎం చంద్రబాబు.. జనవరిలో కుప్పం పర్యటనలో ఉద్యాన పంటల సాగుపై రైతులతో మాట్లాడారు. తక్షణమే శాశ్వత ఉద్యోగులను నియమించి మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. 11 నెలలు కావస్తున్నా నేటికి నియామక ఊసేలేదు. డిప్యూటేషన్‌పై ఏడీ స్థాయి అధికారితో పాటు ఇద్దరు ఉద్యానశాఖ సహాయకులు మాత్రమే ఉన్నారు.

**ఇతర రాష్ట్రాలకు సైతం..**

ఇక్కడ నాణ్యమైన అధిక దిగుబడులనిచ్చే తెగుళ్లను తట్టుకునే టమాటా, వంగ, కాకర, బీర, సొర, గుమ్మడి మొక్కలతో పాటు గ్రాఫ్టింగ్ వెజిటబుల్ నారు మొక్కలను ఉత్పత్తి చేస్తారు. జిల్లాలోని రైతులకు రాయితీపై నారు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వీటిని ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటగా కుప్పంలో సీవోఈను ఏర్పాటు చేయగా.. తాజాగా పల్నాడు జిల్లాలో మరో సీవోఈ ఏర్పాటైంది. ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఉద్యానశాఖ డీడీ మధుసూదనరెడ్డి'కు తెలిపారు.

# ఉపాధికి చోదక శక్తి అవుతుందా..?

దర్శి : దర్శి ప్రాంత అభివృద్ధికి, ఉపాధికి ఊతమిచ్చే జాతీయ చోదక పాఠశాల నిర్మాణానికి 2016లో శంకుస్థాపన జరిగింది. పలు కారణాలతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. ఇటీవల రోడ్డు ప్రమాదాల నివారణపై అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు దర్శిలో నిలిచి పోయిన చోదక పాఠశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణంపై స్థానిక యువతలో ఆశలు చిగురించాయి.

**2016లోనే శంకుస్థాపన..**

దేశంలోనే రెండోదైన డ్రైవింగ్, ట్రైనింగ్, రీసెర్చ్ పాఠశాల ఏర్పాటుకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో దర్శి మండలం వెంకటాచలంపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. సర్వే నంబరు 251/2లో ఇరవై ఎకరాల స్థలం కేటాయించారు. రూ.18.50 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టడానికి 2016లో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. ఏటా వెయ్యి మందికి భారీ, తేలికపాటి వాహనాల డ్రైవింగ్ శిక్షణ, 14,500 మంది చోదకులకు పునశ్చరణ తరగతులతో పాటు 4 వేల మందికి ప్రమాద రహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్మాణం ప్రారంభమైంది. పురుష, మహిళా డ్రైవర్లకు విడివిడిగా వసతి సౌకర్యం, స్థానికులకే ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవడం దీని లక్ష్యం. ఈ ప్రాజెక్టుకు కేంద్రం 70, రాష్ట్రం 30 శాతం నిధులు సమకూర్చుతారు. మారుతీ సుజుకి సంస్థ లాభాపేక్ష లేని ప్రాజెక్టుగా దీనిని నిర్మించాలనేది ఒప్పందం. రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తిచేయాలనే లక్ష్యంతో అప్పట్లో ప్రారంభించారు. ఆర్అండ్‌బీ, రవాణా శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్లతో పనులు చేశారు. ట్రాక్ నిర్మాణం కోసం కొండ ప్రాంతాన్ని చదును చేసి, పరిపాలనా భవనం పిల్లర్ల వరకు నిర్మాణం జరిగింది.

# పట్టణ ప్రణాళిక.. అవినీతి మరక



అనంతపురం :నగరంలోని గుత్తి రోడ్డులో 14.15 సెంట్ల స్థలంలో చేపడుతున్న భవన నిర్మాణానికి సంబంధించి సెల్లార్‌కు అనుమతులు లేవు. పార్కింగ్‌కు స్థలం వదల్లేదు. సెట్‌బ్యాక్‌లోనూ నిబంధనలు ఉల్లంఘించారు. నోటీసులు ఇచ్చినా అక్రమ నిర్మాణం ఆగలేదు. రెండో రోడ్డులోని ఈ భవనానికి రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని వాణిజ్యపరంగా నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్ వదల్లేదు. ముందువైపు రోడ్డుకు 2 మీటర్ల గ్యాప్ వదలాల్సి ఉండగా 0.25 మీటర్లే ఉంది.

కార్పొరేషన్‌లో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తమ జేబులు నింపుకోవడం కోసం ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. లంచాలు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఆమోదం తెలుపుతున్నారు. డబ్బులు ముట్టచెబితే చాలు అదనపు అంతస్తులు నిర్మించినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. సెట్‌బ్యాక్ వదలకపోయినా సెట్ చేస్తున్నారు. వాణిజ్య భవనాలను రెసిడెన్షియల్‌గా మార్చేస్తున్నారు. పైసలిస్తే ఎన్ని ఉల్లంఘనలు ఉన్నా ఆమోదముద్ర వేసేస్తున్నారు. కమిషనర్లు, ఉన్నతాధికారులకు తెలిసినా కఠినంగా వ్యవహరించడం లేదనే అభిప్రాయం వెలువడుతోంది. కొందరు అధికారులు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అనంత నగరంలో చాలాచోట్ల డ్రైనేజీల పైనే ప్రహరీలు నిర్మిస్తున్నారు. కనీసం ఆరడుగులు సెట్‌బ్యాక్ వదలాల్సి ఉండగా.. ఏ ఒక్క నిర్మాణంలోనూ పాటించడం లేదు. అనుమతికి మించి అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారు.

రెసిడెన్షియల్ భవనానికి గజానికి రూ.6 వేలు, కమర్షియల్ భవనానికి రూ.21 వేలు చెల్లించాల్సి ఉంటుంది. చాలామంది రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు. అధికారులు డబ్బులు తీసుకుని ఆమోదం తెలుపుతున్నారు.

**కొన్నింటికే అనుమతులు**

నగరంలో ప్రస్తుతం 450 భవనాలు నిర్మాణ దశలో ఉండగా అందులో 400కు పైగానే నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్నారు. ఉల్లంఘనులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. డబ్బులు ముట్టజెప్పిన వారి జోలికి వెళ్లడం లేదు. ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వడం కోసం మాత్రం తీరిగ్గా ఛార్జిషీట్లు దాఖలు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం...: బాలస్వామి, నగర పాలక సంస్థ కమిషనర్**

గతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకుని ఉంటే బీపీఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాం. దరఖాస్తు చేసుకోకుండా ఉంటే భవనాలను కూల్చివేస్తాం. ఇప్పటికే నగరంలో 285 భవనాలకు ఛార్జిషీట్లు వేశాం. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబోతున్నాం. సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవు.

# అడుగడుగునా అతుకులు



తలుపుల : కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న జాతీయ రహదారిపై అడుగడుగునా అతుకులు పడటంతో పాటు చీలిపోవడంతో వాహనచోదకులు అవాక్కవుతున్నారు. మరోవైపు గతుకుల ప్రయాణంతో తమ ప్రాణాలకు భద్రత ఏదని వాపోతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం బి.కొత్తపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకున్న రెండు వరుసల రోడ్డును ఇటీవల రూ.432 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా విస్తరించారు. ఈ మార్గం కదిరి పురపాలిక పరిధి నుంచి తలుపుల మండలం బి.కొత్తపల్లి వరకు అతుకుల బొంతను తలపిస్తోంది.

**జలపాతం సమీపంలో..**

బట్రేపల్లి జలపాతం సమీపంలో వేసిన తారురోడ్డు దెబ్బతింది. తారు మొత్తం లేచిపోయి వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. అక్కడే మలుపు ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారింది. బట్రేపల్లి గ్రామ సమీపంలో భూకంపం వచ్చిందా అన్నరీతిలో తారురోడ్డు చీలింది. అలంపూర్, కుంట్లపల్లి సమీపంలో తారు లేచిపోయి గుంతలు పడడంతో అధికారులు అతుకులేశారు. దాన్ని ఎవరూ గుర్తించకుండా తెల్లపొడి చల్లారు. బట్రేపల్లి అడవి చెరువు సమీపంలో రోడ్డు దారుణంగా దెబ్బతింది. గుర్తించిన గుత్తేదారు అక్కడ ప్యాచ్‌వర్క్ చేయడానికి తారుపలకలు తొలగించారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

నేను ఇటీవల బాధ్యతలు చేపట్టా. ఆ రహదారిని పరిశీలిస్తాం. వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా రోడ్డును నాణ్యంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. దెబ్బతిన్నచోట మరమ్మతులు చేపట్టి మరింత పటిష్ఠంగా నిర్మించేలా చూస్తాం.సంజీవరాయుడు, ఈఈ, ఎన్‌హెచ్ఐఏ

# గ్రావెల్ దందా.. ఆపేదుందా?



అనకాపల్లి : 'ఒక గ్రావెల్ లారీ బయటకు వెళ్లిందంటే.. రూ. 8 వేలు. అదే కొన్నిలారీలు ఒక రాత్రంతా నడిస్తే.. రూ. లక్షల వ్యాపారం. అలా వచ్చిన ఆదాయంలో కొంత ముడుపులు చెల్లించేస్తే.. అక్రమ వ్యాపారానికి అడ్డుండదు. కేసులూ ఉండవు".. ఇదీ సబ్బవరం మంబలంలో గ్రావెల్ అక్రమార్కులు అనుసరిస్తున్న పంథా.

**సబ్బవరం మండలం అంటే..** గ్రావెల్ దందాకు అడ్డాగా మారింది. నిన్న, మొన్నటి వరకు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగించిన వారు ఇప్పుడు బరితెగించారు. స్థానిక నేతలు, కొంతమంది రెవెన్యూ అధికారుల పేరుతో బహిరంగంగా తవ్వేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా.. రెవెన్యూ అధికారులు అడపాదడపా తనిఖీలతో మమ అనిపించేస్తున్నారు. విశాఖ నగరం శివారులో లేఅవుట్ల అభివృద్ధితో గ్రావెల్‌కు డిమాండ్ ఏర్పడింది. దీంతో అక్రమార్కుల కన్ను సబ్బవరం మండలంలో కొండవాలు ప్రాంతంపై పడింది. గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు, అసకాపల్లి, రాయపురఅగ్రహారం, గాలిభీమవరం, ఒమ్మివానిపాలెం, రైవాడకాలువ -నల్లకొండ మధ్య అటవీ భూమిని ఆనుకొని తవ్వకాలు చేస్తున్నారు. గతంలో వైకాపాలో చక్రం తిప్పినవారే ఇప్పుడు అధికార పార్టీ నేతలతో జట్టుకట్టారు. ఇంతవరకు ట్రాక్టర్లతో తరలించినవారు ఇప్పుడు ఏకంగా భారీ లారీలతో తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇటీవల అంతకాపల్లి శివారు రైవాడకాలువ-నల్లకొండ మధ్య అటవీ భూమిని ఆనుకుని గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఉన్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.సూది కొండ సర్వే నం. 286లోని వంగలి వెళ్లే రహదారిలో కేజీబీవీ-పెదగరువు మధ్య తవ్వకాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలులేవు. ఆరిపాక నుంచి నల్లరేగులపాలెం వెళ్లే రహదారిలో నల్లరేగులపాలెం అటవీ భూమినీ కొల్లగొట్టేస్తున్నారు.

**తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తాం..** సబ్బవరం మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించాం. చర్యలు కూడా చేపడుతున్నాం. రెవెన్యూ అధికారులను ఎప్పటికప్పుడు వెళ్లి పరిశీలించేలా పర్యవేక్షిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సహజ వనరులను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవు. పోలీసులకు కూడా చెప్పి నిఘా పటిష్ఠం చేస్తాం. - శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

# నీరింకిన పనులు

నంద్యాల : ప్రతి గ్రామీణ కుటుంబానికి నిత్యం 55 లీటర్ల స్వచ్ఛమైన నీరు అందించేందుకు చేపడుతున్న జల్‌జీవన్ పనులు ముందుకు కదలడం లేదు. బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. మరికొన్ని పనులు నిదానంగా సాగుతున్నాయి. ఆగిన పనుల పరిస్థితిపై నివేదిక రూపంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వేసవి ప్రారంభం నాటికి పనులు పూర్తి చేస్తే గ్రామీణులకు తాగునీటి కష్టాలు తీరుతాయి.

**కొన్ని రద్దు.. మరికొన్ని ఆగి**

కర్నూలు జిల్లాలో తొలుత 1,491 పనులు ప్రతిపాదించగా అందులో 1,068 రద్దయ్యాయి. నంద్యాల జిల్లాలో 1,556 పనుల్లో 1,135 రద్దయ్యాయి. కర్నూలు జిల్లాలో 276 కి.మీ. పొడవునా పైపులైను వేయాల్సి ఉంది. ఓహెచ్ఎస్ఆర్‌లు 8 నిర్మాణంలో ఉండగా మరో నాలుగింటిపై స్పష్టత లేదు.

నంద్యాలలో 1,077 కి.మీ. పైపులైను పనుల్లో ఇంకనూ 311 కి.మీ.లు పూర్తవ్వాల్సి ఉంది. ఓహెచ్ఎస్ఆర్‌లలో 12 నిర్మాణంలో ఉండగా.. మరో ఆరు పనులు అతీగతీ లేకుండా పోయాయి.

**నీరుగార్చిన వైకాపా**

జల్‌జీవన్ పథకాన్ని కేంద్రం 2019లో ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో నాటి వైకాపా ప్రభుత్వం వాటా చెల్లించలేదు. పథకం గడువు పూర్తవుతున్నా స్పందన రాకపోవడంతో చాలాచోట్ల పనులు రద్దయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు అస్తవ్యస్తంగా మారాయి. పనులు చేపట్టిన గుత్తేదారులు అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. చాలా చోట్ల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.మండల కేంద్రానికి రూ.3.80 కోట్లు మంజూరయ్యాయి. రూ.1.76 కోట్లతో రంగప్పగట్టు, తిమ్మప్పగట్టు సమీపంలో రెండు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రూ.2.4 కోట్ల నిధులతో సాయిబాబా కాలనీ సమీపంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, 8వేల మీటర్ల పైప్ లైన్ పనులు చేపట్టాల్సి ఉంది. మూడు నెలల క్రితం పనులు మధ్యలో వదిలేసి గుత్తేదారు వెళ్లిపోయారు. కోసిగి

# దక్షిణ ద్వారం.. అభివృద్ధికి దూరం

ఒంటిమిట్ట : శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి శైవ క్షేత్రానికి దక్షిణ ద్వారంగా విలసిల్లుతున్న సిద్దవటం మండలం జ్యోతి గ్రామంలోని సిద్దవటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి ఆమడ దూరంలోనే ఆగిపోయింది. పెన్నానది ఒడ్డున కొలువైన ప్రధాన శివాలయం, కామాక్షీదేవి, జ్యోతిలింగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి ఉప ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

**ఆలయ వృత్తాంతం ఇదీ..**

క్రీస్తు శకం 7-8వ శతాబ్దం మధ్య కాలంలో జ్యోతి గ్రామ శివారులోని పెన్నానది ఒడ్డున సిద్దవటేశ్వరస్వామి ఆలయం ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పూర్వ కాలంలో రాష్ట్ర కూట చక్రవర్తి నరేంద్ర మృగరాజు సిద్దవటం పరిధిలో 108 శిలా విగ్రహాలు నిర్మించినట్లు ఇక్కడి శాసనంలో ఉంది. ఇక్కడ 108 శివలింగాలు ఉన్నట్లు ఇసుకతిన్నెల తవ్వకాల్లో బయటపడ్డాయి. రుద్రమదేవి ఆలయానికి దూపదీప నైవేద్యాలకు, తిరునాలకు అయ్యే ఖర్చులకు సంపద, మూలవిరాట్‌లను అందించారని తెలుస్తోంది. అయిదు దశాబ్దాల కిందట వరకు ఇసుకలో పూడి ఉండగా 1962లో స్థానికులు గుర్తించి వెలుగులోకి తెచ్చారు. 2005లో శ్రీశైల దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఇక్కడ ఇసుక తొలగింపు పనులు చేపట్టడంతో ఆలయాలు బయటపడ్డాయి.

**ఆలనాపాలన కరవు**



జ్యోతి క్షేత్రంలో దెబ్బతిన్న దివ్య మందిరాల మరమ్మతులు, పునర్నిర్మాణం పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. కూలిపోయే దశలో ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రధాన గోపురం నిర్వహణ అధ్వానంగా మారింది. కలుపు, గడ్డి మొక్కలు, ఆకుజాతి తీగలు పెరిగాయి. ఈ ఆలయంపై అలసత్వం ప్రదర్శిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పోతుగుంటపైనే ఆశలు**

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్‌గా పోతుగుంట రమేష్‌నాయుడు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ ప్రాంత వాసులు ఆయనపై ఆశలు పెట్టుకున్నారు. అధ్వానంగా ఉన్న జ్యోతి క్షేత్రం బాగోగులపై ఆయన దృష్టి సారిస్తే ఎంతో మేలు. ఆయన చొరవ తీసుకొని మరమ్మతులు, పునర్నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు నిధులివ్వాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

## మాటల్లో తీపి.. చేతల్లో చేదు

విజయనగరం : రెండు దశాబ్దాల క్రితం చెరకు సాగులో ఉమ్మడి జిల్లా ముందుండేది. కొత్త రకం విత్తనం అందకపోవడం, చక్కెర కర్మాగారాల మూతతో ఏటా విస్తీర్ణం తగ్గుతోంది. ప్రస్తుతం కొద్దిపాటి పంటను రైతులు సంకిలిలోని ప్రైవేటు కర్మాగారానికి తరలిస్తున్నారు. ఇది దూరంగా ఉండటంతో రవాణా భారం తడిసిమోపెడవుతోంది. పెరిగిన పెట్టుబడి.. అమ్మకానికి కష్టాలు.. ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లో నష్టాలు మూటగట్టుకోలేక రైతులు క్రమంగా వెనకడుగు వేస్తున్నారు.

**హామీలు అమలుకాక..**

ఎనిమిది దశాబ్దాల పాటు భీమసింగిలోని శ్రీవిజయరామ గజపతి సహకార చక్కెర కర్మాగారం రైతులకు సేవలందించింది. అంచెలంచెలుగా చెరకు సరఫరా తగ్గడం, ఆర్థిక సమస్యల కారణంగా 2021లో మూతపడింది. పునః ప్రారంభిస్తామని నాయకులు ఎన్నికల్లో హామీలిచ్చారు. ఆ తర్వాత దీని ఊసెత్తేవారే కరవయ్యారు.

**పీఎఫ్ డబ్బులు రాక..**

సీతానగరంలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం ఉమ్మడి జిల్లా రైతులకు జీవనాధారం. నష్టాల బాట పట్టడంతో చెల్లింపులు, కార్మికులకు జీతాలు బకాయిపడింది. కర్మాగారం భూములమ్మి కొంతమేర చెల్లించినా.. కార్మికులకు న్యాయం జరగలేదు. పీఎఫ్, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సుల కింద సుమారు రూ.3 కోట్లు రావాల్సి ఉంది.



**గిట్టుబాటు కాక..**

ప్రభుత్వం ప్రకటించిన ధర గిట్టుబాటు కావడం లేదు. గతేడాది టన్ను రూ.3,151 కాగా.. ఈ ఏడాది రూ.3,360 ప్రకటించారు. ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తోంది. పెట్టుబడి వ్యయం రూ.35 వేలు దాటుతోంది. ఈ లెక్కన కనీసం చేతికందడం లేదని అన్నదాతలు చెబుతున్నారు.

**మూత దిశగా సంకిలి?**

సాగు విస్తీర్ణం తగ్గడం, సామర్థ్యానికి అవసరమైన మేరకు పంట అందకపోవడంతో సంకిలి కర్మాగారం సైతం మూతపడే దిశగా పయనిస్తోంది. ఇటీవల విజయనగరం డీఆర్సీలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాది కనీసం మూడు లక్షల టన్నులైనా సరఫరా జరగకపోతే కర్మాగారం పరిస్థితి ప్రశ్నార్థకమేనని ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24లో 3.92 లక్షల టన్నుల మేర గానుగ జరగ్గా.. గతేడాది 3.50 లక్షల టన్నులకు పడిపోయింది. ఈసారి మరింత తగ్గిపోతుందని భావించారు. ఈ నెల 6న గానుగ ప్రారంభమైందని, విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నట్లు కేన్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. రాయితీలిచ్చి ప్రోత్సహిస్తామన్నారు.

## విజయనగరానికి 'సౌర' గొడుగు

విజయనగరం : విజయనగరంలో రానురానూ కాలుష్యం పెరుగుతోంది. వాహనాల అధిక వినియోగం, పచ్చదనం కరవవడం, పరిశ్రమల నుంచి ఉద్గారాలు పెరగడం తదితర కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే 50 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక వేశారు. మరోవైపు సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచుతున్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా ఇప్పటికే నగరపాలిక, గ్రామీణ మండలం పరిధిలో పెద్దఎత్తున ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. సబ్‌స్టేషన్ స్థాయిలో సౌర విద్యుత్తును అందిస్తున్నాయి.

**10 వేల యూనిట్లు..** ప్రతి నియోజకవర్గంలో 10 వేల వరకు యూనిట్లు ఏర్పాటు చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు రాయితీలు సైతం ప్రకటించింది. దీంతో విజయనగరం పరిధిలో ఆసక్తి గలవారు ముందుకొస్తున్నారు. అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేస్తుండడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్పందిస్తున్నారు.

**సౌకర్యాలు ఇలా..**



ప్రభుత్వం మూడు కిలోవాట్ల వరకు రాయితీ ఇస్తోంది. బ్యాంకులు ఆరు శాతం వడ్డీతో 80 శాతం వరకు రుణం అందజేస్తున్నాయి

ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, 2కేవీ యూనిట్ అయితే రూ.60 వేలు, 3కేవీ అయితే రూ.78 వేల వరకు సబ్సిడీ అందనుంది

విద్యుత్తు బిల్లుల భారం తగ్గుతుంది

మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా అదనంగా నగదు పొందొచ్చు

యూనిట్‌ను రూ.2.50 చొప్పున అమ్ముకోవచ్చు.

**దరఖాస్తులు ఇలా..**

వచ్చినవి: 1850

ఏర్పాటైన ప్లాంట్లు: 1400

రిజిస్ట్రేషన్ పూర్తి: 28

చివరి దశలో ఉన్నవి: 31

ఉత్పత్తి: 4.6 మెగావాట్లు

ముందుకు వస్తున్నారు..

పలకల ఏర్పాటుకు కనీసం 10 చ.మీ లేదా 100 చ.అడుగుల విస్తీర్ణం ఉండాలి. ఆసక్తి ఉంటే ఈపీడీసీఎల్ సిబ్బందిని సంప్రదించాలి. ప్రస్తుతం నగరంలో 33/11 కేవీ సామర్థ్యంతో కూడిన సబ్‌స్టేషన్ స్థాయిలో సౌర విద్యుత్తు అందుతోంది. జీఎస్టీ స్లాబ్ రేట్ల మార్పుతో ప్యానెళ్ల ధరలు సైతం తగ్గాయి. గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటుకు గానూ ఔత్సాహికులకు అదనపు సౌకర్యాలుంటాయి.

పి.త్రినాథరావు, విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ, ఏపీఈపీడీసీఎల్

## పల్లె ప్రగతికి.. కూటమి బాటలు



చిత్తూరు : వైకాపా సర్కార్ పల్లెల ప్రగతి గాలికొదిలేసింది. ఆర్థిక సంఘ నిధులనూ దారి మళ్లించింది.. చివరకు గ్రామాల్లో బ్లీచింగ్‌కూ చిల్లిగవ్వ లేని దుస్థితి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు గాడిలో పెట్టింది.. ఆర్థిక సంఘ నిధులు సమర్థంగా వినియోగిస్తూనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై) కింద ఇస్తున్న నిధులు గరిష్ఠ స్థాయిలో ఖర్చు చేస్తోంది.. తదనుగుణంగా పల్లె ప్రగతి పరుగిడుతోంది.

**ప్రతి గ్రామానికీ రూ.20 లక్షలు..**

50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీల జనాభా ఉన్న గ్రామాల్లో పీఎంఏజీవై నిధులు వెచ్చిస్తున్నారు. ఒక్కో పల్లెకు రూ.20 లక్షలు కేటాయించారు. ఇవి చాలకుంటే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, జడ్పీ నిధుల నుంచీ విడుదల చేస్తున్నారు. సీసీరోడ్లు, తాగునీటి పైప్‌లైన్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పంచాయతీ భవనాల నిర్మాణం, విద్యుద్దీపాలు, ఆర్వో ప్లాంట్లు, శ్మశానవాటికల ఏర్పాటు, పాఠశాల, అంగన్‌వాడీలకు ప్రహరీలు నిర్మిస్తున్నారు. పల్లెల అవసరాలు ప్రాథమికంగా గుర్తించి ఆయా శాఖల ద్వారా పనులు చేయిస్తున్నారు.

**తరచూ సమీక్షలు..**

రెండు జిల్లాల్లో రూ.23.52 కోట్లతో 118 ఆదర్శ గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఇద్దరు కలెక్టర్లు తరచూ సమీక్షిస్తూ తొలి విడత పనులు వేగంగా పూర్తిచేసి రెండు, మూడో విడతపై దృష్టి సారిస్తున్నారు. ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే జడ్పీ సీఈవో వెంటనే తెలియజేయాలని సూచించారు. మరోవైపు బిల్లులకూ ఇబ్బంది లేనందున గుత్తేదారులు సైతం వేగంగా పనులు చేపట్టారు.

**జగన్ పాలనలో తొలి విడతా పూర్తికాక..**

జగన్ పాలనలో తొలి విడతలో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లోనూ అసంపూర్తి నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. గతంలో చిత్తూరు జిల్లాలో కేవలం రూ.34 లక్షలు, తిరుపతిలో రూ.16 లక్షలు ఖర్చు చేశారు. ఎన్డీయే హయాంలో ఏడాదిన్నరలోనే చిత్తూరులో రూ.2.57 కోట్లు, తిరుపతిలో 1.40 కోట్లు వెచ్చించారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక కేంద్ర నిధులు గరిష్ఠంగా వినియోగిస్తున్నారు.

## 'మురుగు' తున్న నిధి



ఆళ్లగడ్డ : ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో నిధులు 'మురుగు' తున్నాయి. బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020 కింద పురపాలికలకు వచ్చిన ఆదాయాన్ని ప్రజారోగ్యానికి ఖర్చు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. 2024 జులై 7న ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తూ నిధులు విడుదల చేసింది. కాల్వల శుభ్రతకు నిధులిచ్చినా ఇంత వరకు పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. కాల్వల్లో మురుగు పేరుకుపోయి దోమలు పెరగడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

**లెక్కలు పక్కాగా చెప్పాల్సి రావడంతో**

గతంలో మురుగు కాల్వల శుభ్రత పనులంటే గుత్తేదారులకు పండగే. ఎందుకంటే.. కంటికి కనిపించవు, లెక్కకు చిక్కవు. వేసవిలో చేయాల్సిన పనులు అటకెక్కించి, తీరా వర్షాకాలం మొదలయ్యే సమయంలో చేపట్టేవారు. సాధారణ నిధులు కావడంతో స్థానిక పెత్తనం, కమీషన్లు ఇచ్చి పనులు దక్కించుకోవడం, పైపై పూతలతో చేశామనిపించుకొని, వర్షాలు కురిస్తే.. లెక్కకు చిక్కకుండా, నిధులు పక్కదారి పట్టించేవారు. ప్రస్తుతం ఇచ్చిన నిధులపై ప్రతి పైసాకు లెక్క ఉంటుంది. దీంతో స్థానికంగా రాజకీయాల కారణంగా పనులు ముందుకెళ్లలేకపోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

**ఎక్కడ ఎలాంటి పరిస్థితి..**

ఆదోనిలో ఎర్రవంక, ఆవుదూడ వంక 18 కి.మీ. మేర పూడికతీసి రూ.56 లక్షలు ఖర్చు చేశారు. ఇంకా రూ.60 లక్షలు మిగిలాయి. వీటిని ఏటా వార్డులు కలిపి ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేసి, ప్రతి గ్రూప్‌కు రూ.10 లక్షల మేర పూడికతీత పనులకు ప్రణాళికలు ఇవ్వాలని సంబంధిత సచివాలయ ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు.

ఎమ్మిగనూరులో రూ.70 లక్షలిస్తే.. రూ.25 లక్షలతో 36 కి.మీ. మేర మురుగు కాల్వల శుభ్రత పనులు చేపట్టారు. మిగిలిన మొత్తాలకు పనులు చేయాల్సి ఉంది.

నంద్యాలలో రూ.1.49 కోట్లు కేటాయించగా.. రూ.80 లక్షలు వ్యయం చేశారు. మిగిలిన మొత్తం ఖజానాలో మూలుగుతోంది.

డోన్‌కు రూ.13 లక్షలు ఇస్తే.. రూ.10 లక్షలతో పనులు చేపట్టారు. మరో రూ.లక్షన్నరకు బిల్లులు రావాల్సి ఉంది. ఇంకా రూ.లక్షన్నర నిధులతో బేతంచెర్ల, బాలికల పాఠశాల రహదారిలో పనులు చేపట్టాల్సి ఉంది. ఆళ్లగడ్డకు రూ.30 లక్షలు ఇస్తే, నిధులు మొత్తం ఖర్చు చేశారు. వీటిలో ఆత్మకూరు, గూడూరు పురపాలికలకు ఇచ్చిన నిధులు వెనక్కి తీసుకున్నారు.

## 'ఉచితం' మాటున వాగుల లూటీ



కర్నూలు : వాగులు.. వంకలు.. నదుల్లో నీటి ప్రవాహం తగ్గింది.. 'వరద'కు కొట్టుకొచ్చిన ఇసుక నిల్వలపై అక్రమార్కులు కన్నేశారు. 'ఉచిత ఇసుక' ఊడ్చేస్తున్నారు. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లాలంటే ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. 2024 జులై నుంచి ఇప్పటి వరకు కర్నూలు జిల్లా పరిధిలో 1,866 మంది, నంద్యాలలో కేవలం 26 మంది స్థానికులు ఇసుక కోసం దరఖాస్తు చేసుకున్నారు.

**రిజిస్ట్రేషన్లు అంతంతే..**

ఉచిత ఇసుక విధానం అమలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు కర్నూలు జిల్లా పరిధిలో 15,369 మంది వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వ శాఖలు.. అన్ని కలిపి ఇసుక కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఈ లెక్కన రోజుకు 30 రిజిస్ట్రేషన్లు కూడా జరగడం లేదు.

నంద్యాల జిల్లా పరిధిలో 10,419 మంది, సంస్థలు ఇసుక కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. ఈ లెక్కన పరిశీలిస్తే రోజుకు 20 రిజిస్ట్రేషన్లు కూడా జరగడం లేదు. కానీ వాగులు, వంకలు, నదుల నుంచి ప్రతిరోజూ వేలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతుండటం గమనార్హం.

**టాస్క్‌ఫోర్స్ ఏమైనట్లు**

ఉచిత ఇసుక విధానంపై జిల్లా స్థాయిలో శాండ్ కమిటీ ఏర్పాటుచేశారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, జేసీ కన్వీనర్‌గా, పలువురు అధికారులను సభ్యులుగా చేర్చి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. డివిజన్, మండల, గ్రామస్థాయిలోనూ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆయా కమిటీలు అలంకారప్రాయంగా మారాయి. ఏమాత్రం తనిఖీలు చేయడం లేదు. మూడుసార్లు పట్టుబడిన వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు పరిశీలిస్తే కేవలం 65 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

**మూడు చోట్ల.. మూడు రకాలుగా దోపిడీ..**

కర్నూలు జిల్లాకు సి.బెళగల్ మండల పరిధిలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లు, నదిచాగి, గుడికంబాలి, మరళి-2 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది. డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను ఇసుక రూ.202, నదిచాగిలో రూ.40, గుడికంబాలిలో రూ.39, మరళి-2లో రూ.40గా నిర్ణయించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు, ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఇసుకను వినియోగదారులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. కర్నూలు నగరానికి ఇటు తుంగభద్ర, అటు హంద్రీ నదులున్నాయి. ఆయా ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల నుంచి రూ.3,500, రూ.4 వేల వరకు అమ్ముకుంటున్నారు.

నంద్యాల జిల్లా కేంద్రానికి వైఎస్సార్ కడప జిల్లా పెన్నా నది నుంచి ఇసుక సరఫరా అవుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంప్ యార్డుల్లో టన్ను ఇసుక రూ.770కు విక్రయించాల్సి ఉండగా రూ.850, రూ.950కు అమ్ముతున్నారు. ఇక్కడ ఒక ట్రాక్టర్ ఇసుక రూ.4,500పైగా పలుకుతోంది.

ఆళ్లగడ్డలో ఇసుక డంప్‌యార్డు నామమాత్రంగా ఉంది. జమ్మలమడుగు నుంచి ప్రైవేటు వ్యాపారులు వచ్చి ఇసుక విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.7 వేల నుంచి రూ.7,200కు పైగా అమ్ముతుండటం గమనార్హం.

## ప్రమాదపుటంచున డీజిల్ బంక్

బద్వేలు : సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే అప్రమత్తంకావాలి. ఏమాత్రం ఆలస్యం చేసినా మూల్యం చెల్లించుకోకతప్పదు. ఇటీవల వరుస వర్షాల కారణంగా బద్వేలు ఆర్టీసీ ప్రాంగణంలో కాలువల్లో మురుగు పేరుకుపోయి పూడికలు పెరిగాయి. పర్యవసనంగా భూగర్భం నుంచి మురుగు ఊట క్రమంగా విస్తరిస్తోంది. ఇక్కడ లక్షలాది రూపాయల విలువకల 50కిపైగా బస్సులున్నాయి. దీంతోపాటుగా అతిముఖ్యమైన డీజిల్ బంక్ ఉంది. రవాణా సంస్థకు చెందిన వాహనాలకు ఇక్కడి నుంచే డీజిల్‌ను నింపుతున్నారు. ఇక్కడ చుట్టూ నీరు నిల్వ ఉండటం వల్ల డీజిల్ బంక్‌లోకి ఊట దిగే ప్రమాదం పొంచి ఉంది. దీంతో అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ దుస్థితిని నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో అటు ఉద్యోగులకు.. ఇటు లక్షలాది రూపాయల విలువైన బస్సుల రక్షణ కరవవుతోంది. ఎగువన నిలబడిన నీరు, పూడికతో నిండిన మురుగు కాలువతో ఆర్టీసీ గ్యారేజీని ఊట ఎత్తేలా చేసింది. అడపాదడపా కురిసిన వర్షాలకు మురుగు, వర్షపు నీరు గత నెలరోజులుగా



నిల్వ చేరడంతో ఇక్కడి సిబ్బంది విధులకు ఆటంకంగా మారింది.

**చిత్తశుద్ధి కరవు**

ఎగువనున్న నీటిని తొలగించి కాలువలో పూడిక తీస్తే ఈ సమస్యకు కొంత ఉపశమనం కలుగనుంది. ఆ దిశగా పురపాలక, ఆర్టీసీ అధికారులు అడుగులు వేయకపోవడంతో గ్యారేజీ పరిస్థితి దారుణంగా తయారైంది. ఊట నీరు పారి ఆవరణ అంతా పాచి పట్టింది. దీంతో డ్రైవర్లు, కండెక్టర్లు ఉద్యోగులు తరచూ జారి కిందపడి ఒళ్లు హూనం చేసుకుంటున్నారు.

**వ్యాధులతో ఆందోళన** దోమలు కూడా వ్యాప్తి చెందుతుండడంతో ప్రమాదకర జబ్బులు వ్యాపిస్తున్నాయి. మలేరియా, డెంగీ, చికున్‌గన్యా లాంటి వ్యాధులను కలుగ జేస్తున్నాయి. ఎప్పుడూ నీరు నిల్వ వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. బస్సుల మరమ్మతులు చేసే పిట్లలోను నీట ఊట పోటెత్తడంతో మెకానిక్‌లు బస్సులను రిపేరు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. వివిధ విభాగాల ఉద్యోగులు మొత్తం 250 మందికి పైగా విధులను నిర్వహిస్తున్నారు. ఈ సమస్యను బద్వేలు ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్‌తో ప్రస్తావించగా పురపాలక అధికారులకు ఈ సమస్యను తెలిపామన్నారు.

## పెన్నా ఒడి.. ఖనిజ సంపదకు పెన్నిధి

జమ్మలమడుగు : జమ్మలమడుగు నియోజకవర్గంలో అపారమైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉంది. నాపరాయి(కడప స్లాబ్)ని గృహోపకరణాలకు, సున్నపు రాయి సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగిస్తున్నారు. ఎర్రగుంట్ల మండలంలో మూడు, మైలవరం మండల ంలో ఒకటి సిమెంటు పరిశ్రమ ఉన్నా, మరో నాలుగైదు పరిశ్రమలకు సరిపడా సున్నపు రాయి నిక్షేపాలు ఈ ప్రాంతంలో ఉండడం గమనార్హం. సద్వినియోగం చేసుకుంటే పరిశ్రమల ఏర్పాటుతో వేల మందికి ఉపాధి లభిస్తుంది.

**ఇతర ప్రాంతాలకు కడప బండలు**

ఒక్క ఎర్రగుంట్ల ప్రాంతంలోనే సుమారు 150 వరకు నాపరాయి గనులున్నాయి. నిడిజివ్వి, కదిరేవారిపల్లె, చిలంకూరు తదితర ప్రాంతాల్లోనూ విస్తరించాయి. జమ్మలమడుగు ప్రాంతంలో లభించే నాపరాయికి తమిళనాడులో గిరాకీ ఎక్కువ. స్థానికంగా కడప బండలు అని పిలుచుకునే పాలిష్ చేసిన వాటిని ఆ రాష్ట్రంలోని సేలం, ఈరోడ్, చెన్నై, చెంగల్‌పట్టు, పుదుచ్చేరి ప్రాంతాలకు తరలిస్తుంటారు.

పాలిష్ చేసిన బండలు ప్రతి రోజూ 10 నుంచి 20 లోడ్‌ల వరకు తరలి వెళ్తుంటాయి. తమిళనాడు తర్వాత నెల్లూరు జిల్లాకు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. ఒక చదరపు అడుగు తమిళనాడులో రూ. 30, మన ప్రాంతంలో అయితే రూ. 20కు విక్రయిస్తున్నారు.

ఇల్లు కట్టేందుకు, చప్పట, ప్రహరీ, పాలిష్ చేసిన వాటిని కిచెన్, అల్మారాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు.

**కేవలం పది శాతమే వెలికితీత**

జమ్మలమడుగు మండలంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో సున్నపురాయి నిక్షేపాలున్నాయి. లైమ్‌స్టోన్ సుమారు మూడు వేల ఎకరాల్లో ఉన్నట్లు అంచనా. మైలవరంలోని గొల్లపల్లె, మాధవాపురం, నవాబుపేట, చిన్నకొమ్మెర్ల పెద్ద కొమ్మెర్ల, జి.ఉప్పలపాడు, పెద్దముడియం మండలం చిన్న పసుపుల తదితర గ్రామాల్లో మూడు వేల ఎకరాలకు పైగా నాపరాయి, సున్నపురాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఇంతవరకు కేవలం పది శాతం మాత్రమే నాపరాయిని వెలికి తీసి ఉంటారని మైనింగ్ అధికారుల అంచనా.

## గుండ్లకమ్మకు గుండె కోత!

ఒంగోలు : బోరు తవ్వాల్సిన పనిలేదు. ఎవరికి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు.. ట్యాంకరు ఉంటే చాలు నెలకు రూ.లక్షలు వెనకేసుకోవచ్చు. గుండ్లకమ్మ జలాశయం కొంతమందికి కాసులు కురిపించే కల్పవృక్షంగా మారింది.. బాహాటంగా జలాశయం నుంచి నీటిని తోడేస్తూ జేబులు నింపుకొంటున్నారు. మామూళ్ల మత్తులో జిల్లా అధికార యంత్రాంగం కిమ్మనకుండా చోద్యం చూస్తోంది. ఖరీఫ్‌లో 62 వేలు, రబీలో 80 వేల ఎకరాలకు సాగునీరందించేవిధంగా గుండ్లకమ్మ జలాశయం నిర్మించారు. ఇక్కడ నీటి పథకం ద్వారా 69 గ్రామాల ప్రజలకు తాగునీరందిస్తున్నారు. రెండు ప్రధాన కాలువల ద్వారా గ్రామాల్లోని కొన్ని చెరువులు నింపుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చడమే తొలి ప్రాధాన్యంగా నిర్వహణ సాగుతోంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో జలాశయంలో 3 టీఎంసీల మేర నీళ్లు చేరడంతో పూర్తిస్థాయిలో నిండింది.

**మోటార్లతో తోడేస్తూ...**

లక్షలాది మంది ప్రజల తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తున్న ఈ జలాశయంలోని నీటిని కొంతమంది దొడ్డిదారిన కొందరు తోడేస్తున్నారు. మద్దిపాడు మండలం మల్లవరంలో జలాశయం ఉండగా, నదీ జలాలు వెనక్కి వచ్చి బూరేపల్లి, అన్నంగి గ్రామాలను తాకుతాయి. ఇక్కడ డీజిల్ మోటార్లు పెట్టి నది నుంచి నీటిని ట్యాంకర్లకు నింపుతున్నారు. పట్టపగలే బాహాటంగా పని కానిస్తున్నా, విలువైన నదీ జలాలతో అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**రూ.లక్షలు ఆర్జిస్తూ...**

స్థానికంగా కొంతమంది పెద్దలు నీటి వ్యాపారం సాగిస్తున్నారు. ఒక్కో ట్యాంకరుకు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు. వేసవి కాలంలో నీళ్లు బాగా వెనక్కి వెళ్లినప్పుడు ఒక్కో ట్యాంకరుకు రూ.2 వేలు చొప్పున రాబడుతున్నారు. సగటున రోజుకు 50 ట్యాంకర్ల వరకు నీటిని గ్రోత్ సెంటరులోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు సగం మేర పోయినా నెలకు రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. పరిశ్రమల నిర్వాహకులు నీటికి చెల్లించే డబ్బులను వీరు వెనకేసుకుంటున్నారు. జల సంపదపై వచ్చే సొమ్ములను ఖజానాకు జమయ్యేవిధంగా చూస్తే ఏడాది పొడవునా ఆదాయం సమకూరేది. మరోవైపు ప్రజల గొంతు తడపాల్సిన నీటిని చౌర్యం చేసి అమ్ముకోవడంపై సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ద ృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారంతా వాపోతున్నారు.

చురకలు



## కొత్త ఏడాది.. మరో బోల్డ్ స్టెప్.. భయపడేదేలేదు..

న్యూస్ రీడర్ గా కెరీర్ ను ఆరంభించి.. యాంకర్ గా జబర్దస్త్ లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంది అనసూయ. ముఖ్యంగా బుల్లితెరకు గ్లామర్ ను పరిచయం చేస్తూ.. కామెడీ కార్యక్రమాలలో కూడా గ్లామర్ ఒలకబోసి తన అందాలతో మరింత పాపులారిటీ సంపాదించుకుంది. ముఖ్యంగా తన వాక్చాతుర్యంతో టిఆర్పి రేటింగ్ అమాంతం పెంచేసి.. దాదాపు 9 ఏళ్ల పాటు నిర్విరామంగా జబర్దస్త్ లో కొనసాగి అందరి మన్ననలు పొందింది. అలా జబర్దస్త్ లో యాంకర్ గా భారీ పాపులారిటీ అందుకున్న ఈమె సినిమాలలో నటిగా అవకాశం అందుకొని.. మరింత క్రేజ్ దక్కించుకుంది. రంగస్థలంలో రంగమ్మత్తగా.. పుష్ప సినిమాలో దాక్షాయినిగా తన పాత్రలతో మెస్మరైజ్ చేసింది. అంతేకాదు రజాకార్ లాంటి మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రాలలో కూడా నటించి నటిగా తానేంటో నిరూపించుకుంది అనసూయ. అటు సినిమాలతోనే కాదు ఇటు సమాజంలో జరిగే పలు అంశాలపై కూడా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా స్పందించే ఈమె.. ఇటు బోల్డ్ గా ఫోటోలు షేర్ చేసి అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటుంది. అంతేకాదు ఎవరు ఏమనుకున్నా తన లైఫ్ తన ఇష్టం అంటూ స్వేచ్ఛాజీవితాన్ని గడుపుతూ అడ్డొచ్చిన వారికి లెఫ్ట్ అండ్ రైట్ ఇస్తూ తనదైన శైలిలో




దూసుకుపోతోంది. ఇక అలాంటి ఈమె న్యూ ఇయర్ 2026 సందర్భంగా ఇన్స్టాగ్రామ్ వేదికగా స్విమ్ సూట్ లో కొన్ని ఫోటోలు షేర్ చేసి మరోసారి రచ్చకు తెరలేపింది. అసలే గత కొన్ని రోజులుగా మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్లకు అనసూయ తనదైన శైలిలో స్పందించింది. అటు శివాజీ కూడా ఈమె వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నేను మిమ్మల్ని ఇందులోకి లాగలేదు. కానీ మీరు అడ్డొచ్చారు.. తప్పకుండా మీరు రుణం తీర్చుకుంటాను అంటూ శివాజీ కామెంట్లు చేశారు.. అయితే ఎవరు ఎన్ని కామెంట్లు చేసినా తాను మాత్రం తగ్గేదేలే అని.. ఎవరికి భయపడను అంటూ మరొకసారి అందాలు ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది అనసూయ. దీనికి తోడు అదిరిపోయే క్యాప్షన్ కూడా జోడించింది ఈ ముద్దుగుమ్మ.. “అనసూయ.. అదే మహిళ.. అదే స్పైన్.. గ్రోత్.. ప్రశాంతత.. ఎటువంటి నాన్సెన్స్ లేకుండా ఈ సంవత్సరం కొనసాగాలని కోరుకుంటూ కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను. నాకు ఇష్టమైనవి చేస్తాను. ఎలాంటి ఇబ్బంది లేకుండా తింటాను. లిమిట్స్ లేకుండా ప్రయాణిస్తాను. భయమన్నదే లేకుండా మాట్లాడుతాను. గొప్పగా జీవిస్తాను. ఎక్కువగా ప్రేమిస్తాను. ఈ న్యూ ఇయర్లో మరింత ప్రకాశవంతంగా వెలుగుతూ నాయిస్ కంటే కూడా మీ ధైర్యం ఎక్కువగా ఉండాలని.. అందరికీ హ్యాపీ 2026” అంటూ ఈ ఫోటోలను పోస్ట్ చేసింది అనసూయ.. మొత్తానికైతే తన గురించి ఎవరు ఎన్ని రకాలుగా చర్చించినా తన జీవితం తన ఇష్టం అంటూ మరోసారి ఈ ఫోటోలతో కొత్త ఏడాది కొత్త నిర?యాలతో ఎవరికీ భయపడను అంటూ బోల్డ్ గా స్టేట్మెంట్ ఇచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది అనసూయ. ప్రస్తుతం కొత్త సంవత్సరం సందర్భంగా ఈమె షేర్ చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది.

## కీర్తికి సక్సెస్ దక్కేదెప్పుడు?

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ ఈ మధ్య వరుస ఫ్లాపులను ఎదుర్కొంటుంది. గత కొన్నాళ్లుగా కీర్తి నుంచి వచ్చిన ఏ సినిమాలూ తెలుగులో పెద్దగా ఆడటం లేదు. రీసెంట్ గా కీర్తి నటించిన రివాల్వర్ రీటా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాలతో రిలీజైన రివాల్వర్ రీటా కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది.

**ఫలితం లేకుండా పోయిన కీర్తి ప్రమోషన్స్..** స్వయంగా కీర్తి సురేష్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొని సినిమాను ప్రమోట్ చేసినప్పటికీ అది కూడా ఏ మాత్రం మెరుగైన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది.

ఇంకా చెప్పాలంటే చాలా మందికి అసలు ఆ సినిమా ఒకటి రిలీజైంది అని కూడా తెలియదు. దానికి తోడు సినిమాలో కంటెంట్ కూడా పెద్దగా క్లిక్ అవకపోవడంతో రివాల్వర్ రీటా మొదటి రోజే డిజాస్టర్ గా నిలిచింది.



**కీర్తి ఖాతాలో మరో ఫ్లాపు...** రివాల్వర్ రీటా రిజల్ట్ తో కీర్తి మరోసారి తన ఖాతాలో ఫ్లాపును వేసుకుంది. దీంతో కీర్తి తనకు సక్సెస్ ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తోంది. మొన్నామధ్య కీర్తి తెలుగులో చేసిన ఉప్పు కప్పురంబు సినిమా కూడా డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజవగా, అది కూడా అంచనాలను అందుకోలేకపోయింది. ఇక రఘుతాత మూవీ కూడా అంతే, సినిమా కూడా ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. కాగా కీర్తి భోళాశంకర్ తర్వాత తెలుగులో డైరెక్ట్ సినిమాలు చేసింది లేదు.

పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న కీర్తి సురేష్ ఇప్పుడా గ్యాప్ ను పూరించాలని వరుస సినిమాలను లైన్ లో పెట్టి అందులో భాగంగానే రివాల్వర్ రీటాను ఆడియన్స్ ముందుకు తీసుకొస్తే, అది కాస్తా ఫ్లాపుగా నిలిచింది. ప్రస్తుతం కీర్తి విజయ్ దేవరకొండ సరసన దిల్ రాజు బ్యానర్ లో ఓ సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా అయినా కీర్తికి మంచి సక్సెస్ ను అందిస్తుందేమో చూడాలి.




## కొత్త పోస్టర్లతో ఆకట్టుకున్న సెలబ్రిటీస్!



కొత్త ఏడాది అటు ప్రేక్షకులలో సరికొత్త జోష్ నింపడానికి ఇప్పటికే కుర్ర హీరోలను మొదలుకొని స్టార్ హీరోల వరకు తమ సినిమాలకు సంబంధించి కొత్త పోస్టర్లను విడుదల చేస్తూ అభిమానుల ను ఆకట్టుకుంటున్నారు . అంతేకాదు ఈ కొత్త ఏడాది న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేసిన ప్రతి పోస్టర్ కూడా ఆడియన్స్ లో అంచనాలు పెంచుతున్నాయి. మరి ఈ నూతన సంవత్సర సందర్భంగా ఎవరెవరు తమ పోస్టర్లతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారో ఇప్పుడు చూద్దాం.

**స్పిరిట్ – ప్రభాస్:** ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్.. మారుతీ దర్శకత్వంలో ది రాజా సాబ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కాబోతోంది. అలాగే మరోవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ సినిమా చేస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ కూడా మొదలవగా.. తాజాగా న్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి 12 గంటలకు ఈ సినిమా నుండి ప్రభాస్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో ప్రభాస్ తోపాటు హీరోయిన్ త్రిప్తి కూడా ఉండడం గమనార్హం.

**ది బ్లాక్ గోల్డ్ –సంయుక్త మీనన్:** సార్ , విరూపాక్ష వంటి చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న సంయుక్త మీనన్ తాజాగా లేడీ ఓరియంటెడ్ మూవీ ది బ్లాక్ గోల్డ్. ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. సమ్మర్లో రిలీజ్ కానున్న ఈ చిత్రం నుండి తాజాగా మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ను రిలీజ్ చేశారు. ఇందులో సంయుక్త గాయాలతో ఒక చేత్తో గన్ను పట్టుకుని.. సీరియస్ లుక్కులో కనిపించింది. యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రాబోతున్న ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఇక ఈ చిత్రాన్ని యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహించగా.. మాగంటి పిక్చర్స్ తో హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా నిర్మించారు.

**ది పారడైజ్ – నాని:** ఇదివరకే దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న నాని మళ్లీ అదే డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో ది పారడైజ్ అనే సినిమాను చేస్తున్నారు. మార్చి 26న విడుదల కాబోతున్న ఈ సినిమా నుంచి తాజాగా నాని పోస్టర్ ను పంచుకున్నారు మేకర్స్. ఇందులో నాని కళ్ళకు గ్లాసెస్ పెట్టుకొని జడ వేసుకొని యాక్షన్ లుక్కులో కనిపించారు. జడల్ జమన అంటూ నాని పోస్టర్ ను చిత్ర బృందం పంచుకుంది.

**ఉస్తాద్ భగత్ సింగ్ – పవన్ కళ్యాణ్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గతంలో హరీష్ శంకర్ దర్శకత్వంలో గబ్బర్ సింగ్ సినిమా చేసి మంచి విజయం అందుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్ తో 13 ఏళ్ల తర్వాత ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా చేస్తున్నారు. ఈ న్యూ ఇయర్ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్టైలిష్ గా ఒక చేతిలో గన్ మరొక చేతిలో రేడియో పట్టుకున్న ఆయన పోస్టర్ను పంచుకున్నారు మేకర్స్. అంతేకాదు మరో కొత్త ప్రాజెక్టును కూడా ఆయన ప్రకటించారు. ఇక వీటితోపాటు అఖిల్ – లెనిన్, సూర్య – కరుప్పు, ప్రభాస్ – ది రాజా సాబ్, రవితేజ – భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ దళపతి – జననాయగన్ చిత్రాలతో పాటు మరికొన్ని పోస్టర్లు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

## టాలీవుడ్ లో మలయాళం కిక్కు



తెలుగు సినిమా రేంజ్ పెరిగే కొద్దీ విలన్ల ఎంపికలో కూడా భారీ మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు మన హీరోలను ఢీకొట్టాలంటే బాలీవుడ్ నుంచి పవర్ఫుల్ బాడీ ఉన్న నటులను దిగుమతి చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. కండల కంటే కళ్లలో కసిని, నటనలో వైవిధ్యాన్ని చూపించే నటుల వైపు మన దర్శకులు మొగ్గు చూపుతున్నారు. ఆ అన్వేషణలో వారికి దొరికిన అద్భుతమైన గని ‘మలయాళ ఇండస్ట్రీ’. ఇప్పుడు టాలీవుడ్ లో మాలీవుడ్ విలన్ల హవా గట్టిగా నడుస్తోంది. ఒక హీరో ఎలివేట్ అవ్వాలంటే విలన్ పాత్ర అంతకంటే బలంగా ఉండాలి. ఇప్పుడు మన పాన్ ఇండియా సినిమాల్లో సరిగ్గా అదే జరుగుతోంది. కేరళలో సూపర్ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోలు సైతం, మన తెలుగు సినిమాల్లో నెగిటివ్ రోల్స్ చేయడానికి సై అంటున్నారు. కేవలం గెస్ట్ రోల్స్ లా కాకుండా, సినిమాను మలుపు తిప్పే క్రూరమైన పాత్రల్లో వారు కనిపిస్తుండటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న ‘వారణాసి’ సినిమా కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ను ఎంచుకోవడం సంచలనం సృష్టించింది. ఇందులో ఆయన ‘కుంభా’ అనే క్రూరమైన విలన్ గా కనిపించబోతున్నారు. మొదట ఒక వికలాంగుడిలా కనిపించినా, లోపల ఎంతటి రాక్షసుడు దాగి ఉంటాడో తెరపై చూడాల్సిందే. అలాగే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలో మరో మలయాళ హీరో టోవినో థామస్ విలన్ గా చేస్తున్నారనే వార్త అంచనాలను పెంచేసింది. దీనిపై అధికారిక ప్రకటన లేకపోయినా, బజ్ మాత్రం గట్టిగానే ఉంది. ఇక ‘పుష్ప’ సినిమాతో ఫహద్ ఫాజిల్ తెలుగులో విలనిజం స్థాయిని ఎలా పెంచారో చూశాం. ఆయన భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర పుష్ప 2లో మరింత బాగా క్లిక్కయ్యింది. మరోవైపు షైన్ టామ్ చాకో వరుస పెట్టి తెలుగు సినిమాలు చేస్తున్నాడు. నాని ‘దసరా’ నుంచి మొదలుపెడితే ఎన్టీఆర్ ‘దేవర’, బాలయ్య ‘డాకు మహారాజ్’, నితిన్ ‘రాబిన్ హుడ్’ వరకు అన్నింట్లోనూ వైవిధ్యమైన విలన్ పాత్రలతో గుర్తింపుని అందుకున్నాడు. కేరళలో హీరోలుగా సినిమాలు చేస్తూనే, తెలుగులో ఇలా పవర్ ఫుల్ విలన్లుగా మారడం వారి నటనా ప్రతిభకు నిదర్శనం. రొటీన్ అరుపులు, కేకలు కాకుండా.. తమదైన బాడీ లాంగ్వేజ్ తో భయపెట్టే విలన్లుగా వారు మన ఆడియన్స్ ను మెప్పిస్తున్నారు. అందుకే సునీల్ శెట్టి లాంటి బాలీవుడ్ స్టార్స్ కూడా “టాలీవుడ్ ఇప్పుడు కేవలం బాలీవుడ్ వైపే చూడటం లేదు, దేశమంతా వెతుకుతోంది” అని వ్యాఖ్యానించారు. మొత్తానికి ఈ ‘మాలీవుడ్ విలన్స్’ ఎంట్రీతో తెలుగు సినిమా స్క్రీన్ పై కొత్త ఎలివేషన్స్ కనిపిస్తున్నాయి. మన హీరోల మాస్ ఇమేజ్ కు, మలయాళ నటుల రా అండ్ రస్టిక్ పర్ఫార్మెన్స్ తోడైతే వచ్చే కిక్కే వేరు. రాబోయే రోజుల్లో ఈ లిస్టులో ఇంకెంతమంది మలయాళ స్టార్లు చేరతారో చూడాలి.

## విదేశాల్లో షూటింగ్ అప్పుడు నిధి ఏం చేస్తుందంటే?

సౌత్ బ్యూటీ నిధి అగర్వాల్ హీరోయిన్ గా వస్తున్న సినిమా ది రాజా సాబ్. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన సినిమాకు మారుతి దర్శకత్వం వహించారు. కామెడీ హార్రర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ మూవీలో నిధి అగర్వాల్ తో పాటూ మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు.

సంక్రాంతి కానుకగా జనవరి 9న రాజా సాబ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే మీడియా ముందుకొచ్చి రాజా సాబ్ ను తెగ ప్రమోట్ చేస్తున్నారు నిధి. అయితే ప్రస్తుతం నిధి పేరు టాలీవుడ్ ఇండస్ట్రీలో మార్మోగిపోతుంది. రాజా సాబ్ ప్రమోషన్స్ లో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న నిధి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడిస్తున్నారు.

**విదేశాలకు వెళ్లినప్పుడు నేనే వండుకుంటా...** తాను షూటింగ్ కోసం గ్రీస్ వెళ్లినప్పుడు బ్రేక్ఫాస్ట్, డిన్నర్ కోసం సొంత గ్యాస్ సిలిండర్, పాన్, కిరాణా సామాగ్రిని తీసుకెళ్లానని, బయటకు వెళ్లినప్పుడు హెల్తీ ఫుడ్ కావాలంటే ఇవి తప్పవని, అన్నీ తీసుకెళ్లి తానే సొంతంగా



వండుకుని బ్రేక్ఫాస్ట్, డిన్నర్ హెల్తీగా తింటానని నిధి చెప్పుకొచ్చారు. విదేశాలకు వెళ్లినప్పుడు తాను ఫుడ్ గా బ్రెడ్, అవకాడో, ఎగ్స్ ఎక్కువగా తీసుకుంటానని నిధి తెలిపారు.

**షూటింగ్ కు ఇబ్బంది రాకూడదనే.....** బయటకు వెళ్లినప్పుడు హెల్తీ ఫుడ్ తినకపోతే ఆరోగ్యం పాడవుతుందని, అందుకే ఆరోగ్యంగా ఉండేందుకు తానే మంచి ఫుడ్ ను వండుకుని తింటానని, షూటింగ్ కు ఎలాంటి ఇబ్బంది కాకుండా ఉండేందుకే తాను ఇలా సెటప్ చేసుకున్నట్టు నిధి చెప్పుకొచ్చారు. అంతేకాదు, ఇది మంచి ఐడియా అని, ఎవరికైనా నచ్చితే ఫాలో అవొచ్చని కూడా ఆమె తెలిపారు.

**ప్రభాస్ ట్రూ డార్లింగ్..** చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ప్రభాస్ గురించి మాట్లాడుతూ, ఆయన ట్రూ డార్లింగ్ అని, చాలా కైండ్, రియల్లీ టాలెంటెడ్ అని, చాలా హంబుల్ మరియు ఎంతో అదుతేమైన వ్యక్తి అని నిధి చెప్పుకొచ్చారు. ఇక నిధి విషయానికొస్తే ఇస్మార్ట్ శంకర్ మూవీతో బ్లాక్ బస్టర్ అందుకున్న అమ్మడు రీసెంట్ గా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన హరి హర వీరమల్లు సినిమాలో నటించారు. కానీ ఆ సినిమా తనకు నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం నిధి ఆశలన్నీ రాజా సాబ్ పైనే ఉన్నాయి.

## ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది

ఎవరి లైఫ్ ఏ క్షణాన ఎటు మలుపు తిరుగుతుందో ఎవరూ చెప్పలేం. జీవితంలో తర్వాత ఫలానా జరుగుతుందని ముందే ఊహించలేం. అందుకే జీవితమంటే ఊహాతీతం అంటుంటారు. సినీ ఇండస్ట్రీలో కూడా దీనికి మినహాయింపేమీ కాదు. అసలు ఎవరూ ఊహించని విధంగా కొందరు స్టార్లు అవడం, ఓవర్ నైట్ లో క్రేజ్ ఏర్పడటం జరుగుతుంటాయి.

**డిసెంబర్ లో కీర్తి నుంచి రెండు సినిమాలు...** అలా ఇండస్ట్రీలోకి ఇప్పటికే ఎంతోమంది తమ లక్ ను టెస్ట్ చేసుకుంటున్నారు. ఇక అసలు విషయానికొస్తే ఉప్పెన సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన కృతి శెట్టి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నారు. అందులో ఒకటి విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కాగా, రెండోది నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తీ హీరగా తెరకెక్కిన అన్నగారు వస్తున్నారు. ఈ రెండు సినిమాలూ డిసెంబర్ లోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



**ఉప్పెన ఛాన్స్ ఎలా వచ్చిందంటే?...** ఇక అసలు విషయానికొస్తే కృతి శెట్టి తన తాజా సినిమా LIK ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే రెండు సాంగ్స్ రిలీజవగా, వాటికి ఆడియన్స్ నుంచి అంతంతమాత్రంగానే రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ లో కృతి తనకు ఉప్పెన సినిమాలో అవకాశమెలా వచ్చిందో వెల్లడించారు. ఓ కమర్షియల్ యాడ్ షూటింగ్ కోసం వెళ్లిన తనకు అనుకోకుండా ఆ ఛాన్స్ వచ్చిందని కృతి పేర్కొన్నారు. ఒక రోజు ఓ కమర్షియల్ యాడ్ షూటింగ్ ఆడిషన్ కోసం వెళ్లిన తనను అది పూర్తయ్యాక పికప్ చేసుకుంటానని తన తండ్రి చెప్పారని, తన ఆడిషన్ పూర్తై తండ్రి ఎంతకీ రాకపోవడంతో పక్కనే ఉన్న స్టూడియోలోకి వెళ్లానని, అక్కడో మరో ఆడిషన్ జరుగుతుందని, అక్కడ తనను చూసి మూవీస్ పై ఇంట్రెస్ట్ ఉందా అని అడిగితే ఏం చెప్పాలో తెలియక తన తల్లి ఫోన్ నెంబర్ ఇచ్చి వచ్చానని, ఆ తర్వాత టీమ్ తన తల్లికి కాల్ చేసి ఉప్పెనలో ఛాన్స్ ఇచ్చారని చెప్పారు. పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా కృతి శెట్టి హీరోయిన్ గా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన ఉప్పెన మూవీ ఎంత పెద్ద హిట్ అయిందో, ఆ సినిమా తర్వాత కృతికి ఎలాంటి స్టార్డమ్ వచ్చిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఉప్పెన సినిమా కృతిని ఓవర్ నైట్ స్టార్ ను చేసినప్పటికీ దాన్ని అమ్మడు కంటిన్యూ చేయలేకపోయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536